www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
బుధవారం | 24-9-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 177
శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, శుక్లపక్షం; తిథి: తదియ పూర్తి; నక్షత్రం: చిత్ర సా.4:17 తదుపరి స్వాతి; వర్జ్యం: రా.10:33-12:20; దుర్ముహూర్తం: ఉ.11:43-12:31; అమృతఘడియలు: ఉ.9:11-10:57; రాహుకాలం: మ.12:00-1:30; సూర్యోదయం: 6:07; సూర్యాస్తమయం: 6:06 | వరంగల్
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

లొంగుబాటు యత్నాల్లో
మల్లోజుల వేణుగోపాల్! 3

పోలీసులకు కోవర్టుగా మారిన నక్సల్ అగ్రనేత
దాంట్లో భాగంగానే సాయుధ పోరాట విరమణ లేఖ
మావోయిస్టు నాయకత్వాన్ని బయటకు రప్పించి, మట్టుబెట్టే పోలీసుల వ్యూహంలో భాగమే ఇదంతా!
మాజీ మావోయిస్టులు, ప్రజాసంఘాల విశ్లేషణలు
కశ్మీర్ నుంచి దండకారణ్యానికి భారీగా బలగాలు 2



స్వర్ణం.. సరికొత్త గరిష్ఠం!

10 గ్రాముల ధర రూ.1,18,900
ఒక్కరోజులో రూ.2,700 పెరుగుదల
అదే బాటలో వెండి.. రూ.3,220 పెరిగి కిలో రూ.1.39 లక్షలకు చేరిన వైనం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 23: బంగారం ధర భగ్గుమంటోంది. పండగల కాలంలో పసిడి కొండెక్కుతోంది. రోజురోజుకూ సామాన్యులు అందుకోలేని స్థాయికి ఎగబాకుతోంది. మంగళవారం ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి (99.9 శాతం స్వచ్ఛత) బంగారం ధర ఏకంగా రూ.2,700 పెరిగి సరికొత్త జీవితకాల రికార్డు స్థాయి రూ.1,18,900కి చేరింది. 99.5% స్వచ్ఛత కలిగిన స్వర్ణం ధర కూడా రూ.2,650 పెరుగుదలతో ఆల్‌టైం గరిష్ఠ స్థాయి రూ.1,18,300కి ఎగబాకింది. కిలో వెండి సైతం రూ.3,220 పెరిగి రూ.1,39,600 ధర పలికింది. అంతర్జాతీయ

మిగతా 10వ పేజీలో...



71వ జాతీయ చలనచిత్ర అవార్డుల కార్యక్రమంలో మోహన్‌లాల్, షారుఖ్‌ఖాన్, రాణీ ముఖర్జీ, విక్రాంత్

ఘనంగా జాతీయ సినీ అవార్డుల
ప్రదానోత్సవం

రాష్ట్రపతి ముర్ము చేతుల మీదుగా ప్రదానం
దాదాసాహెబ్ ఫాల్కే అందుకున్న మోహన్‌లాల్
ఉత్తమ నటుడి అవార్డును సంయుక్తంగా తీసుకున్న షారుక్ ఖాన్, విక్రాంత్ మస్సే 10
ఉత్తమ నటి అవార్డు స్వీకరించిన రాణీ ముఖర్జీ

ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగం నిర్మాణానికి
కేంద్రం ఓకే!



ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగం అలైన్‌మెంట్ నమూనా

రాష్ట్రం ఖరారు చేసిన అలైన్‌మెంట్ పరిశీలించాక.. మోర్త్ పరిధిలో నిర్మించాలన్న యోచనలో కేంద్రం
9న ఢిల్లీలో జరిగిన భేటీలో ఈ మేరకు నిర్ణయం
సీఎం రేవంత్ సమీక్షలోనూ కేంద్ర అధికారుల వెల్లడి
201 కి.మీ. అలైన్‌మెంట్‌ను సమర్పించనున్న సర్కారు

హైదరాబాద్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) దక్షిణ భాగం నిర్మాణ విషయంపై స్పష్టత వచ్చింది! రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకున్న కేంద్రం ఈ మార్గాన్నీ నిర్మించేందుకు సుముఖత వ్యక్తం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఖరారు చేసిన అలైన్‌మెంట్‌ను మరోసారి పరిశీలించాలని భావిస్తోంది. ఆ తర్వాత దక్షిణ భాగాన్ని కేంద్ర రోడ్డు, రవాణా శాఖ (మోర్త్) పరిధిలో చేపట్టాలనే యోచనలో ఉన్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఇదే విషయాన్ని తాజాగా సోమవారం రాష్ట్ర సచివాలయంలో కేంద్ర ప్రాజెక్టులపై నిర్వహించిన సమీక్షలో పాల్గొన్న ఢిల్లీ అధికారులు సీఎం రేవంత్‌కు తెలిపారు. అంటే ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగంతో పాటు దక్షిణ భాగాన్ని కూడా కేంద్రమే నిర్మించనుంది. ప్రస్తుతం ఉత్తర భాగం నిర్మాణాన్ని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) పరిధిలో చేపడుతున్నారు. దక్షిణ భాగాన్ని మోర్త్ పరిధిలో చేపట్టాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఖరారు చేసిన 201 కిలోమీటర్ల దక్షిణ భాగం అలైన్‌మెంట్‌ను కేంద్రానికి సమర్పించగా.. తాజాగా మరోసారి పూర్తి వివరాలతో కూడిన అలైన్‌మెంట్‌ను నివేదించనున్నారు. దాన్ని పరిశీలించిన తర్వాత ఈ మార్గాన్ని మోర్త్, ఎన్‌హెచ్ఏఐల్లో దేని

మిగతా 13వ పేజీలో...



సమ్మక్క, సారలమ్మ గద్దెల వద్ద సీఎం రేవంత్‌రెడ్డి పూజలు. చిత్రంలో మంత్రులు సురేఖ, పొంగులేటి

మేడారం జాతరకు జాతీయ హోదా ఇవ్వాలి

కుంభమేళాకు వేల కోట్లు ఇస్తున్న కేంద్రం.. ఆదివాసీ మహా జాతరకు ఎందుకివ్వదు?
వన దేవతల గద్దెల పునఃనిర్మాణం బాధ్యత కాదు.. భావోద్వేగం
వెయ్యేళ్లు నిలిచేలా రాతితో నిర్మాణం
సంప్రదాయంలో తేడా రాకుండా పనులు
పోరాటానికి, పౌరుషానికి స్ఫూర్తి సమ్మక్క సారలమ్మ: సీఎం రేవంత్‌రెడ్డి 13
పునఃనిర్మాణ పనులకు శ్రీకారం
68 కిలోల బంగారంతో మొక్కు సమర్పణ
సీడబ్ల్యూసీ సమావేశంలో పాల్గొనేందుకు పట్నాకు సీఎం రేవంత్ పయనం

స్థానిక పోరులో
రిజర్వేషన్ల ఖరారు!



నేటి సాయంత్రానికి సర్కారుకు నివేదికలు
వార్డు సభ్యుడి నుంచి జడ్పీ చైర్‌పర్సన్ దాకా తేలిన రిజర్వేషన్లు
వాటి ప్రకారం 42శాతంతో రిజర్వేషన్లను ప్రకటించనున్న సర్కార్
అంతకుముందు ప్రత్యేక జీవో విడుదల
ఎన్నికలకు వెళ్లనున్నామని తెలుపుతూ ఎలక్షన్ కమిషన్‌కు లేఖ రాసిన రాష్ట్ర ప్రభుత్వం
దసరాలోపే స్థానిక ఎన్నికల షెడ్యూల్ విడుదలకు అవకాశం

రాష్ట్రంలోని మొత్తం 12,760 గ్రామపంచాయతీల్లో దాదాపు 5,360 గ్రామపంచాయతీలు, 1,12,534 వార్డులకుగాను సుమారు 47,264 వార్డులు బీసీలకు దక్కే అవకాశం కనబడుతోంది. ఇక 5,765 ఎంపీటీసీల్లో దాదాపు 2,421 ఎంపీటీసీలు, 565 ఎంపీపీ, జడ్పీటీసీలకు గాను సుమారు 237 చొప్పున కేటాయింపు జరగనున్నాయి. 31 జడ్పీ చైర్‌పర్సన్ స్థానాల్లో బీసీలకు దాదాపు 13వరకు స్థానాలు దక్కవచ్చని అధికారిక వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

హైదరాబాద్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో కీలకమైన రిజర్వేషన్ల వ్యవహారం పూర్తయింది. రాష్ట్రవ్యాప్తంగా వార్డు సభ్యుడి నుంచి జడ్పీ చైర్‌పర్సన్ వరకు అమలుచేయాల్సిన రిజర్వేషన్ల శాతాన్ని జిల్లాల కలెక్టర్లు, సిబ్బంది తేల్చారు. ఖరారు చేసిన రిజర్వేషన్లకు సంబంధించిన ప్రాథమిక వివరాలను పలు జిల్లాలు ప్రభుత్వానికి పంపాయి. రిజర్వేషన్ల ఖరారుకు రెండ్రోజుల సమయమే ఇవ్వడంతో తప్పు, ఒప్పులను సరిచూసుకునేందుకు మరొకరోజు అదనంగా ప్రభుత్వం అవకాశం కల్పించింది. దాని ప్రకారం ఖరారైన రిజర్వేషన్లు, జనాభా వారీగా, సామాజిక వర్గాలవారీగా ఎలా ఉన్నాయన్న అంశాలపై జిల్లాల కలెక్టర్లు బుధవారం పునఃపరిశీలన చేయనున్నారు. ఆ తర్వాత నివేదికలను సీల్డ్ కవర్లలో ఉంచి సాయంత్రానికి ప్రభుత్వానికి అందజేయనున్నారు. జిల్లాల నుంచి రిజర్వేషన్ల వివరాలన్నీ అందాక పంచాయతీరాజ్ శాఖ వాటిని మరోసారి పరిశీలించనుంది. గతంలో అమలైన

మిగతా 11వ పేజీలో...

బీసీలకు 42%.. రాజ్యాంగ విరుద్ధం! 11
హైకోర్టులో పిటిషన్.. నేడు విచారణ

అవి గిరిజన గ్రామాలేనన్న తీర్పుపై సుప్రీం స్టే
ములుగు జిల్లా మంగపేట మండలంలోని 23 గ్రామాలపై 2 నెలల తర్వాత విచారణ జరపనున్న ధర్మాసనం 11

గ్రూప్-1 అప్పీళ్లపై నేడు విచారణ
హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేసిన టీజీపీఎస్సీ, గ్రూప్ 1 అభ్యర్థులు 13

27 వరకు భారీ వర్షాలు
నేడు, రేపు యెల్లో అలెర్ట్
26, 27న ఆరెంజ్ అలెర్ట్ జారీ
సాగర్ 26 గేట్ల నుంచి కొనసాగుతున్న నీటి విడుదల 3
శ్రీశైలం ప్రాజెక్టుకు పెరిగిన వరద
నిజామాబాద్ జిల్లాలో గోడ కూలి తండ్రీకూతురు దుర్మరణం

1 నుంచి ఆధార్ ఫీజుల పెంపు

హైదరాబాద్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 1 నుంచి ఆధార్ సేవల రుసుములు పెరగనున్నాయి. ఆధార్‌లో తప్పుల సవరణ లేదా వివరాల అప్‌డేట్ కోసం ఇంతవరకు రూ.50 వసూలు చేస్తుండగా రూ.75కు పెంచుతున్నట్లు విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ) తెలిపింది. 7-15 సంవత్సరాల మధ్య వయసు పిల్లలకు, 17 సంవత్సరాల వయసు దాటిన వారికి తప్పనిసరి బయోమెట్రిక్ అప్‌డేట్ రుసుమును రూ.100 నుంచి రూ.125కు పెంచారు. యూఐడీఏఐ పోర్టల్ ద్వారా నేరుగా పొందే సేవల రుసుమును రూ.50 నుంచి రూ.75 పెంచారు. పోయిన ఆధార్ స్థానంలో కొత్తది కావాలంటే దరఖాస్తు ఫీజు రూ.40 చెల్లించాల్సి ఉంటుంది.



తగ్గిన ఎమ్మార్పీ స్టిక్కర్ వేయకుండా పాత ధరలతో వంట నూనెల విక్రయం

జీఎస్టీ తగ్గింపు లాభం..
దుకాణదారులకేనా?

వినియోగదారులకు అరకొరగానే ప్రయోజనం
పన్ను తగ్గింపు తర్వాత కూడా పాత ఎమ్మార్పీలే..
చాలా వరకు ఉత్పత్తులు పాత ధరకే విక్రయం
ధరల నియంత్రణపై కొరవడిన నిఘా
ఉల్టా కొన్ని సరుకులపై ధరల పెంచేశారంటూ వినియోగదారుల్లో ఆందోళన
చాలా సూపర్ మార్కెట్లు, సూపర్ బజార్లలో కనిపించని కొత్త ఎమ్మార్పీల స్టిక్కర్లు
'ఎన్ఏపీ అథారిటీ' ఏం చేస్తోందనే విమర్శలు
సెప్టెంబరు 9 నాటి కేంద్ర మార్గదర్శకాలను పట్టించుకోని అధికారులు, దుకాణదారులు

హైదరాబాద్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): "జీఎస్టీ తగ్గింపు అమల్లోకి రాక ముందు ధరలు అవే.. తగ్గింపు అమల్లోకి వచ్చాకా ధరలు అవే.. మరి పన్ను తగ్గింపు లాభం ఎవరికి? దుకాణదారులకే ప్రయోజనం తప్ప.. కొనుగోలుదారులకు లేదా?".. సాధారణ ప్రజల్లో వ్యక్తమవుతున్న ఆందోళన ఇది. చాలా వస్తువుల ధరల్లో పెద్దగా మార్పేమీ లేదని, కొన్నింటి ధరలు పెంచేశారని వారు వాపోతున్నారు. ధరల నియంత్రణపై సంబంధిత అధికారులు దృష్టి పెట్టాలని డిమాండ్ చేస్తున్నారు. వాస్తవానికి సాధారణ ప్రజలకు బతుకుభారం నుంచి కాస్త ఉపశమనం కల్పించేందుకు

మిగతా 10వ పేజీలో...

'అప్పు'డే 45,900 కోట్లు

అనుమతించిన అప్పుల్లో ఆరు నెలల్లోనే 85 శాతం సేకరించిన రాష్ట్ర సర్కారు
తొలి నాలుగు నెలల్లో రూ.25,900 కోట్లు
తాజాగా 5 వేల కోట్లు.. దీంతో కలిపి ఈ నెలలో ఇప్పటికే 12 వేల కోట్లు సేకరణ
2025-26 ఆర్థిక సంవత్సరం కోసం కేంద్రం అనుమతించిన మొత్తం అప్పు రూ.54,009 కోట్లు
ఇక వచ్చే 6 నెలల్లో దొరికే రుణం రూ.8,109 కోట్లే!



హైదరాబాద్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అప్పుల వేగం పెరిగింది. ఆరు నెలల్లోనే రూ.45,900 కోట్లు రుణాలు సేకరించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025-26కు సంబంధించి కేంద్ర ప్రభుత్వం అనుమతించిన మొత్తం అప్పుల్లో ఇది 85శాతం కావడం గమనార్హం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం రూ.64,539 కోట్ల మేర మార్కెట్ రుణాలు తీసుకోవాలని భావించింది. కానీ పలు పరిమితుల దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం రూ.54,009 కోట్ల రుణాలు తీసుకునేందుకే అనుమతించింది. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 23వ తేదీ నాటికే

మిగతా 11వ పేజీలో...



హెచ్-1బీ లాటరీ..
ఇక కొత్తగా!

అత్యధిక వేతనాలు ఉన్నవారికి అధిక ప్రాధాన్యం
జీతం ఆధారంగా నాలుగు శ్రేణులుగా వర్గీకరణ
ఎక్కువ జీతం ఉన్నవారికి సెలెక్షన్ పూల్‌లో 4 ఎంట్రీలు
మధ్యస్థం 3.. తక్కువ జీతం 2.. కొత్తవారికి ఒక ఎంట్రీ

వాషింగ్టన్, సెప్టెంబరు 23: లక్ష డాలర్ల వన్‌టైమ్ ఫీజుతో ఇప్పటికే హెచ్-1బీ వీసాలపై కత్తి ఝుళిపించిన ట్రంప్ సర్కారు.. ఆ వీసాలు జారీ చేయడానికి ఇన్నాళ్లుగా వాడుతున్న లాటరీ విధానంలో మార్పులు తెచ్చేందుకు సిద్ధమైంది! అత్యుత్తమ ప్రతిభ కలిగి.. అధిక వేతనాలు అందుకునేవారికి ఎక్కువగా ప్రాధాన్యమిచ్చేలాగా ఈ కొత్త ఎంపిక ప్రక్రియను రూపొందించారు. దీనికి సంబంధించిన ప్రతిపాదనకు 'ఆఫీస్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ బడ్జెట్' నుంచి అనుమతి పొంది.. ఫెడరల్ రిజిస్టర్‌లో మంగళవారం ప్రచురించింది. ఇప్పటిదాకా హెచ్-1బీ వీసాల జారీకి అమెరికా డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ (డీహెచ్ఎస్) అనుసరిస్తున్న లాటరీ విధానంలో.. ఆ వీసాపై రావాలనుకునే ఉద్యోగులందరూ సమానమే. ప్రతిభ ఆధారంగాగానీ.. జీతం ఆధారంగాగానీ ఎవరికీ ఎలాంటి ప్రాధాన్యమూ

మిగతా 2వ పేజీలో...

జీఎస్టీ తగ్గించలేదా..
డయల్ 1915

లేదా 88000 01915కి వాట్సాప్ చెయ్యండి
ఫిర్యాదులకు కేంద్రం ప్రత్యేక నెంబర్లు
ధరలు తగ్గించి అమ్ముతున్నారా? లేదా?
ఈ-కామర్స్ సంస్థలపై కేంద్రం ఆరా 10



దుల్కర్ సల్మాన్, పృథ్వీరాజ్ సుకుమారన్
ఇళ్లల్లో కస్టమ్స్ సోదాలు

భూటాన్ నుంచి అక్రమంగా ప్రీమియం కార్లను దిగుమతి చేసుకున్నారన్న ఆరోపణల నేపథ్యంలో..
కేరళ వ్యాప్తంగా సినీ నటులు, పారిశ్రామికవేత్తల నివాసాల్లో..
సెకండ్ హ్యాండ్ వాహనాల దిగుమతిపై దేశంలో నిషేధం 2

కృష్ణా జలాల్లో 70% వాటా ఇవ్వాల్సిందే! 13

నదీ జలాల్లో తెలంగాణ హక్కుల కోసం రాజీ లేని పోరాటం చేస్తాం
పక్క రాష్ట్రాల్లో ఏ పార్టీ అధికారంలో ఉన్నా.. చుక్క నీటిని వదులుకోం
ఆల్మట్టి ఎత్తు పెంపు సరికాదు.. సుప్రీంలో గట్టి వాదనలు వినిపిస్తాం
ట్రైబ్యునల్ విచారణ తర్వాత మీడియాతో మంత్రి ఉత్తమ్‌కుమార్

దుల్కర్, పృథ్వీరాజ్ ఇళ్లల్లో కస్టమ్స్ సోదాలు

- కేరళ వ్యాప్తంగా ఏకకాలంలో 30-35 చోట్ల నిర్వహణ
- సెకండ్ హ్యాండ్ వాహనాల దిగుమతిపై దేశంలో నిషేధం
- ఒక్క కేరళలోకే భూటాన్ నుంచి 120 నుంచి 150 లగ్జరీకార్లు
- కేరళలో 36 కార్ల సీజ్.. ఆ యజమానులకు నోటీసులు




కోచి, సెప్టెంబరు 23: అత్యంత విలాసవంతమైన ఆ కార్లు దేశంలోకి ఎలా వచ్చాయి? ఎన్ని వచ్చాయి? ఎవరెవరి వద్ద ఉన్నాయి? అని తేల్చేందుకు 'ఆపరేషన్ నుమ్‌ఖోర్'లో పేరుతో రంగంలోకి దిగిన అధికారులు దూకుడు పెంచారు. భూటాన్ మీదుగా అక్రమంగా వందకు మించి దిగుమతి అయిన అత్యంత విలాసవంతమైన ప్రీమియం వాహనాలను ఇప్పటికే ట్రాక్ చేసిన కస్టమ్స్ అధికారులు.. డొంక కేరళలో కదలడంతో అక్కడ వాలిపోయారు. అక్కడ మంగళవారం మలయాళం చిత్ర పరిశ్రమకు చెందిన అగ్రశ్రేణి నటులు దుల్కర్ సల్మాన్, పృథ్వీరాజ్ సుకుమార్ సహా మరికొందరు నటులు, పారిశ్రామికవేత్తలు, మరికొందరు బడాబాబుల నివాసాల్లో సోదాలు నిర్వహించారు. నుమ్‌ఖోర్ అంటే.. భూటాన్‌లోని జాతీయ భాష అయిన జోంకాలో వాహనం అని అర్థం! అందుకే.. ఈ ఆపరేషన్‌కు నుమ్‌ఖోర్ అనే పేరు పెట్టారు. కొచ్చిలోని దుల్కర్, పృథ్వీరాజ్ నివాసాలు సహా కేరళ వ్యాప్తంగా 30 నుంచి 35 చోట్ల సోదాలు జరిగాయి. తిరువనంతపురం, కొజికోడ్, మలప్పురం, కుట్టిప్పురం, త్రిస్సూర్‌ల్లో సోదాలు నిర్వహించారు. ఇతర దేశాల నుంచి భారత్‌కు సెకండ్ హ్యాండ్ వాహనాలను దిగుమతి చేసుకోవడంపై నిషేధం ఉందని కస్టమ్స్ అధికారులు స్పష్టం చేశారు. భూటాన్ నుంచి తీసుకొచ్చిన వాహనాల్లో ఒక్కటి కూడా భారత్‌లో తయారైంది లేదని అన్నారు. కొత్త వాహనాలనే తొలుత భూటాన్‌కు అక్రమంగా తీసుకెళ్లి అక్కడ నుంచి తిరిగి సెకండ్ హ్యాండ్ పేరుతో తీసుకొస్తున్నారని అభిప్రాయపడ్డారు. 10-15 సందర్భాల్లో అక్రమ దిగుమతులు జరిగినట్టు గుర్తించామని తెలిపారు. మోటారు వాహనాలకు సంబంధించిన పరివాహన్ వెబ్‌సైట్, కస్టమ్స్ వెబ్‌సైట్‌లోనూ ఫోర్జరీలు చేసి దిగుమతి చేసుకున్నట్టు కనిపిస్తోందని చెప్పారు. అక్రమంగా దిగుమతి చేసుకున్న వాహనాలను స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. యజమానులు తగిన పత్రాలను చూపించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆపరేషన్ నుమ్‌ఖోర్‌లో భాగంగా ఇప్పటివరకు కస్టమ్స్ అధికారులు 36 హై ఎండ్ లగ్జరీ కార్లను సీజ్ చేశారు. ఇందులో దుల్కర్‌వి రెండుకార్లు (డిఫెండర్, ప్రాడో) ఉన్నట్లుగా భావిస్తున్నారు. కాగా 36 కార్ల యజమానులందరికీ నోటీసులు జారీ చేశారు. భూటాన్ నుంచి ఒక్క కేరళ రాష్ట్రంలోకే 120 నుంచి 150 కార్లు అక్రమంగా దిగుమతి అయ్యాయని అధికారులు చెబుతున్నారు.



భారత్‌తో సంబంధాలు మాకు అత్యంత కీలకం!

- అమెరికా విదేశాంగ మంత్రి రుబియో వ్యాఖ్యలు

న్యూయార్క్, సెప్టెంబరు 23: భారత దిగుమతులపై విధించిన భారీ సుంకాలు, హెచ్-1బీ వీసా రుసుము పెంపు వంటి నిర్ణయాల నేపథ్యంలో అమెరికాతో భారత్ ఆచి తూచి వ్యవహరిస్తోంది. ఇలాంటి సమయంలో అనూహ్య పరిణామం చోటు చేసుకుంది. భారత్ తమకు అత్యంత ముఖ్య దేశమని, ఆ దేశంతో సంబంధాలు తమకు అత్యంత కీలకమని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో వ్యాఖ్యానించారు. న్యూయార్క్‌లో జరుగుతున్న ఐక్యరాజ్యసమితి(ఐరాస) 80వ సర్వప్రతినిధుల సదస్సుకు భారత్ తరఫున హాజరైన విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్‌తో ఆయన చర్చలు జరిపారు. అనంతరం.. రుబియో తన అభిప్రాయాలను 'ఎక్స్' వేదికగా పంచుకున్నారు. వాణిజ్యం, రక్షణ, విద్యుత్తు సహా అన్ని కీలక రంగాల్లో ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలు కొనసాగుతున్నాయని తెలిపారు. "మా చర్చలు దేశాలకు శ్రేయస్సును చేకూరుస్తాయి." అని పేర్కొన్నారు. ఇక, ఈ విషయంపై జైశంకర్ స్పందిస్తూ.. "రుబియోతో భేటీ కావడం ఆనందంగా ఉంది." అని ఎక్స్‌లో పేర్కొన్నారు.

బగ్రాం స్థావరం జోలికొస్తే యుద్ధమే: తాలిబాన్లు

కాబూల్, సెప్టెంబరు 23: బగ్రాం వైమానిక స్థావరాన్ని తిరిగి స్వాధీనం చేసుకునేందుకు అమెరికా ప్రయత్నిస్తే, ఆ దేశంతో యుద్ధం పునరుద్ధరణకు పూర్తిస్థాయిలో సన్నద్ధమవుతామని తాలిబన్లు ప్రతినబూనారు. ఈ అంశంలో అమెరికాకు పాకిస్థాన్ ఏ విధమైన సహకారాన్ని అందించినా అది నేరుగా తమతో యుద్ధానికి దిగినట్టుగానే భావిస్తామని స్పష్టం చేశారు. తాలిబన్ల సుప్రీం నేత హిబాతుల్లా అఖుంద్జదా నిర్వహించిన అత్యున్నత స్థాయి సమావేశంలో ఈ మేరకు నిర్ణయాలు తీసుకున్నారు. వ్యూహాత్మకమైన బగ్రాం వైమానిక స్థావరాన్ని అమెరికా దళాలు తిరిగి స్వాధీనం చేసుకోనున్నట్టు ఆ దేశాధ్యక్షుడు ట్రంప్ పదేపదే చెబుతున్న నేపథ్యంలో తాలిబన్ల నుంచి ఈ స్పందన వచ్చింది.

'హనుమాన్'పై అమెరికన్ నేత విద్వేష వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 23: అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రం సుగర్ ల్యాండ్ పట్టణంలో ప్రతిష్ఠించిన 90 అడుగుల భారీ హనుమాన్ విగ్రహంపై రిపబ్లికన్ పార్టీ నేత అలెగ్జాండర్ డంకన్ తీవ్ర వివాదాస్పద, మత విద్వేష వ్యాఖ్యలు చేశాడు. 'నకిలీ హిందూ దేవుడికి సంబంధించిన నకిలీ విగ్రహాన్ని ఇక్కడ టెక్సాస్‌లో మనం ఎందుకు అనుమతిస్తున్నాం? మనది క్రిస్టియన్ దేశం' అంటూ తన 'ఎక్స్' ఖాతాలో నోరుపారేసుకున్నాడు. అలెగ్జాండర్ డంకన్ పోస్టుపై హిందూ సమాజం నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. డంకన్ వ్యాఖ్యలను ది హిందూ అమెరికన్ ఫౌండేషన్ ఖండించింది. ఈ విషయంపై టెక్సాస్ రిపబ్లికన్ పార్టీకి ఫిర్యాదు చేసింది. కాగా, టెక్సాస్ రాష్ట్రం సుగర్ ల్యాండ్‌లోని అష్టలక్ష్మి ఆలయంలో 90 అడుగుల ఎత్తైన భారీ హనుమాన్ కాంస్య విగ్రహాన్ని గతేడాది ఏర్పాటు చేశారు.



కోల్‌కతాలో వరుణుడి బీభత్సం

- విద్యుదాఘాతంతో పది మంది మృతి

కోల్‌కతా, సెప్టెంబరు 23: పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో వరుణుడు బీభత్సం సృష్టించాడు. సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు నగరవ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి జనజీవనం స్తంభించిపోగా.. వేర్వేరు ప్రాంతాల్లో 10 మంది మృత్యువాత పడ్డారు. వీరంతా విద్యుదాఘాతానికి గురై ప్రాణాలు కోల్పోయారు. కోల్‌కతాలో 24 గంటల వ్యవధిలో రికార్డు స్థాయిలో 25.14 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. 1986లో కోల్‌కతాలో 25.95 సెం.మీల వర్షపాతం నమోదవ్వగా.. ఆ తర్వాత ఇన్నేళ్లకు మంగళవారం ఆ స్థాయి వర్షం కురిసింది. నగరంలోని కొన్ని ప్రాంతాల్లో 30 సెం.మీలకు పైగా వర్షం కురిసిందని ఐఎండీ పేర్కొంది. భారీ వర్షం ప్రజా రవాణా వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపింది. ఈ స్థాయి వర్షాన్ని మునుపెన్నడూ చూడలేదని సీఎం మమత అన్నారు. మరణాలకు రాష్ట్రంలో విద్యుత్ సరఫరా చేస్తున్న ప్రైవేటు సంస్థ సీఈఎస్‌సీదే బాధ్యతని ఆమె పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, మహారాష్ట్రలోని మరాఠ్వాడ ప్రాంతంలో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయారని అధికారులు మంగళవారం ప్రకటించారు.

నిరభ్యంతర పత్రాలు రాక అయోధ్య మసీదు ప్లాన్ తిరస్కరణ

అయోధ్య, సెప్టెంబరు 23: అయోధ్యకు సమీపంలోని ధన్నీపూర్ గ్రామంలో నిర్మించతలపెట్టిన మసీదు ప్లాన్‌ను అయోధ్య అభివృద్ధి సంస్థ (ఏడీఏ) తిరస్కరించింది. వివిధ ప్రభుత్వ శాఖల నుంచి ఇంకా నిరభ్యంతర పత్రాలు (ఎన్‌ఓసీలు) అందకపోవడమే ఇందుకు కారణమని తెలిపింది. సమాచార హక్కు చట్టం కింద జర్నలిస్టు ఓం ప్రకాశ్ సింగ్ సమర్పించిన దరఖాస్తుకు సమాధానంగా ఈ నెల 16న ఈ విషయాన్ని వెల్లడించింది. రామజన్మభూమి కేసు తీర్పులో భాగంగా నూతన మసీదు నిర్మాణం నిమిత్తం సెంట్రల్ సున్నీ వక్ఫ్ బోర్డుకు అయిదెకరాల స్థలం కేటాయించాలని 2019 నవంబరు 9న సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ఆ మేరకు అయోధ్యకు 25 కి.మీ. దూరంలోని ధన్నీపూర్‌లో ఆ స్థలాన్ని అప్పగిస్తూ 2020 ఆగస్టు 3న జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. నిర్మాణానికి సంబంధించి 2021 జూన్ 23న మసీదు ట్రస్టు అయోధ్య అభివృద్ధి అథారిటీకి దరఖాస్తు సమర్పించింది. అయితే పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్, కాలుష్య నివారణ బోర్డు, నీటి పారుదల, రెవెన్యూ, మున్సిపల్ కార్పొరేషన్‌ల నుంచి నిరభ్యంతర పత్రాలు అందకపోవడంతో ఆ దరఖాస్తును తిరస్కరించింది.

ఇన్ఫోసిస్ సుధామూర్తికి సైబర్ నేరగాళ్ల ఫోన్

- వ్యక్తిగత సమాచార సేకరణకు ప్రయత్నం

బెంగళూరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): 'గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి నా వ్యక్తిగత సమాచారాన్ని తెలుసుకోవడానికి ప్రయత్నించాడు. ఆ క్రమంలో బెదిరింపునకు దిగాడు' అని ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ముఖ్యులు, రాజ్యసభ సభ్యురాలు సుధామూర్తి బెంగళూరు సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 5న ఉదయం సుమారు 9.40 గంటల ప్రాంతంలో ఆమెకు ఓ వ్యక్తి ఫోన్ చేశాడు. టెలికామ్ డిపార్ట్‌మెంట్ నుంచి చేస్తున్నానంటూ పరిచయం చేసుకున్నాడు. మొబైల్ నంబరు ఆధార్‌కు లింక్ చేసుకోవాలని చెప్పాడు. ఆ క్రమంలో వ్యక్తిగత సమాచారం తెలుసుకోవడానికి ప్రయత్నించాడు. 'మీ నంబరు నుంచి అశ్లీల వీడియోలు పోస్ట్ అయ్యాయి. మీ నంబరు మరో రెండు గంటల్లో నిలిచిపోతుంది' అంటూ బెదిరింపులకు దిగాడు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు.

హెచ్-1బీ లాటరీ... ఇక కొత్తగా!

(మొదటి పేజీ తరువాయి)



ఇవ్వరు. వచ్చిన దరఖాస్తులన్నింటినీ తీసుకుని కంప్యూటరైజ్డ్ విధానంలో లాటరీ వేసేవారు. ఎంపికైనవారు అమెరికాకు వచ్చేవారు. కానీ.. కొత్త విధానంలో 'వెయిటెడ్ సెలక్షన్' పద్ధతిని అనుసరిస్తారు. అంటే.. ఎక్కువ నైపుణ్యం ఉండి, ఎక్కువ జీతం అందుకునే వారికి ఎక్కువ ప్రాధాన్యం.. ఎంపిక ప్రక్రియలో ఎక్కువ అవకాశాలు ఇస్తారు. కొత్తగా ఉద్యోగంలో చేరేవారికి తక్కువ ప్రాధాన్యం ఇస్తారు. ఇందులో భాగంగా.. హెచ్-1బీ వీసాల కోసం వచ్చే దరఖాస్తులను.. ఎక్కువ జీతం (లెవెల్ 4), మధ్యస్థ జీతం (లెవెల్ 3), తక్కువ జీతం (లెవెల్ 2), ఎంట్రీ లెవెల్ (ఒకటో లెవెల్) అని నాలుగు రకాలుగా వర్గీకరిస్తారు. వీరిలో ఎక్కువ నైపుణ్యం, ఎక్కువ జీతం ఉండే లెవెల్ 4 వారికి సెలెక్షన్‌పూల్‌లో నాలుగు ఎంట్రీలు ఇస్తారు. మధ్యస్థ జీతం ఉన్నవారికి 3 ఎంట్రీలు, తక్కువ జీతం ఉన్నవారికి 2 ఎంట్రీలు, ప్రవేశస్థాయివారికి ఒక ఎంట్రీ ఇస్తారు. ఒక ఎంట్రీని ఒక టికెట్‌గా పరిగణిస్తే.. ఒక టికెట్ ఉన్నవారు ఎంపికయ్యే అవకాశం 20% ఉంటుంది. అదే నాలుగు టికెట్లు ఉన్నవారు ఎంపికయ్యే చాన్స్ 80% దాకా ఉంటుంది. అంటే.. ఎక్కువ నైపుణ్యం ఉన్నవారే అమెరికాలో అడుగుపెట్టే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నమాట. అలాంటివారి వల్ల తమ దేశానికి ఎక్కువ ప్రయోజనం చేకూరుతుందన్నది ట్రంప్ సర్కారు ఉద్దేశం. అలాగని ఎక్కువ జీతం/ఎక్కువ ప్రతిభ ఉన్నవారికే కాకుండా.. అన్ని స్థాయిలవారికీ అవకాశాలు కల్పించేలాగా ఈ విధానాన్ని రూపొందించినట్టు ట్రంప్ యంత్రాంగం చెబుతోంది. ఈ కొత్త విధానం వల్ల.. హెచ్-1బీ వీసా వచ్చే అవకాశాన్ని మెరుగుపరిచేందుకు కంపెనీలు తమ ఉద్యోగుల జీతాలు పెంచుతాయని.. ఇలా పెరిగే మొత్తం 502 మిలియన్ డాలర్ల దాకా (దాదాపు రూ.4,400 కోట్లు) ఉంటుందని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ అంచనా వేస్తోంది. అయితే.. లెవెల్ 1 ఉద్యోగాలకు హెచ్-1బీ వీసా కోసం దరఖాస్తు చేసే చిన్న కంపెనీలపై ఈ విధానం వల్ల ఎక్కువగా భారం పడే ప్రమాదం ఉందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. చిన్నవే అయినప్పటికీ.. ఎక్కువ జీతాలిచ్చే ఉద్యోగాలు కల్పించే కంపెనీలకు మాత్రం ఈ విధానం ఎక్కువగా ఉపయోగపడుతుందని పేర్కొంటున్నారు. ట్రంప్ సర్కారు ప్రతిపాదిస్తున్న ఈ కొత్త విధానం.. అడ్వాన్స్‌డ్ డిగ్రీలు కలిగి ఉండి, అత్యధిక వేతనాలు అందుకునే భారతీయ సీనియర్ టెకీలకు ప్రయోజనకరమని, కొత్తగా ఉద్యోగంలో చేరేవారికి మాత్రం దీనివల్ల నష్టమేనని వారు వివరిస్తున్నారు. కాగా.. ట్రంప్ సర్కారు రూపొందించిన ఈ విధానం ప్రస్తుతానికి ప్రతిపాదన దశలోనే ఉంది. దీనిపై ప్రజాభిప్రాయాన్ని కోరారు. ప్రజలు, పరిశ్రమ వర్గాలు.. ఇలా అందరి అభిప్రాయాలు, సూచనలు, సలహాలను తీసుకున్నాకే కొత్త విధానానికి సంబంధించిన మార్గదర్శకాలు, నియమ, నిబంధనలను ఖరారు చేస్తారు.

హెచ్ 1 బీ ఫీజు పెంపు ప్రభావం నామమాత్రమే: నాస్కామ్ చీఫ్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 23: హెచ్-1బీ వీసాల ఫీజు గణనీయంగా పెంచుతూ అమెరికా తీసుకున్న నిర్ణయం ప్రభావం మన దేశంపై నామమాత్రంగానే ఉంటుందని నాస్కామ్ ప్రెసిడెంట్ రాజేశ్ నంబియార్ పేర్కొన్నారు. భారతీయ కంపెనీలు గత కొన్నేళ్లుగా ఆ వీసాలపై ఆధారపడడాన్ని తగ్గించుకుంటూ వస్తున్నాయని.. ఈ పెంపు వల్ల అమెరికాకు చెందిన టెక్ దిగ్గజ సంస్థలపైనే ఎక్కువగా భారం పడుతుందని ఆయన విశ్లేషించారు. 'వైర్' వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ అంశంపై వివరంగా మాట్లాడారు. టెక్నాలజీలో అమెరికా అగ్రస్థానాన్ని, దీర్ఘకాలిక ఆర్థిక శక్తిని కొనసాగించాలంటే అమెరికన్ కంపెనీలన్నీ హెచ్-1బీ వీసాలపై అధికంగా ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని, ఫలితంగా వాటిపై ప్రభావం కొన్ని రెట్లు అధికంగా ఉంటుందని నంబియార్ అన్నారు. గత పదేళ్ల కాలంలో భారత్‌లో 1,760 గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లు (జీసీసీ) ఏర్పాటయ్యాయని, హెచ్-1బీ వీసా ఫీజు పెంపు నేపథ్యంలో.. పలు కంపెనీలు మనదేశంలో జీసీసీలను మరింతగా విస్తరించే అవకాశం ఉందన్నారు.

హెచ్1బీ ఫీజు గోల వేళ.. రెండు అమెరికా కంపెనీలకు భారతీయ సీఈవోలు!

- టీ-మొబైల్ సీఈవోగా శ్రీని గోపాలన్
- మోల్సన్ కూర్స్ అధ్యక్షుడిగా రాహుల్


శ్రీని గోపాలన్ | రాహుల్ గోయెల్

వాషింగ్టన్, సెప్టెంబరు 23: హెచ్1బీ వీసా ఫీజు భారీగా పెంపు, ఇతర చర్యలతో భారత నిపుణులకు, విద్యార్థులకు ట్రంప్ యంత్రాంగం పొగపెడుతున్న సమయంలో.. రెండు అమెరికా కంపెనీలు తమ సీఈవోలుగా ఇద్దరు భారతీయులను నియమించుకున్నాయి. అమెరికాలో అతిపెద్ద టెలికాం సంస్థ 'టీ-మొబైల్' తమ సీఈవోగా శ్రీని గోపాలన్‌ను నియమించింది. ప్రస్తుత సీఈవో మైక్ సీవెర్ట్ స్థానంలో నవంబర్ 1 నుంచి గోపాలన్ బాధ్యతలు స్వీకరిస్తారని ప్రకటించింది. అహ్మదాబాద్ ఐఐఎంలో చదువుకున్న గోపాలన్.. హిందూస్థాన్ యూనిలివర్‌లో మేనేజ్‌మెంట్ ట్రెయినీగా కెరీర్ ప్రారంభించారు. ప్రస్తుతం టీ-మొబైల్‌లో చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ (సీవోవో)గా ఉన్నారు. ఆయన పనితీరు, ప్రతిభ ఆధారంగా సీఈవో పదవికి ఎంపిక చేసినట్టు టీ-మొబైల్ పేర్కొంది. ఇక అమెరికాలో ప్రముఖ బీర్లు, ఇతర పానీయాల సంస్థ మోల్సన్ కూర్స్ సంస్థ సీఈవోగా 49 ఏళ్ల రాహుల్ గోయల్ నియమితులయ్యారు. మైసూర్‌లో ఇంజనీరింగ్ పూర్తి చేసిన.. తర్వాత అమెరికాలో బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ చదివారు. అక్కడే మోల్సన్ కూర్స్ సంస్థలో చేరారు. 24 ఏళ్లుగా అదే సంస్థలో వివిధ హోదాల్లో పనిచేశారు.

రుణాల వసూలు సమస్యలు సివిల్ వివాదాలే

- వాటిని క్రిమినల్ కేసులుగా మార్చొద్దు
- కోర్టులు రికవరీ ఏజెంట్లు కాదు: సుప్రీం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 23: తీసుకున్న రుణాలు తిరిగి చెల్లించకపోవడం సివిల్ వివాదం కిందికి వస్తుందని, వాటిని క్రిమినల్ కేసులుగా మార్చకూడదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. రుణాలు వసూలు చేసి ఇవ్వడానికి కోర్టులేమీ రికవరీ ఏజెంట్లు కాదని వ్యాఖ్యానించింది. అరెస్టులు చేయిస్తామని బెదిరించి, అందుకు అనుగుణంగా కేసులు పెట్టించి రుణాలు వసూలు చేసుకోవడం ఇటీవల కాలంలో అధికమైందని ధర్మాసనం అభిప్రాయపడింది. ఇరు పక్షాలు కూడా సివిల్ కేసులను క్రిమినల్ కేసులుగా మార్చుకుంటున్నాయని తెలిపింది. అప్పు వసూలు వివాదంలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఓ వ్యక్తిపై కిడ్నాప్ కేసు నమోదు చేయడంపై ధర్మాసనం విచారణ జరిపింది. ఇలాంటి సందర్భాల్లోనే పోలీసులు విచక్షణ జ్ఞానాన్ని ఉపయోగించాల్సి ఉంటుందని జస్టిస్ సూర్యకాంత్ చెప్పారు. సివిల్ వివాదాన్ని క్రిమినల్ నేరంగా మార్చితే అది న్యాయ ప్రక్రియను దుర్వినియోగం చేసినట్టు అవుతుందని తెలిపారు. ఇలాంటి సమస్యలపై సలహాలు ఇవ్వడానికి ప్రతి జిల్లాలో రిటైర్డు జడ్జీలను సలహాదారులుగా నియమించుకుంటే మంచిదని, దీనిపై 2వారాల్లో సమాధానమివ్వాలని ఆదేశించారు.

పరువునష్టం చట్టాన్ని నేరరహితంగా మార్చాలి

ఆ సమయం ఆసన్నమైంది: సుప్రీం వ్యాఖ్య

న్యూఢిల్లీ, సెప్టెంబరు 23: పరువు నష్టం చట్టాన్ని నేరరహితంగా మార్చాల్సిన సమయం ఆసన్నమైందని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. క్రిమినల్ పరువు నష్టం కేసులో తమకు జారీ చేసిన నోటీసులను రద్దు చేయాలని కోరుతూ 'ఫౌండేషన్ ఫర్ ఇండిపెండెంట్ జర్నలిజం' సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించేందుకు అంగీకరించిన సర్వోన్నత న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. తన పరువుకు భంగం కలిగించేలా కథనాలు ప్రచురించిన 'ది వైర్' న్యూస్ పోర్టల్, దాని రాజకీయ వ్యవహారాల ఎడిటర్ అజోయ్ ఆశీర్వాద్ మహాప్రశస్థపై, జేఎన్‌యూ మాజీ ప్రొఫెసర్ అమితా సింగ్ క్రిమినల్ పరువు నష్టం కేసు దాఖలు చేశారు. దీనిపై వారు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సోమవారం సుప్రీం ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించేందుకు అంగీకరించింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబాల్ వాదిస్తూ.. ఇదే అంశానికి సంబంధించి సుప్రీంకోర్టులో రాహుల్ గాంధీ సహా ఇతరులు దాఖలు చేసిన పిటిషన్లు కూడా అపరిష్కృతంగా ఉన్నాయని చెప్పారు. దీంతో తాజా పిటిషన్‌ను కూడా పెండింగ్ పిటిషన్లకు జత చేస్తున్నట్లు ధర్మాసనం ప్రకటించింది.

దండకారణ్యానికి భారీగా బలగాలు

కశ్మీర్ నుంచి తరలింపు.. మావోయిస్టుల అగ్ర నాయకత్వం అంతమే లక్ష్యం



న్యూఢిల్లీ, సెప్టెంబరు 23: మధ్యభారతంలో మావోయిస్టుల అంతమే లక్ష్యంగా విరుచుకుపడుతున్న కేంద్ర బలగాలు నిర్ణయాత్మక దాడులకు సిద్ధమవుతున్నాయి. నక్సల్స్ కదలికలు ఉన్న ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఒడిశా, మహారాష్ట్రలకు మరిన్ని బలగాలను పంపించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులోభాగంగా అమర్‌నాథ్ యాత్ర కోసం జమ్మూకశ్మీర్‌లో నియమించిన కేంద్ర పోలీస్ సాయుధ బలగాల్లో (సీఏపీఎఫ్) ఇంకా అక్కడే ఉండిపోయిన వారిలో 80% మేర మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలకు తరలించనున్నారు. ఈ విషయాన్ని సీఏపీఎఫ్‌లోని సీనియర్ అధికార వర్గాలు ధ్రువీకరించాయి. మావోయిస్టు నాయకత్వాన్ని భౌతికంగా బలహీనపరచడం...ఇప్పటికీ వారి చేతుల్లోని ప్రాంతాలను ఒక్కొక్కటిగా స్వాధీనంలోకి తెచ్చుకోవడం లక్ష్యంగా అదనపు బలగాలను కేటాయిస్తున్నట్టు తెలిపాయి. రాబోయే కొన్ని వారాల్లో అవి ఎర్ర బీభత్స ప్రాంతాలకు (రెడ్‌జోన్) చేరుకుంటాయని తెలిపాయి. వచ్చే ఏడాది మార్చి 31 నాటికి మావోయిస్టుల రహిత భారత్‌ను నిర్మిస్తామని ఇప్పటికే కేంద్ర హోంశాఖ ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రధాన నాయకత్వాన్ని బలహీనపరిచేందుకుగాను కేంద్ర కమిటీ సభ్యులపై గురిపెట్టి కేంద్ర బలగాలు దాడులు సాగిస్తున్నాయి. తాజాగా ఒకే ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు కేంద్ర కమిటీ సభ్యులు కట్టా రామచంద్రారెడ్డి (రాజుదాదా), కడారి సత్యనారాయణరెడ్డి (కోసా) మృతిచెందారు. ఈ ఏడాదిలో దాదాపు ఎనిమిదిమంది సీసీ సభ్యులను ఎన్‌కౌంటర్ చేశారు. ఒక సీసీ మెంబరు లొంగిపోయారు. నాయకుల్లో అధిక భాగం ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఒడిశాల్లో తలదాచుకున్నట్టు కేంద్ర హోంశాఖ వద్ద సమాచారం ఉంది. ఈక్రమంలో ఈ మూడు రాష్ట్రాలపైనే దృష్టి పెట్టి.. అదనపు బలగాలను అక్కడకు అధికంగా తరలించాలని నిర్ణయించింది.

కాల్పులవిరమణ.. ఓ ఎత్తుగడ

మావోయిస్టులు చేస్తున్న కాల్పుల విరమణ ప్రతిపాదనను కేంద్ర బలగాలు తిరస్కరించాయి. బలగాల దృష్టిని మళ్లించడం కోసం ఒక ఎత్తుగడగా ఈ ప్రతిపాదన చేస్తున్నారని పెదవి విరిశాయి. ఇటువంటి ప్రతిపాదనలతో మావోయిస్టులు ముందుకురావడం కొత్తకాదని, వాటికి పెద్దగా సాధికారికత కూడా లేదని కేంద్ర హోంశాఖలోని సీనియర్ అధికార వర్గాలు తెలిపాయి. సీనియర్ నాయకులు చనిపోతుండటంతో ఇప్పటికే ఆత్మరక్షణలో పడిపోయిన మావోయిస్టులు ఇలాంటి ఎత్తుగడలు పన్నుతున్నారని ఈ వర్గాలు తెలిపాయి. దండకారణ్య కమిటీ, కేంద్ర కమిటీలో ఇంకా మిగిలిన నాయకుల పని కూడా పడతామని స్పష్టం చేశాయి.

ఉక్రెయిన్‌పై యుద్ధానికి భారత్, చైనా నుంచే నిధులు

- ఐక్యరాజ్యసమితిలో ట్రంప్



న్యూయార్క్, సెప్టెంబరు 23: ఉక్రెయిన్‌పై చేస్తున్న యుద్ధానికి రష్యాకు అవసరమైన నిధులు భారత్, చైనా దేశాల నుంచే అధికంగా వస్తున్నాయని ట్రంప్ పేర్కొన్నారు. రష్యా నుంచి భారత్, చైనా చమురు కొనుగోలు చేయడాన్ని తీవ్రంగా విమర్శించారు. న్యూయార్క్‌లో జరుగుతున్న ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో భాగంగా ట్రంప్ మంగళవారం ఈ వ్యాఖ్యలు చేశారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న భారత్, చైనాలే ఉక్రెయిన్ యుద్ధానికి ప్రధాన పెట్టుబడిదారులంటూ ధ్వజమెత్తారు. నాటో సభ్య దేశాలు కూడా రష్యా నుంచి చమురు, ఇంధన ఉత్పత్తుల కొనుగోళ్లను తగ్గించుకోకపోవడం క్షమించకూడని విషయమన్నారు. నాటో దేశాలు తమపై జరిగే యుద్ధానికి తామే నిధులు ఇస్తున్నాయని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. యుద్ధాన్ని ముగించేందుకు రష్యా సిద్ధంగా లేదని, ఈ నేపథ్యంలో రక్తపాతాన్ని ఆపేందుకు మరోసారి భారీ ఎత్తున సుంకాలు విధించేందుకు అమెరికా సిద్ధంగా ఉందని ట్రంప్ పేర్కొన్నారు. అలాగే పాలస్తీనాను ప్రత్యేక దేశంగా గుర్తించాలంటూ కొన్ని యూరోపియన్ దేశాలు చేసిన ప్రతిపాదనను ట్రంప్ తిరస్కరించారు. పాలస్తీనాను ప్రత్యేక దేశంగా గుర్తిస్తే హమాస్ ఉగ్రవాదుల ఆకృత్యాలకు గుర్తింపునిచ్చినట్టు అవుతుందని పేర్కొన్నారు.

పాలస్తీనాకు దేశహోదా.. కానుక కాదు, హక్కు

ఇదొక్కటే గాజా యుద్ధానికి ముగింపు.. ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో

- పాలస్తీనాకు మద్దతు పలికిన మొనాకో
- 145కు చేరిన మద్దతు దేశాల సంఖ్య



యునైటెడ్ నేషన్స్, సెప్టెంబరు 23: "పాలస్తీనాకు దేశహోదా అనేది హక్కు.. కానుక కాదు!. ప్రస్తుత పీడకలకు ఇదొక్కటే పరిష్కారం. గాజా యుద్ధానికి కూడా ఇదొక్కటే ముగింపు." అని ఐక్యరాజ్యసమితి(ఐరాస) ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రెస్ స్పష్టం చేశారు. అమెరికాలోని న్యూయార్క్‌లో మంగళవారం ప్రారంభమైన ఐరాస 80వ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గాజాలో పరిస్థితి అత్యంత భీకరంగా, భయంకరంగా ఉందని తెలిపారు. ఇజ్రాయెల్-పాలస్తీనాల మధ్య వివాదానికి పాలస్తీనాకు దేశ హోదా కల్పించడమే పరిష్కారమని పేర్కొన్నారు. అయితే, హమాస్ మారణహోమాన్ని, పాలస్తీనా ప్రజల సామూహిక హననాలను ఎవరూ ఎట్టిపరిస్థితిలోనూ సమర్థించబోరని గుటెర్రెస్ నొక్కి చెప్పారు. మరోవైపు.. ఆక్రమిత వెస్ట్ బ్యాంకులో విస్తరించడాన్ని, నిర్మాణాలు చేపట్టడాన్ని ఐరాస జనరల్ అసెంబ్లీ అధ్యక్షురాలు అన్నాలేనా బేర్‌బాక్ ఖండించారు. వెస్ట్‌బ్యాంకులో విస్తరణలు, కూల్చివేతలు వంటివి రాజకీయ పరిష్కారాన్ని మరింత క్లిష్టతరం చేస్తాయని తెలిపారు. ఇక, ఇజ్రాయెల్ ఆర్థిక శాఖ మంత్రి బెజలెల్ స్మోట్రిచ్ ఇటీవల మాట్లాడుతూ.. పాలస్తీనా దేశం అనే మాటేలేదని, ఇప్పటి వరకు నినాదాలకే దీనిని పరిమితం చేశామని, ఇక నుంచి చర్యలకు దిగుతామని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇదిలావుంటే, పాలస్తీనాకు దేశ హోదా కల్పించాలని కోరుతున్న దేశాల్లో మొనాకో కూడా చేరింది. దీంతో పాలస్తీనాకు మద్దతిస్తున్న దేశాల సంఖ్య 145కు చేరింది. దీనిపై ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. జోర్డాన్ నది పశ్చిమాన ఏ దేశ ఏర్పాటును, గుర్తింపును తాము ఒప్పుకొనేది లేదని స్పష్టం చేశారు.

ఆయుధాలను అప్పగించండి

- హమాస్‌కు మహమ్మద్ అబ్బాస్ పిలుపు

అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు వ్యతిరేకిస్తున్నప్పటికీ పాలస్తీనాను గుర్తించే దేశాల సంఖ్య మరింత పెరుగుతోందని పాలస్తీనా అధ్యక్షుడు మహమ్మద్ అబ్బాస్ తెలిపారు. ఈ నేపథ్యంలో గాజా పాలనలో హమాస్ పాత్ర అవసరం లేదని, ఆయుధాలను స్వాధీనం చేయాలని పిలుపునిచ్చారు. హమాస్ సహా ఇతర ఉగ్రవాద సంస్థలు తమ ఆయుధాలను పాలస్తీనా అధికారులకు స్వాధీనం చేయాలని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఐరాస సమావేశంలో మాట్లాడారు. ఆయుధాలు లేని ఏకీకృత దేశాన్నే తాము కోరుకుంటున్నామని తెలిపారు. అదేవిధంగా ఒకే చట్టం, ఒకే చట్టబద్ధమైన భద్రతా దళాలను కోరుకుంటున్నట్టు చెప్పారు. "ఈ యుద్ధం ముగిసిన తర్వాత అధ్యక్ష, పార్లమెంటు ఎన్నికలను నిర్వహించాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. "మూడు మాసాల్లో మధ్యంతర ముసాయిదా రాజ్యాంగాన్ని రూపొందిస్తాం. అధికారాలను దేశానికి బదలాయించే ప్రక్రియ చేపడతాం." అని తెలిపారు.




సందీప్(ఫైల్), యువకుడి మృతికి కారణమైన శునకం

పెంపుడు కుక్క గోరు గుచ్చుకొని రేబిస్

» కొత్తగూడెం జిల్లాలో యువకుడి మృతి

పినపాక, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): అందంగా ఉందని, ఎంతో అల్లారుముద్దుగా పెంచుకున్న పెంపుడు కుక్కే తమ ఇంట్లో విషాదాన్ని నింపుతుందని కుటుంబసభ్యులెవరూ ఊహించలేదు. కుక్క పిల్ల కాలి గోరే గుచ్చుకుంది కదా..! అని అజాగ్రత్తగా వ్యవహరించడంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా యువకుడు రేబిస్ సోకి మరణించాడు. పినపాక మండలం ఏడూళ్లబయ్యారం గ్రామానికి చెందిన ముత్తెబోయిన సందీప్ (25) రెండు నెలలు క్రితం వీధిలో అందంగా కనిపించిన ఓ కుక్క పిల్లను పెంచుకునేందుకు ఇంటికి తెచ్చుకున్నాడు. దానిని మచ్చిక చేసుకునే క్రమంలో కుక్కపిల్ల సందీప్ తండ్రి పున్నయ్యను కరిచింది. అలాగే సందీప్‌కు కూడా ఆ కుక్కకాలి గోరు గుచ్చుకుంది. వెంటనే, తన తండ్రికి పినపాక ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించాడు. కానీ, తనకు కాలి గోరే కదా గుచ్చుకుందని నిర్లక్ష్యం చేశాడు. ఇలా రెండు నెలలుగా గొర్రెలు కాచుకుంటున్న క్రమంలో అతనికి రేబీస్ లక్షణాలు కనిపించాయి. వ్యాధి తీవ్రం కావడంతో కుటుంబసభ్యులు మణుగూరు, భద్రాచలం ఆసుపత్రులకు తీసుకెళ్లి వైద్యం చేయించినా ఫలితం లేకపోయింది. వ్యాధి ముదిరి సోమవారం రాత్రి సందీప్ మృతి చెందాడు.

బీజేపీలో చేరిన సినీనటుడు వరుణ్ సందేశ్ తల్లి రమణి

హైదరాబాద్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సినీ నటుడు వరుణ్ సందేశ్ తల్లి డాక్టర్ రమణి మంగళవారం బీజేపీలో చేరారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు ఆమెకు కాషాయ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. హిందుత్వం అంటే తమ కుటుంబానికి ఇష్టమని, అందుకే బీజేపీలో చేరినట్లు డాక్టర్ రమణి తెలిపారు.

లొంగుబాటు యత్నాల్లో వేణుగోపాల్!

పోలీసులకు కోవర్టుగా మారిన మావోయిస్టు అగ్రనేత.. దాంట్లో భాగంగానే ఇటీవల సాయుధ పోరాట విరమణ లేఖ

» మావోయిస్టు నాయకత్వాన్ని బయటకు రప్పించి, మట్టుబెట్టే పోలీసుల వ్యూహంలో భాగమే ఇదంతా!

» మాజీ మావోయిస్టుల విశ్లేషణలు

» కోవర్టు కుట్ర ద్వారానే కడారి, కట్టా ఎన్‌కౌంటర్

» ప్రజాసంఘాల ఆరోపణలు

హైదరాబాద్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ సోనూ పోలీసులకు లొంగిపోయే యత్నాల్లో ఉన్నారని, ఇప్పటికే పోలీసు ఉన్నతాధికారులతో సంప్రదింపులు జరుపుతున్నారని ప్రజా సంఘాల ప్రతినిధులు, మాజీ మావోయిస్టులు అనుమానిస్తున్నారు. అయితే దీంట్లో వాస్తవం లేదని, మల్లోజుల వేణుగోపాల్ లొంగుబాటు పేరిట జరుగుతున్నది ప్రచారం మాత్రమేనని పోలీసు అధికారులు చెబుతున్నారు. లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలవడానికి ఏ స్థాయి మావోయిస్టులు వచ్చినా వారిపై ఉన్న కేసుల విషయంలో సానుభూతితో వ్యవహరిస్తామని స్పష్టం చేస్తున్నారు. మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ భూపతి, అభయ్, సోనూను విప్లవ ద్రోహిగా ప్రకటించిన మావోయిస్టు పార్టీ.. తన వద్ద ఉన్న ఆయుధాలను తక్షణం పార్టీకి అప్పగించాలని ఆయనను ఆదేశించిన విషయం తెలిసిందే. ఆయుధాలు అప్పగించకుంటే పీఎల్‌జీఏ (ప్రజా విముక్త గెరిల్లా సైన్యం) వాటిని స్వాధీనం చేసుకుంటుందని కూడా హెచ్చరించింది. ఈ నేపథ్యంలో వేణుగోపాల్ భవితవ్యంపై అటు ప్రజాసంఘాలతో పాటు ఇటు పోలీసు వర్గాల్లోనూ చర్చ నెలకొంది.

లొంగుబాటు లాంఛనమే!

మావోయిస్టు పార్టీ అధికార ప్రతినిధి హోదాలో అభయ్ పేరిట ఇటీవల మల్లోజుల వేణుగోపాల్ విడుదల చేసిన లేఖ దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. సాయుధపోరును తాత్కాలికంగా విరమిస్తామని, దీనిపై సహచరులతో చర్చల కోసం నెల రోజుల సమయం ఇవ్వాలని కేంద్రప్రభుత్వాన్ని కోరారు. పార్టీ ప్రస్థానంలో చోటుచేసుకున్న తప్పొప్పులనూ మరో లేఖలో విశ్లేషించారు. అంతేకాదు, ఓ లేఖ మీద తన ప్రస్తుత ఫోటోనూ జతపరిచారు. ఈ లేఖ వచ్చినపుడే ఆయనపై పలు అనుమానాలు వ్యక్తం అయ్యాయి. పోలీసులకు కోవర్టుగా మారిన క్రమంలోనే మల్లోజుల వేణుగోపాల్ ఇలాంటి లేఖను విడుదల చేశారని విమర్శలు వచ్చాయి. ఆపై మావోయిస్టు పార్టీ తెలంగాణ కమిటీ తరఫున జగన్ పేరిట విడుదలైన లేఖ ద్వారా.. వేణుగోపాల్ లేవనెత్తిన అంశాలు ఆయన వ్యక్తిగత అభిప్రాయాలు మాత్రమేనని, పార్టీకి సంబంధం లేదని వివరణ వచ్చింది. జగన్ లేఖ విడుదలై 48 గంటలు దాటకముందే.. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యులైన కడారి సత్యనారాయణ రెడ్డి, కట్టా రామచంద్రారెడ్డి ఎన్‌కౌంటర్‌లో మరణించారని పోలీసులు ప్రకటించారు. వాస్తవానికి అభయ్ లేఖ తర్వాత పార్టీ అభిప్రాయాన్ని తెలియచేయడానికి వీరిద్దరు సమావేశమై ఒక లేఖను రూపొందించారని, ఆ లేఖ మీడియాకు విడుదల కాక ముందే ఎన్‌కౌంటర్‌లో మరణించారని తెలుస్తోంది. కోవర్టు ఆపరేషన్ ద్వారానే పోలీసులు వీరిద్దరినీ పట్టుకొని కాల్చి చంపారని పౌరహక్కుల సంఘం తదితర సంఘాలు ఆరోపిస్తున్నాయి. సాయుధ పోరాటం విరమణ అంటూ అభయ్ పేరిట లేఖ విడుదలైతే.. మావోయిస్టు పార్టీ నాయకత్వం స్పందిస్తుందనే అంచనాతోనే పోలీసులు ఎత్తుగడ వేశారని అంటున్నారు. పార్టీ అగ్రనాయకత్వాన్ని బయటకు రప్పించడంలో భాగంగానే అభయ్ నుంచి లేఖ వచ్చి ఉంటుందని మాజీ మావోయిస్టులు అభిప్రాయపడుతున్నారు. మల్లోజుల వేణుగోపాల్ ఇప్పటికే పోలీసులతో టచ్‌లోకి వెళ్లి ఉంటారని, ఆయన లొంగుబాటు ప్రకటన లాంఛనమేనని వారు చెబుతున్నారు.



చివరిచూపైనా దక్కాలని

» కడారి సత్యనారాయణరెడ్డి మృతదేహం కోసం అబూజ్‌మడ్‌కు సోదరుడు కరుణాకర్ రెడ్డి

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్ అడవుల్లో అబూజ్‌మడ్ వద్ద సోమవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన సీపీఐ ఎంఎల్ మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు కడారి సత్యనారాయణరెడ్డి అలియాస్ కోసా దాదా మృతదేహాన్ని తీసుకువచ్చేందుకు ఆయన సోదరుడు రిటైర్డ్ ఎంఈవో కడారి కరుణాకర్‌రెడ్డి కరీంనగర్ నుంచి అబూజ్‌మడ్‌కు వెళ్తున్నట్లు తెలిపారు. 45 ఏళ్ల క్రితం కుటుంబసభ్యులను వదిలి అడవిబాటపట్టిన తన సోదరుడి చివరిచూపు కోసం పరితపిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఇప్పటిదాకా పోలీసులు తమకు సమాచారం ఇవ్వలేదని, తన తమ్ముడి మృతదేహాన్ని అయినా అప్పగించాలని కోరుతున్నానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ.... బసంత్‌నగర్‌లోని కేశోరామ్ సిమెంట్ ఫ్యాక్టరీలో అప్రెటిష్‌షిప్ చేస్తున్న సమయంలో అక్కడి నుంచే అడవి బాటపట్టిన తన తమ్ముడు ఇంతవరకు తిరిగి రాలేదని, తను 45 ఏళ్లుగా ఎలా ఉన్నాడనే విషయం కూడా తెలియదని ఆయన వివరించారు. 1980 ఉగాది పండుగను గోపాల్‌రావుపల్లిలో తాను, సోదరుడు కలిసి కుటుంబసభ్యులతో జరుపుకొన్నామని, మరుసటి రోజున కేశోరామ్ సిమెంట్ ఫ్యాక్టరీలో ఉద్యోగానికి సత్యనారాయణరెడ్డి వెళ్లిపోయాడని చెప్పారు. తర్వాత నెల రోజులకు ఇంటికి పోలీసులొచ్చి సత్యనారాయణ రెడ్డిపై హత్య కేసు నమోదైందని, ఆయన అండర్ గ్రౌండ్‌లోకి వెళ్లాడని చెప్పారని పేర్కొన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు తన తమ్ముడి గురించి సమాచారం లేదని, పత్రికల్లో వార్తలను చూడటం తప్ప ఏమీ తెలియదని వాపోయారు.



కరుణాకర్‌రెడ్డి

ధాన్యం కొనుగోలుకు 8,337 కేంద్రాలు

» ఏ-గ్రేడుకు రూ.2,389, సాధారణ రకానికి రూ.2,369

» ఈ సీజన్‌లో కూడా సన్నధాన్యానికి రూ.500 బోనస్

» పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ వెల్లడి

హైదరాబాద్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): రైతులు రైస్ మిల్లర్ల వద్దకు పోవద్దని, ధాన్యాన్ని తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన అవసరం లేదని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి, పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 8,337 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని, తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తామని చెప్పారు. ఏ-గ్రేడు ధాన్యానికి రూ.2,389, సాధారణ రకానికి రూ.2,369గా ధర నిర్ధారించారని, ప్రైవేటు ట్రేడర్లు ఎవరైనా ఎమ్మెస్పీ కంటే తక్కువ ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఖరీఫ్ 2025-26 ధాన్యం సేకరణ ప్రణాళికపై హైదరాబాద్‌లోని పౌరసరఫరాల భవన్‌లో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్ చౌహాన్ మాట్లాడుతూ.. 66 లక్షల ఎకరాల్లో రైతులు వరి పంట వేశారని, 159 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు 75 లక్షల టన్నులు వస్తుందనే అంచనాలున్నాయని వివరించారు. అంతకంటే ఎక్కువొచ్చినా రైతులు తెచ్చే చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని స్పష్టం చేశారు. ఈ సీజన్‌లో కూడా సన్నధాన్యానికి క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ ఇస్తామని, అయితే ఈ బోనస్ తెలంగాణ రైతులకు మాత్రమే వర్తిస్తుందని తెలిపారు. పొరుగు రాష్ట్రాలకు చెందిన కొందరు రైస్‌మిల్లర్లు, ట్రేడర్లు ఇక్కడి కొనుగోలు కేంద్రాల్లో అమ్మినట్లు గతంలో ఫిర్యాదులు వచ్చాయని, ఈసారి అలాంటి పరిస్థితి తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం లోడుతో వచ్చిన వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. కాగా, హార్వెస్టర్లపై ఈసారి నిఘా పెంచుతామని, కోతకు రాకపోయినా పచ్చి వరిని కోస్తే తేమ ఎక్కువ వస్తున్నదని, డీజిల్ పొదుపు కోసం హార్వెస్టర్ల ఆపరేటర్లు తక్కువ స్పీడుతో బ్లోయర్లు నడుపుతున్నారని, దీంతో ధాన్యం నాణ్యత దెబ్బతింటున్నదని చౌహాన్ తెలిపారు. ఏఈవోలు క్షేత్రస్థాయిలో హార్వెస్టర్లపై పర్యవేక్షణ చేస్తారన్నారు. ఇదిలా ఉండగా, బ్యాంకు గ్యారెంటీ ఇచ్చిన రైస్‌మిల్లర్లకే ధాన్యం ఇస్తామని, డిఫాల్టర్ల జాబితాలో ఉన్న రైస్‌మిల్లులకు ధాన్యం కేటాయింపులు చేసేది లేదని చౌహాన్ స్పష్టం చేశారు. వేగంగా మిల్లింగ్ చేసే రైస్‌మిల్లర్లకు అవసరమైతే అదనపు ధాన్యం కేటాయింపులు చేస్తామన్నారు.

పురుగుమందు తాగి రైతు ఆత్మహత్య

కారేపల్లి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్న ఓ రైతు చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. ఈ ఘటన ఖమ్మం జిల్లా కారేపల్లి మండలంలోని మంగలితండాలో చోటు చేసుకుంది. తండాకు చెందిన ధారవత్ పంతులు (52) తనకున్న నాలుగు ఎకరాల భూమిలో పత్తి, వరి సాగు చేశాడు. పంటలు ఆశాజనకంగా లేకపోవడంతో పాటు ఇంటి ఆర్థిక పరిస్థితి ఇబ్బంది కరంగా ఉంది. దీంతో మనోవేదనకు గురైన పంతులు ఆదివారం సాయంత్రం ఇంట్లోనే పురుగు మందు తాగాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు.

ఆర్టీసీ కార్మికులకు దసరా అడ్వాన్సు

హైదరాబాద్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(ఆర్టీసీ) కార్మికులకు యాజమాన్యం దసరా అడ్వాన్సు ప్రకటించింది. సెప్టెంబరు పనిదినాలకు సంబంధించి అక్టోబరులో చెల్లించే వేతనంతోపాటు పండగ అడ్వాన్సు కార్మికుల ఖాతాల్లో జమ చేయనున్నారు. ఆర్టీసీలో పనిచేస్తున్న క్లాస్ 3 ఉద్యోగులకు రూ.6 వేలు, క్లాస్ 4 ఉద్యోగులకు రూ.5500 పండగ అడ్వాన్సు చెల్లిస్తున్నారు. కార్మికులు అడ్వాన్సుగా తీసుకునే మొత్తాన్ని వచ్చే నవంబరు నుంచి పది సమాన వాయిదాల్లో తిరిగి తీసుకునున్నట్లు ఆర్టీసీ యాజమాన్యం ప్రకటించింది. కాగా ఆర్టీసీ కార్మికులు దసరా అడ్వాన్సు కాకుండా సింగరేణి కార్మికుల తరహాలో ఆదాయంలో వాటా కావాలంటున్నారు. సింగరేణి కార్మికులకు ఆదాయంలో 34% చెల్లిస్తుండగా, ఆర్టీసీ కార్మికులకు ఆర్టీసీ ఆదాయంలో 25% పండగ బోనస్‌గా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

గ్యాంగ్‌రేప్ చేసి కర్రతో కొట్టి హత్య

» కిస్మత్‌పూర్ మహిళ హత్య కేసులో వీడిన మిస్టరీ

» అత్తాపూర్ 143 పిల్లర్ వద్ద మద్యం మత్తులో మహిళ

» ఆమెను ఆటోలో తీసుకెళ్లి అత్యాచారం చేసిన డ్రైవర్

» తర్వాత ఆమెపై మరో ఇద్దరి రేప్.. ముగ్గురి అరెస్టు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కిస్మత్‌పూర్‌లో దారుణహత్యకు గురైన 32 ఏళ్ల మహిళ హత్య కేసును ఎట్టకేలకు పోలీసులు ఛేదించారు. ఆమెపై దుండగులు సామూహిక అత్యాచారానికి పాల్పడి కొట్టి చంపారని విచారణలో తేల్చారు. రాజేంద్రనగర్ జోన్ డీసీపీ సీహెచ్ శ్రీనివాస్ వెల్లడించిన వివరాల ప్రకారం.. ఈనెల 16న కిస్మత్‌పూర్ వంతెన వద్ద గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని కనుగొన్నారు. మృతదేహం ఉన్న స్థితిని బట్టి.. ఆమెపై అత్యాచారం చేసి హత్యచేసి ఉంటారని అనుమానించారు. హతురాలిని నాంపల్లిలోని ఆగాపురకు చెందిన గృహిణిగా గుర్తించారు. ఈనెల 14వ తేదీన ఆ మహిళ, ఓ కల్లుకాంపౌండ్‌కు వెళ్లి కల్లు తాగి ఆ మత్తులో పిల్లర్ నంబరు 143 వద్ద కూర్చుంది. లంగర్‌హౌజ్ ప్రశాంత్‌నగర్‌కు చెందిన మేకా దుర్గారెడ్డి అనే ఆటోవాలా, ఆమెను చూసి తన ఆటోలో బలవంతంగా కూర్చోబెట్టుకున్నాడు. బీరు, బిర్యానీ కొనుగోలు చేసి.. ఆమెను ఆటోలో సాతురాయి సమీపంలోని కేఎల్‌సీసీ ఫంక్షన్ హాల్ సమీపంలోకి తీసుకెళ్లాడు. అక్కడ ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం ఆమెను ఆరాంఘర్ ఎక్స్ రోడ్డులోని పిల్లర్ నంబర్ 306 వద్ద దింపాడు. కొద్దిసేపటికి ఒంటరిగా ఉన్న బాధితురాలిని టోలిచౌకికి చెందిన ఇద్దరు ఆటో డ్రైవర్లు గులాం దస్తగిర్ ఖాన్ (26), మహ్మద్ ఇమ్రాన్ (25) చూశారు. ఇద్దరు కలిసి ఆమెను బలవంతంగా ఓ అద్దె ఆటోలో ఎక్కించుకున్నారు. అక్కడి నుంచి ఆమెను బుద్వేల్ మీదుగా కిస్మత్‌పూర్ వంతెన వద్దకు తీసుకువెళ్లారు. అక్కడ చెట్ల పొదల్లో ఆమెపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఆ సమయంలో ఆమె ప్రతిఘటించడంతో దస్తగిర్ ఖాన్ బాధితురాలిని కర్రలతో తీవ్రంగా కొట్టాడు. ఈ ఘటనలో ఆమె అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. అనంతరం మృతదేహాన్ని అక్కడి చెట్ల పొదల్లో వదిలేసి అక్కడి నుంచి వెళ్లిపోయారు. రెండ్రోజుల తర్వాత మృతదేహాన్ని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. సీసీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు చేసిన పోలీసులు, ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. కాగా ముగ్గురూ పాత నేరస్తులేనని.. వివిధ పోలీస్ స్టేషన్లలో వారిపై ఇప్పటికే కేసులు ఉన్నాయని పోలీసులు వెల్లడించారు.



రేషన్ డీలర్లతో చెలగాటం వద్దు

» బకాయి చెల్లింపుతోపాటు కమిషన్ పెంచాలి: హరీశ్‌రావు



హైదరాబాద్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : నెలల తరబడి రేషన్ కమీషన్ చెల్లించకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డీలర్ల జీవితాలతో చెలగాటమాడటం దుర్మార్గమని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో పలువురు రేషన్‌డీలర్లు మంగళవారం ఆయన్ను కలిసి తమ సమస్యలు వివరించారు. ప్రభుత్వం ద్వారా తమకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. పేదలకు రేషన్ బియ్యం పంపిణీ చేస్తూ, వారి ఆకలి తీరుస్తున్న రేషన్‌డీలర్లు.. కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాల తీరుతో పస్తులుండే పరిస్థితి ఏర్పడిందన్నారు. రేషన్ బియ్యం పంపిణీకి సంబంధించిన కమీషన్ అందక డీలర్లు ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం మొద్దునిద్ర నటిస్తోందన్నారు. అభయ హస్తం పేరిట ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టోలో రేషన్‌డీలర్లకు 5 వేల గౌరవ వేతనంతోపాటు కమీషన్ పెంచుతామని ఇచ్చిన హామీని కాంగ్రెస్ సర్కార్ విస్మరించిందన్నారు. మాటలు తప్ప చేతల్లేని కోతల ప్రభుత్వమిదని మండిపడ్డారు. రేషన్ డీలర్లకు బతుకమ్మ, దసరా, దీపావళి పండుగల సంబురాన్ని లేకుండా చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దుర్మార్గ వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఆరు నెలల కేంద్రప్రభుత్వ కమీషన్, రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన సెప్టెంబరు నెల కమీషన్‌ను విడుదల చేయాలని, కాంగ్రెస్ హామీ ప్రకారం రూ.5 వేల గౌరవవేతనం, కమీషన్ పెంపును తక్షణం ప్రకటించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.



భువనగిరి జిల్లా వలిగొండ మండలం సంగెం వద్ద పరవళ్లు తొక్కుతున్న మూసీ

27 వరకు భారీ వర్షాలు

నేడు, రేపు యెల్లో అలెర్ట్.. 26, 27న ఆరెంజ్ అలెర్ట్ జారీ

నిజామాబాద్ జిల్లాలో గోడ కూలి తండ్రీకూతురు మృతి

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్): తూర్పు మధ్య బంగాళాఖాతంలో ఈ నెల 25న అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. 26 నాటికి అది వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని పేర్కొంది. వాయుగుండం 27 నాటికి తీరాన్ని దాటే అవకాశం ఉందని వెల్లడించింది. దీని ప్రభావంతో 27 వరకు భారీ నుంచి అతి భారీ వర్షాలు అనేక జిల్లాల్లో కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. బుధ, గురువారాల్లో కొన్ని జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఈ రెండు రోజులకు యెల్లో అలెర్ట్ జారీ చేసింది. 26, 27తేదీలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. ఆ రెండు రోజులు రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. ఇక బుధవారం రాష్ట్రంలోని వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల జిల్లాల్లో భారీ వర్షాలు అక్కడక్కడ కురుస్తాయని వెల్లడించింది. రాష్ట్రంలోని చాలా జిల్లాల్లో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. నాగార్జునసాగర్ 26 గేట్ల నుంచి నీటి విడుదల కొనసాగుతోంది. 312 టీఎంసీల సామర్థ్యానికిగాను సాగర్‌లో 302.9 టీఎంసీల నీరు ఉంది. ప్రాజెక్టు నుంచి మొత్తం 3,42,506 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా అంతే మొత్తంలో ఇన్‌ఫ్లో వస్తోంది. శ్రీశైలం ప్రాజెక్టుకు మంగళవారం 3.98 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నది. పది గేట్లను 14 అడుగుల మేర ఎత్తి 3,49,620 క్యూసెక్కులను, కుడి, ఎడమ విద్యుత్ కేంద్రాల ద్వారా 65,482 క్యూసెక్కులను విడుదలచేస్తున్నారు. ప్రాజెక్టు సామర్థ్యం 215 టీఎంసీలు కాగా ప్రస్తుతం 203.89 టీఎంసీల నీరు ఉంది. జూరాలకు 3.32 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 45 గేట్లను ఎత్తి 3.14 లక్షల క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 25,676 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. యాదాద్రి జిల్లాలో మంగళవారం ఉదయం వరకు మోస్తరు వర్షం కురిసింది. అత్యధికంగా రాజాపేట మండలంలో 10.5 సెం.మీ, సంస్థాన్‌నారాయణపురం మండలంలో 10.1 సెం.మీ. వర్షపాతం నమోదైంది.

కుంటలో పడి ఒకరి గల్లంతు

మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం గంట్లకుంట శివారులోని చింతలకుంటలో అవుతాపురం గ్రామానికి చెందిన కమ్మగాని అశోక్(35) గల్లంతయ్యాడు. కేబుల్ వైరు మరమ్మతు కోసం తెప్పపై కుంట లోపలికి వెళ్లిన అతడు.. పని చేస్తుండగా నీటిలో పడిపోయాడు. నిజామాబాద్ జిల్లా కోటగిరిలో ఇందూర్ మహేష్(24)తో పాటు అతని నెలన్నర కూతురు గోడకూలి మృత్యువాత పడ్డారు. భార్య మహేశ్వరికి తీవ్ర గాయాలయ్యాయి. వీరి ఇంటిని ఆనుకొని మూతబడిన పాత రైస్‌మిల్ ఉంది. అది వాడుకలో లేకపోవడంతో భారీ వర్షాలకు గోడలకు పగుళ్లు ఏర్పడ్డాయి. మంగళవారం తెల్లవారుజామున రైస్‌మిల్ గోడ కూలి వీరి ఇంటిపై పడింది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

పాక్–సౌదీ కొత్త దోస్తీ

పాకిస్థాన్ మీదకు భారత్ యుద్ధానికి వస్తే, పాకిస్థాన్ పక్షాన సౌదీ అరేబియా కూడా ఇకమీదట పోరాడుతుంది కనుక, గతంలో మాదిరిగా కాక, రాబోయే రోజుల్లో భారత్ జాగ్రత్తగా మెలగాల్సిందేనని పాక్ రక్షణమంత్రి వ్యాఖ్యల పరమార్థం. ఈ ఒప్పందం కింద అణ్వాయుధాలు వాడకూడదన్న నియమం ఏమీ లేదని కూడా ఆయన గుర్తుచేశారు. సౌదీ దగ్గర అణ్వాయుధాలున్నాయో లేదో అనవసరం కానీ, పాకిస్థాన్ వద్ద కచ్చితంగా ఉన్నాయి కనుక, సౌదీ మీదకు ఇరాన్, ఇజ్రాయెల్ సహా ఎవరు దాడికి దిగినా అణ్వస్త్రాలను ఎదుర్కోవాల్సిందేనని అర్థం. ఎందుకూ కొరగాని ఈ తరహా ఒప్పందాలు చాలా దేశాల మధ్య జరుగుతూంటాయి కనుక భారత్ దీనిని ఏ మాత్రం ఖాతరుచేయనక్కరలేదని రక్షణరంగ నిపుణుల అభిప్రాయం. ఈ ఒప్పందం కేవలం రెండు దేశాలకు మాత్రమే పరిమితం కాదు, కాబోదని కూడా పాకిస్థాన్ హెచ్చరిస్తున్నందున మరిన్ని దేశాలు వచ్చిచేరి ఇస్లామిక్ నాటో ఆవిర్భవించవచ్చునని కొందరు అతిగా లెక్కలేస్తున్నారు కూడా.

పహల్గాం ఉగ్రదాడికి భారత్ దీటుగా సమాధానం ఇవ్వడంతో పాకిస్థాన్‌లో వొణుకుపుట్టి ఈ ఒప్పందం చేసుకుందని నరేంద్రమోదీ అభిమానులు అంటున్నారు. ఆ ఘర్షణలో చైనా ప్రత్యక్షంగానూ పరోక్షంగానూ పాకిస్థాన్‌కు సర్వసహాయాలూ అందించిన తరువాత, అమెరికా కూడా పాకిస్థాన్ వైపే ఉంటున్న ఈ కాలంలో సౌదీ సాయం దానికి ఎందుకు అన్న ప్రశ్న ఉండనే ఉంది. ఏతావాతా, పాక్ ఆర్మీతో మరో దఫా మనం తలపడాల్సివస్తే సౌదీని కూడా లెక్కబెట్టుకొని మరీ రంగంలోకి దిగాలన్నమాట. ఒకరిని కొడితే మరొకరిని కొట్టినట్టేనని ఈ రక్షణ ఒప్పందం అంటోంది మరి. ఈ మిత్రదేశాల మధ్య ఇప్పటివరకూ అనధికారికంగా అమలులో ఉన్న అవగాహన ఈ ఒప్పందంతో అధికారికమైంది. రెండు దేశాల మధ్య ఉన్న సైనికబంధానికి దశాబ్దాల చరిత్ర ఉంది. 1960లలో మక్కామదీనాను కాపలాకాయడం నుంచి సౌదీ రాజకుటుంబానికి రక్షణ కల్పించడం వరకూ పాక్ సైనికబలగాలు ప్రశస్తమైన పాత్ర పోషించాయి. అలాగే, సౌదీ సొమ్ము పాకిస్థాన్‌లోకి నిరవధికంగా ప్రవహించి అది తన అణ్వస్త్రకార్యక్రమాన్ని సజావుగా సాగించడానికి కూడా ఉపకరించిందంటారు.

ట్రంప్ దయవల్ల పాకిస్థాన్‌తో ఇప్పుడు చాలా దేశాలు స్నేహాన్ని పెంచుకుంటున్న తరుణంలో, సౌదీతో ఈ అధికారిక ఒప్పందం దానికి రక్షణకంటే, పశ్చిమాసియా భౌగోళిక రాజకీయ వేదికమీద మరింత విలువ, గౌరవం పెంచుతుందని విశ్లేషకుల అభిప్రాయం. ఒక ప్రాంతీయశక్తిగా కాక, అరబ్ ప్రపంచానికి గుండెకాయవంటి ఒక దేశానికి రక్షణకల్పిస్తున్న దేశంగా పాక్ అవతరించినట్టయిందని అంటున్నారు. ముస్లిం ప్రపంచాన్ని కాపాడుతున్నది తామేనని పాక్ ప్రజలకు ఆత్మసంతృప్తి కలిగించడంతోపాటు, ప్రస్తుత పాలకుల పట్ల వారిలో ఉన్న చులకన భావాన్ని తగ్గించేందుకు కూడా ఈ ఒప్పందం ఉపకరించవచ్చు.

అమెరికాను, మరీ ముఖ్యంగా ట్రంప్ ఏలుబడిలో అది ఉన్నంతకాలం, దానిని తన రక్షణకవచంగా నమ్ముకొని కూచుంటే మునిగిపోతామన్న భయం సౌదీకి కలగడంలో ఆశ్చర్యమేమీలేదు. ట్రంప్ అండతో ఇజ్రాయెల్ సరిహద్దులు దాటుతోంది, శ్రుతిమించిపోతోంది. ఖతార్‌లోకి కూడా చొరబడి దెబ్బతీసేంత దుస్సాహసానికి కూడా తెగబడింది. పైగా, ట్రంప్ దానిని తేలికగా తీసిపారేయడం గల్ఫ్ దేశాలకు భద్రత భయం కలిగించింది. ఈ పరిస్థితుల్లో ఒక అణ్వస్త్రదేశంతో అధికారిక రక్షణ ఒప్పందం సౌదీకి భరోసానివ్వడంతోపాటు, శత్రువులను హద్దుల్లో ఉంచడానికి ఉపకరిస్తుంది. నిజంగానే సౌదీకి విపత్తు ఏర్పడితే, పాకిస్థాన్ తన భద్రతను కూడా పణంగా పెట్టి సౌదీ పక్షాన కదనరంగంలోకి దూకుతుందా, అణ్వాయుధాలు వాడుతుందా అన్న ప్రశ్నలకు నిర్దిష్టమైన సమాధానాలు ఉండవు. కానీ, ఒకరికోసం ఒకరు నిలబడి, ఎంతటి త్యాగానికైనా సిద్ధం కావాలని ఈ ఒప్పందం చెబుతోంది కనుక, సౌదీ శత్రుదేశాలతో, మరీ ముఖ్యంగా ఇరాన్‌తో, ఇంకా అవసరమైతే ఇజ్రాయెల్‌తోనూ అది ఘర్షణకు దిగవలసి ఉంటుంది. ఖతార్ మీద ఇటీవలి ఇజ్రాయెల్ దాడి నేపథ్యంలో, సౌదీ ఈ ఒప్పందం ద్వారా అరబ్ దేశాలకు కొత్తదారి చూపించింది. ఇక, భారతదేశంతో పాకిస్థాన్ ఏ స్థాయిలో ఘర్షణపడినా, భారీ ఆర్థిక సాయంతో ఆదుకోవడం, దౌత్యపరంగా భారత్ మీద ఒత్తిడిపెంచడం వినా ప్రత్యక్షంగా పాకిస్థాన్ పక్షాన, భారత్‌కు వ్యతిరేకంగా యుద్ధరంగంలోకి సౌదీ దిగే అవకాశాలు లేవు. కనుకనే, సౌదీతో తనకున్న దశాబ్దాల మైత్రి గురించి ఓ నాలుగు మంచిమాటలు వల్లించడం వినా ఈ ఒప్పందం గురించి భారత్ లోతుగా వ్యాఖ్యానించలేదు, ఆందోళన పడుతున్నట్టు కనబడలేదు.

మతం ఉచ్చులోకి జారుతున్న ఆదివాసీలు!

'ఆదివాసులు హిందువులే' అనే కంటే, వారు హిందూ మతాన్ని 'అనుసరించే వాళ్ళు' మాత్రమే అంటే బాగుంటుంది. 'ఆంధ్రజ్యోతి'లో 24 జూలై 2025న 'ఆదివాసుల మతం ఏమిటి?' అని ప్రొ. భంగ్యా భూక్యా, 12 ఆగస్టు 2025న 'ఆదివాసీలు ముమ్మాటికీ హిందువులే' అని కాయం నవేంద్ర రాసిన వ్యాసాలు చదివాక ఈ విశ్లేషణ చేయాలనిపించింది.

హిందూ ఆచారాలు, అనేక దేవుళ్ళ పుట్టుక చరిత్ర వెనుక ఆదివాసీల చారిత్రక నేపథ్యం దాగున్నదని మరచిపోతున్నారు మేధావులు. పురాణేతిహాసాల్లో, వేదాలలో భక్త కన్నప్ప, ఏకలవ్యుడు, చెంచులక్ష్మి, శబరి, పోకల దమ్మక్క, హిడింబి, తాటకి, శూర్పణక, హోలిక, రావణుడు, నరకుడు, కుపార్ లింగో... వీరు గిరిజన ఆదివాసీలే కదా. ఆదివాసుల సంస్కృతీ సంప్రదాయ ఆచారాలే క్రమంగా హిందూ మతాచారాలుగా మారాయి. కాబట్టి ఈ మూలవాసులది పురాతన 'ఆదివాసీ మతం' అనటం సమంజసం.

ఆదివాసులు ఆదిమ కాలం నుంచి స్వీయ ఆచార సంస్కృతులు కలిగిన వారు. వారికి తెలిసిందల్లా నమ్మకంతో ముడిపడిన భక్తి మాత్రమే. ఆధ్యాత్మిక చింతనలు, పునర్జన్మలు, ముక్తి మార్గాలు వారికి తెలియవు. వారి ఇలవేల్పులైన నాగోబా, జంగుబాయి, పెర్స పేన్, మేడారం సమ్మక్క–సారక్క, గుంజేడు ముసలమ్మ, కొమ్మలమ్మ, సడలమ్మ, గట్టమ్మ, దూలరాజు, మారయ్య వంటి దైవాలను గౌరవించుకుంటారు. మొక్కులు చెల్లించుకుంటారు. వారికి వ్రతాలు, నోములు, పూజలు, మంత్రాలు, హెూమాలు తదితరాలతో సంబంధం లేదు. వారి పూర్వాచారాలే వారసత్వంగా అమలవుతున్నవి. అనారోగ్యం పాలైతే తెలిసిన మూలికా వైద్యం చేసుకుంటారు. మనోధైర్యం కోసం వారాంతపు దేవర్ల దగ్గరకు వెళ్లి పూనకం దేవర్లు చెప్పే ధైర్యపు మాటలు వింటారు. పంటలు బాగా పండాలని దేవర్లకు మొక్కుకుంటారు. కృతజ్ఞతతో వారికి ధాన్యం, ఇప్పసారా, మాంసాహారం వంటి వాటిని ప్రసాదంగా సమర్పించుకుంటారు. ఒక రకంగా గిరిజనుల భక్తి భావనలో కేవలం నమ్మకం, కృతజ్ఞతలు తప్ప ప్రతిఫలాపేక్ష ఏ మాత్రం ఉండదు. ఇది ఒకనాటి గిరిజనుల భక్తి భావనల తీరు.



ఆధునిక కాలంలో ఆదివాసుల భక్తి విధానాలలోనూ కొన్ని మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఆధునిక దైవాలైన శ్రీరాముడు, ఆంజనేయుడు, గణపతి, అయ్యప్పలను పూజిస్తున్నారు. గిరిజనేతరులతో కలిసి భక్తి కార్యక్రమాలు నిర్వహించుకుంటున్నారు. కానీ తమ సంస్కృతికి విఘాతం ఏర్పడితే గిరిజన జాతి ఉనికికే ప్రమాదమని ఇప్పటికైనా గ్రహించాలి.

నేటి ఆధునిక కాలంలో వస్తున్న మార్పుల్లో భాగంగా ఆదివాసుల భక్తి విధానాలలోనూ కొన్ని మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఆధునిక దైవాలైన శ్రీరాముడు, ఆంజనేయుడు, గణపతి, అయ్యప్పలను పూజిస్తున్నారు. మాల ధారణలు, దీక్షలు మొదలుపెట్టారు. గిరిజనేతరులతో కూడా కలిసి విడివిడిగా భక్తి కార్యక్రమాలు నిర్వహించుకుంటున్నారు. అందులో భాగంగానే, ఇటీవల గిరిజన గ్రామాల్లో విరివిగా గణేష్ మండపాలు వెలిశాయి. గ్రామస్తులంతా చందాలు వేసుకుని పూర్తి ఆధునిక పద్ధతుల్లో గణేష్ పూజలు నిర్వహిస్తున్నారు. అయితే, నిమజ్జనం, శోభాయాత్రల్లో మాత్రం తమదైన డోలు వాయిద్యం, గిరిజన నృత్యాలతో సాంప్రదాయంగా ఊరేగింపులు నిర్వహిస్తున్నారు. ఇదే క్రమంలో సంక్రాంతి నాడు శ్రీరామ భజన చేస్తూ గిరిజన గ్రామాల్లో పల్లకీ సేవలు నిర్వహిస్తున్నారు. సమీప ప్రాంతాల్లో జరిగే శివరాత్రి నాటి శివకళ్యాణం, శ్రీరామ నవమి నాటి సీతారామ కళ్యాణం, నృసింహ జయంతికి నరసింహ కళ్యాణం జరుపుకుంటున్నారు. భద్రాచలంలోని రామాలయంలో శబరి స్మృతి యాత్ర వంటి వివిధ తీర్థాలకు గిరిజనులు అధిక సంఖ్యలో వెళుతున్నారు. ఈ మధ్యన భగవద్గీత త్రైత కమిటీ ద్వారా కృష్ణుని పల్లకి సేవ, జయంతి పూజలు చేశారు. వీటి వెనుక మనువాదం మిళితం అయి ఉన్నదని ఆదివాసులు గమనించడం లేదు. కానీ తమ సంస్కృతికి విఘాతం ఏర్పడితే గిరిజన జాతి ఉనికికే ప్రమాదమని ఇప్పటికైనా గ్రహించాలి.

మరోవైపు గిరిజనుల్లో కొందరు అనారోగ్యాల నుంచి స్వస్థత పొందే క్రమంలో చర్చిలకు వెళుతున్నారు. పాస్టర్ల ఆర్థిక పురోభివృద్ధి ప్రత్యక్షంగా చూసిన కొంత మంది గిరిజన యువకులు పాస్టర్లుగా కూడా మారుతున్నారు. దీనితో ప్రతి గిరిజన గ్రామంలో చర్చిలు వెలుస్తున్నాయి. మరోపక్క తమ జాతి పండుగలకు దూరమవుతున్నారు. వారిదైన గిరిజన సంస్కృతికి సంబంధించిన కొత్తల పండుగ, విత్తనాల పండుగ, వివిధ తెగల, గోత్రాలకు నిర్దేశించిన ఇలవేల్పు పండుగలను మర్చిపోతున్నారు. గ్రామ పండుగలైన ఎల్లమ్మ, పోచమ్మ, పెద్దమ్మ తదితర పండుగలకు, జాతర్లకు కూడా దూరమవుతున్నారు.

ఇలాంటి సంక్షోభ సమయంలో అక్షరాస్యులు, ఉద్యోగులైన గిరిజన యువత ఏర్పాటు చేసుకున్న తుడుందెబ్బ, సంక్షేమ పరిషత్, ఆదివాసీ సేన తదితర గిరిజన సంఘాలు ఆధునిక భక్తిభావాలపట్ల వ్యతిరేకతను ప్రకటిస్తున్నాయి. తమదైన గిరిజన సంస్కృతికి సంబంధించిన దేవర్లను, ఇలవేల్పులను, ఆదివాసీ వీరులను మాత్రమే పూజించుకునే ప్రయత్నాలు ఇప్పుడిప్పుడే మొదలవుతున్నాయి. ఈ చైతన్యం దిశగా గిరిజన సంఘాలు ప్రత్యక్ష కార్యాచరణకు పూనుకోవాలి. నేటి గిరిజన యువతలోని అక్షరాస్యత కేవలం ఉద్యోగాల కోసం, ఆర్థిక వృద్ధి కోసం మాత్రమే కాదు. తమదైన సంస్కృతులను, సాంప్రదాయాలను, తమ అస్తిత్వాన్ని సంరక్షించుకోవాలి.

■ **గుమ్మడి లక్ష్మీనారాయణ**
ఆదివాసీ రచయితల వేదిక వ్యవస్థాపకులు

30 వసంతాల చైతన్య మహిళా సంఘం

1991 మద్యనిషేధ ఉద్యమం ఉవ్వెత్తున సాగుతున్న కాలంలో పాల్గొన్న భావసారూప్యత గల సంఘాలు ఏకమై, 1995 సెప్టెంబర్ 24, 25న ఆంధ్రప్రదేశ్ చైతన్య మహిళా సమాఖ్యగా ఏర్పడి తదనంతరం చైతన్య మహిళా సంఘంగా మారింది. సంపూర్ణ మద్యనిషేధం, సంక్షేమ పథకాల అమలుకై పోరాటాలు చేసింది. ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆందోళనలు చేసింది. మహిళా చట్టాలలో మార్పుల కోసం పోరాడింది. మహిళలపై హింసకు కారణమైన సంస్కృతికి వ్యతిరేకంగా అవగాహన తరగతులు, సమావేశాలు నిర్వహిస్తూ, మహిళామార్గం పత్రిక ద్వారా చైతన్యం పెంచుతోంది. కష్టాలకు కారణమైన వాటిని తెలుసుకుని ఉద్యమిస్తే సమాజం అభివృద్ధి వైపు పయనిస్తుంది. ఈ నేపథ్యంలో చైతన్య మహిళా సంఘం ఆవిర్భావదినం సందర్భంగా కడప జిల్లా, రామేశ్వరం రోడ్డులోని తొగటవీర క్షత్రియ కళ్యాణ మండపంలో నేడు సదస్సు జరగనున్నది. మూడు సెషన్లలో జరిగే ఈ సభలో ప్రసంగాలు, పుస్తకావిష్కరణలు, సందేశాలు ఉంటాయి.

— **జ్యోతి,** రాష్ట్ర కన్వీనర్, చైతన్య మహిళా సంఘం

జీఎస్టీ తగ్గింపు తెచ్చే లబ్ధి ఎంత?



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

'జీఎస్టీ సంస్కరణల వల్ల ప్రజల చేతుల్లో దాదాపు రూ. 2 లక్షల కోట్లు పెట్టినట్లే. ఇక దేశంలో వినియోగదారుల కొనుగోళ్లు ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతాయి..' అని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గత వారం మీడియాకు వెల్లడించారు. 'ఈ నవరాత్రి నుంచి దేశంలో నూతన ఆర్థిక అధ్యాయం ప్రారంభమవుతోంది. ఇప్పటికే జీఎస్టీ తగ్గింపునకు, మీకు కల్పించిన ఆదాయపన్ను రాయితీలను కలిపితే 2.5 లక్షల కోట్లు మీరు ఆదా చేసినట్లే. ఇక ఆదా ఉత్సవాలు జరుపుకోండి' అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ అన్నారు. బీజేపీ నేతలు, కేంద్ర మంత్రులు దేశవ్యాప్తంగా పర్యటిస్తూ వర్తకులు, కొనుగోలుదారులతో భేటీ అవుతున్నారు. 'జీఎస్టీ తగ్గింపు ఒక వరం' అంటూ బీజేపీ నేతలంతా వాట్సాప్ స్టేటస్‌లో మోదీ ఫొటో పెట్టుకుని ప్రచారం చేస్తున్నారు.

నిజానికి జీఎస్టీ తగ్గించడం అనేది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్న ఉమ్మడి నిర్ణయం. ఈ విషయాన్ని బీజేపీ అగ్రనేతలు మాత్రమే ప్రచారం చేసుకోవడం సమాఖ్య స్ఫూర్తికి వ్యతిరేకమే. అయితే దేశంలోనూ విదేశాల్లోనూ అనేక ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న దృష్ట్యా బిహార్ ఎన్నికలను కూడా దృష్టిలో ఉంచుకుని అధికార పార్టీ ఈ ప్రచారాన్ని చేసుకోవడాన్ని తప్పు పట్టలేము. బీజేపీ మాత్రమే కాదు, కాంగ్రెస్ కూడా జీఎస్టీ తగ్గింపును తమకు అనుకూలంగా ఉపయోగించుకుంటోంది తామెప్పటి నుంచో జీఎస్టీని గబ్బర్ సింగ్ టాక్స్‌గా అభివర్ణిస్తున్నామని, నిత్యావసర వస్తువులపై జీఎస్టీని తగ్గించాలని డిమాండ్ చేస్తున్నామని, జీఎస్టీ తగ్గించడం తమ వల్లేనని ఆ పార్టీ చెప్పుకుంటోంది. చిదంబరం వంటి కాంగ్రెస్ ఆర్థికవేత్తలు మాత్రమే కాదు, జీఎస్టీ మండలి సమావేశంలో ప్రతిపక్షాల పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూడా జీఎస్టీ తగ్గింపును స్వాగతించారు. అంటే ప్రస్తుత తగ్గింపు అభిలషణీయమేనని ఒప్పుకోవాలి. ఎవరు తీసుకున్నా, ఎందుకు తీసుకున్నా ప్రజలకు ఆర్థిక ప్రయోజనాలు పెరగడం అనేది మంచిదే కదా!

నవరాత్రులు ప్రారంభమైనప్పటి నుంచీ ప్రజలు పెద్ద ఎత్తున వీధుల్లోకి వచ్చి తాము ఆదా చేసిన 2.5 లక్షల కోట్లను ఖర్చు పెట్టి వినియోగ వస్తువులను కొనుగోలు చేస్తారని ప్రధానమంత్రి, ఆర్థిక మంత్రి ఆశిస్తున్నారు. ఈ మొత్తం ముందు జీఎస్టీ తగ్గింపువల్ల ప్రభుత్వానికి జరిగే రూ. 48వేల కోట్ల నష్టమెంత? అని నిర్మలా సీతారామన్ అంటున్నారు.

భారతదేశంలో ఆర్థికాభివృద్ధి గత పదేళ్ల నుంచి ప్రధానంగా స్వదేశీ వినియోగం ద్వారానే లభించిందని, జీడీపీలో 60 శాతం పైగా వినియోగం వల్లే వచ్చిందని మన ప్రభుత్వం చెప్పుకుంటోంది. 2027 నాటికి మూడవ అతి పెద్ద వినియోగ మార్కెట్ భారత్‌లో ఏర్పడుతుందని ప్రైస్ వాటర్ కూపర్స్ నివేదిక పేర్కొంది. అయితే కోవిడ్ తర్వాత భారతదేశంలో వినియోగం మళ్లీ ఊపందుకున్నప్పటికీ గత రెండుమూడేళ్లుగా పరిస్థితులు మారడం ప్రారంభమైన విషయాన్ని ఆర్థికవేత్తలు గమనించారు. అంతిమ ప్రైవేట్ వినియోగ వ్యయం బాగా తగ్గిపోతోందని, ఆహారం, దుస్తులు, చెప్పులు, రవాణా, ఇళ్ల వంటి వాటి విషయంలో ఖర్చు తగ్గిందని వారు గ్రహించారు. ముఖ్యంగా వినియోగ వస్తువులపై ఖర్చు తగ్గిపోవడం, అత్యవసరం కాని కొనుగోళ్లపై జనం దృష్టి మళ్లించడం, రుతుపవన పరిస్థితుల వల్ల గ్రామీణ డిమాండ్ దెబ్బతినడం, పంట ఉత్పత్తులు పడిపోవడం జరిగింది. అంతేగాక ఉపాధి కల్పన లేకపోవడం వల్ల పట్టణ డిమాండ్ కూడా బలహీనపడడం వల్ల జీడీపీ అభివృద్ధితో నిమిత్తం లేకుండా ఆర్థిక వ్యవస్థ మందకొడిగా మారడం ఆర్థికవేత్తల దృష్టి దాటిపోలేదు. తక్కువ ఆదాయ వర్గాల కొనుగోలు శక్తి తగ్గిపోవడం, ద్రవ్యోల్బణం మూలంగా ఖర్చు ప్రాధాన్యతలు మారిపోవడం స్పష్టంగా కనిపిస్తోంది. ప్రైవేట్ ఖర్చు తగ్గిపోవడం అనేది పన్ను వసూళ్లపై కూడా ప్రభావం చూపుతుంది. డిమాండ్ తగ్గిపోవడం వల్ల ప్రైవేట్ పెట్టుబడులు కూడా తగ్గిపోతాయి. దాని వల్ల ప్రభుత్వంపై భారం పెరుగుతుంది.

దేశంలో ఎగుమతుల కన్నా దిగుమతులు పెరగడం వల్ల వర్తక లోటు కూడా పెరుగుతోంది. 2024 సంవత్సరపు అంతర్జాతీయ కార్మిక సంస్థ నివేదిక ప్రకారం దేశంలో బలహీనమైన ఉపాధి కల్పనా వాతావరణం ఉన్నది. ధరల పెరుగుదలతో పోలిస్తే ఆదాయాల పెరుగుదల చాలా నిదానంగా ఉంది. అభివృద్ధిని వేగవంతం చేసే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు తగ్గిపోతున్నాయి. వేగంగా అమ్ముడుపోయే వినియోగ వస్తువుల వ్యాపారం (ఎఫ్ఎంసీజీ) అనేక సవాళ్ల ఎదుర్కొంటున్నది. ప్రధానంగా గత మూడేళ్లలో వాటి ధరలు 30 శాతం మేరకు పెరగడంతో వినియోగదారులు జాగ్రత్తపడాల్సి వచ్చింది. ఇవి మాత్రమే కాదు కార్ల కొనుగోళ్లు కూడా గత జూన్ వరకు బాగా పడిపోయినట్లు నివేదికలు వచ్చాయి. ఐటీ కంపెనీలు అతి పెద్ద ప్రైవేట్ రంగ సంస్థలైనప్పటికీ అవి కల్పించే ఉపాధి శాతం తక్కువ, ఇచ్చే జీతాలు కూడా తక్కువే. ఖాళీగా ఉన్న ఉద్యోగాలను అవి పూరించడం లేదు. ఏఐ వల్ల మున్ముందు అవి తగ్గే అవకాశాలే కాని పెరిగే అవకాశాలు లేవు. నైపుణ్యం ఉన్న యువత దేశంలోనే ఉండేందుకు ఇష్టపడడం లేదు. ఏ చిన్న దేశం వెళ్లినా అక్కడ భారతీయులే కనపడుతున్నారు. ప్రైవేట్ పెట్టుబడులే కాదు, ప్రభుత్వ ఉత్పాదక వ్యయం కూడా పెద్దగా పెరగడం లేదు. రూ. 150 కోట్లకు మించి పెట్టుబడులతో ఏర్పరచే మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు సరైన సమయంలో అమలు కాకుండా ఖర్చులు పెరిగిపోయి అనుకున్నదానికంటే అదనంగా కొన్ని లక్షల కోట్ల మేరకు చేరుకున్నాయి.



జీఎస్టీని రెండు ప్రధాన రేట్లకు తగ్గించడం అనేది చెప్పుకోదగిన నిర్ణయమే. అయితే ఇది చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా ఉన్నదని విమర్శలు వస్తున్నాయి. నిజానికి చాలా వస్తువుల ధరలు గత మూడేళ్లుగా ఎంతో పెరిగిపోయాయి. అందువల్ల ఇప్పుడు ఆ పెరిగిన రేట్లు తగ్గించడం ప్రాయశ్చిత్తం చేసుకోవడమే కాని వరాలు ప్రకటించడం కాదని ఆక్షేపిస్తున్నవారూ లేకపోలేదు.

దేశ ఆర్థిక వ్యవస్థలో అనేక దుష్పరిణామాలు ఉన్నాయి. సంపద, పరిశ్రమలు కొద్ది మంది చేతుల్లో కేంద్రీకృతం కావడం, ఒకే రాష్ట్రానికి తరలివెళ్లేలా చేయడం వంటివి ఇందులో ఒకటి. అదే విధంగా కేంద్రంతో సహా వివిధ రాష్ట్రాల అప్పులు తీవ్రంగా పెరిగిపోతున్నాయి. జీడీపీతో పోలిస్తే అప్పుల శాతం 30 నుంచి 50 శాతం ఉన్న రాష్ట్రాలు ఉన్నాయి. ప్రభుత్వాల నిరుత్పాదక వ్యయం కూడా తీవ్రంగా పెరిగిపోతోంది.

గత ఐదేళ్లుగా కేంద్ర ప్రభుత్వ 'ఉద్యమ్' పోర్టల్‌లో నమోదు చేసుకున్న 75 వేలకు పైగా ఎంఎస్ఎంఈ సంస్థలు మూతపడ్డాయి. ఎంతమంది ఉద్యోగం కోల్పోయారో చెప్పలేం. కానీ 2024 జులైలో ఎంఎస్ఎంఈ మంత్రి జితన్ రాం మాఝీ లోక్‌సభలో చెప్పిన జవాబు ప్రకారం 2020 జూలై నుంచి 2024 జూలై వరకు 49,342 సంస్థలు మూతపడి 3.18 లక్షల మంది ఉపాధి కోల్పోయారు. ప్రతి ఏడాదీ 70 నుంచి 80 లక్షల మంది లేబర్ మార్కెట్‌కు చేరుకుంటున్నారు. జనాభా పెరగడం మనకు వరం అనేవారు ఉన్నారు. కానీ వారికి ఉపాధి కల్పించేందుకు పెరుగుతున్నంత వేగంగా తీసుకుంటున్న చర్యలేవీ? ఉత్పాదక రంగంలో వారికి కేవలం 1.7 శాతం మేరకు ఉపాధి లభిస్తోంది.

ఈ నేపథ్యంలో జీఎస్టీని రెండు ప్రధాన రేట్లకు తగ్గించడం అనేది చెప్పుకోదగిన నిర్ణయమైనప్పటికీ చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా ఉన్నదని విమర్శలు వస్తున్నాయి. నిజానికి చాలా వస్తువుల ధరలు గత మూడేళ్లుగా ఎంతో పెరిగిపోవడం వల్ల ఇప్పుడు వాటిని తగ్గించడం ప్రాయశ్చిత్తం చేసుకోవడమే కానీ వరాలు ప్రకటించడం కాదని విమర్శించేవారు లేకపోలేదు. ఇన్నాళ్లూ ప్రతిపక్షాలు విమర్శిస్తున్నా ప్రభుత్వం మౌనంగా ఉండి మాటిమాటికీ జీఎస్టీ రేట్లలో మార్పులు చేస్తూ, ఆరు రేట్లను అమలు చేస్తూనే ఎందుకు ఉండిపోయిందనేదే తెలియడం లేదు. జీడీపీ పెరుగుదలపై ట్రంప్ విధించిన టారిఫ్‌ల వ్యతిరేక ప్రభావాన్ని తట్టుకునేందుకు కూడా ఈ రేట్ల తగ్గింపు దోహదం చేస్తుందని ప్రభుత్వం ఆశిస్తున్నట్లు కనపడుతోంది.

ఐతే ఆర్థిక వ్యవస్థ మరింత వేగంగా పుంజుకునేందుకు సంస్కరణలు చేపట్టడం, ప్రత్యామ్నాయ మార్కెట్లను అన్వేషించడం కూడా అవసరం. పెట్రోలు, డీజిల్ ధరలు తగ్గనంతకాలం సరుకుల, ప్రయాణికుల రవాణా వ్యయం తగ్గే అవకాశాలు లేవు. సెస్‌ల ద్వారా, అదనపు ఎక్సైజ్ సుంకాల ద్వారా సేకరించే 85 శాతాన్ని కేంద్రం పంచుకునేందుకు ఇష్టపడదు. ప్రైవేట్ పెట్టుబడులు పెరిగినప్పటికీ 6.5 శాతం అభివృద్ధి రేటు నుంచి 8 శాతం పెరిగేందుకు అవి ఇప్పట్లో దోహదం చేసే అవకాశాలు లేవు. అందువల్ల డిమాండ్ పెంచడం తప్ప ప్రభుత్వానికి మరో గత్యంతరం లేదు.

కాగా జీఎస్టీ రేట్ల తగ్గింపు ప్రభావం ఆ రేట్ల తగ్గింపు వినియోగదారుల వరకు చేరడాన్ని బట్టి ఉంటుందని క్రిసిల్ ఒక నివేదికలో పేర్కొంది. పెద్ద కంపెనీలే ఈ లాభాల్ని హస్తగతం చేసుకుంటాయా, లేక వినియోగదారుడితో పంచుకుంటాయా అన్నది వేచి చూడాల్సి ఉన్నది. జీఎస్టీ రేట్ల తగ్గింపును పర్యవేక్షించే నేషనల్ యాంటీ ప్రాఫిటీరింగ్ అథారిటీకి పెద్ద అధికారాలు లేవని విమర్శలు ఉన్నాయి. ఇక రేట్ల తగ్గింపు మూలంగా జీఎస్టీ ఆదాయంలో 15 నుంచి 20 శాతం తగ్గిపోతుందని, దాదాపు రూ. 2లక్షల కోట్ల మేరకు రెవెన్యూ నష్టం వస్తుందని రాష్ట్రాలు అంటున్నాయి. ఈ మొత్తాన్ని కేంద్రం ఎలా పూరిస్తుందో అగమ్యగోచరంగా ఉన్నది. ఏమైనా అనేక ఆర్థిక ఒత్తిళ్ళ, అంతర్జాతీయ పరిణామాల వల్ల ఏర్పడిన ఆర్థిక అస్థిరత వల్ల ప్రధానమంత్రికి మళ్లీ ఆత్మనిర్భర్ భారత్ గుర్తుకు వచ్చింది. 2014లో ఆట్టహాసంగా ఆయన మేక్ ఇన్ ఇండియా గురించి ప్రకటించినప్పటికీ ఉత్పాదక రంగం వాటా జీడీపీలో 16.7 శాతం నుంచి 13 శాతానికి తగ్గిపోయిందన్న విషయం ఆయనకు తెలియనిది కాదు.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

ఉన్నవి బాగుచేయక కొత్త విద్యా సంస్థలెందుకు?!

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గారికి,

గత ప్రభుత్వం ఒక విధానంగా ప్రభుత్వ పాఠశాలలను, కళాశాలలను, యూనివర్సిటీలను ధ్వంసం చేసిందనీ, ఫలితంగా వెల్లువెత్తిన వ్యతిరేకత వలన ఎన్నికలలో ఓడిపోయిందనీ మీకు తెలియని విషయం కాదు. ఆలస్యంగానైనా విద్యా విధానంలో సమూల మార్పులు తీసుకువచ్చి అందరికీ విద్య అందించాలన్న మీ లక్ష్యంతో మేము ఏకీభవిస్తున్నాం. అయితే ఈ లక్ష్యాలు నెరవేరడానికి ఎటువంటి విద్యా విధానం తీసుకురావాలనేదే చర్చనీయాంశం.

సెప్టెంబర్ 17న జరిగిన ముఖ్యమంత్రి సమీక్షా సమావేశంలో నియోజకవర్గానికి ఒకటి చొప్పున 20 నుంచి 25 ఎకరాల స్థలంలో ఏర్పాటు చేస్తున్న యంగ్ ఇండియా సమీకృత గురుకులాల కోసం రూ.21వేల కోట్లు, ఉన్నత సాంకేతిక, డిజిటల్ విద్య కోసం రూ.9వేల కోట్లు, మొత్తం కలిపి రూ.30వేల కోట్ల వరకు నిధులు అవసరమని మీరు చెప్పారు. ఈ నిధులను రుణాల ద్వారా సేకరించడానికి ఒక ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రస్తుతం ఒక్కొక్క గురుకులం కోసం సేకరిస్తున్న భూములను ఈ ప్రత్యేక కార్పొరేషన్ ఆస్తిగా మార్చి, దానిని తాకట్టు పెట్టి రుణాలను తీసుకొస్తామని కూడా చెప్పారు. ఈ రుణాలు ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్, ఆసియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్, ఇతర బ్యాంకుల నుంచి తీసుకోవాలని మీ ప్రభుత్వం నిర్ణయించింది.

ఇక్కడ విషయం ఏమిటంటే ఇప్పటికీ మన రాష్ట్రంలో సుమారు 30 వేల పాఠశాలలు, 300 కళాశాలలు, 17 యూనివర్సిటీలు ప్రభుత్వ రంగంలో ఉన్నాయి. విద్యా రంగంలో గత ప్రభుత్వం చేసిన విధ్వంసాన్ని ఆపివేసి, ప్రభుత్వ రంగంలో ఉన్న విద్యాసంస్థలను సమగ్రంగా అభివృద్ధి చేసే బదులు మీరు యంగ్ ఇండియా సమీకృత గురుకులాలని, ప్రైవేటు రంగంలో స్కిల్ యూనివర్సిటీ అని, స్పోర్ట్స్ యూనివర్సిటీ అని కొద్దిమందికే ఉపయోగపడే కొత్త నిర్ణయాలు చేస్తున్నారు. కొత్త సమస్యలు తెచ్చిపెడుతున్నారు. విద్యారంగంలో కొద్ది మందికి ఉపయోగపడే గురుకులాలను బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా ఏర్పాటు చేసింది. అదే సమయంలో పేదలు, దళితులు, ఆదివాసీలు చదువుకునే వేలాది విద్యాసంస్థలను ధ్వంసం చేసింది. మీరు కూడా ఇప్పుడు వేలాది ప్రభుత్వ పాఠశాలలను నిర్లక్ష్యం చేసి ఏర్పాటు చేయబోయే యంగ్ ఇండియా సమీకృత గురుకులాలు కొద్దిమందికే ఉపయోగపడతాయి. లక్షలాదిగా ఉన్న పేద బిడ్డలందరికీ విద్యను అందించలేవు. అవి ప్రధానంగా రాజకీయ నాయకుల, కాంట్రాక్టర్ల ప్రయోజనాల కోసమేనని తెలుస్తూనే ఉన్నది.

ప్రభుత్వ రంగంలో ఉన్న పాఠశాలలు ఎన్నో సమస్యలతో ఉన్నాయి. ఇప్పటికీ మీ ప్రభుత్వం తరఫు నుంచి పత్రికా ప్రకటనలు తప్ప నాణ్యమైన పూర్వ ప్రాథమిక విద్యకు ఒక స్పష్టమైన ప్రణాళిక లేదు. ప్రాథమిక పాఠశాలల్లో సగటున ఐదుగురు టీచర్లు ఉండవలసిన చోట ఇద్దరూ లేదా ముగ్గురు టీచర్లు మాత్రమే ఉన్నారు. ఒకే టీచర్ ఉన్న పాఠశాలలు 4,235 వరకు ఉన్నాయి. ఇది చాలదన్నట్టు విద్యాశాఖ పంపించిన ఉత్తర్వుల ప్రకారం 60 కన్నా తక్కువ విద్యార్థులు ఉన్న 15వేల పాఠశాలలకు ఇద్దరు టీచర్లను మాత్రమే ఇస్తామని తెగేసి చెప్పారు. ప్రస్తుత పరిస్థితులను అర్థం చేసుకుంటే 20 మంది విద్యార్థులకు ఇద్దరు టీచర్లనీ, ఆ తరువాత 1:20 ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తిలో ఉపాధ్యాయులను కేటాయిస్తే తప్ప 15 వేల పాఠశాలలు మూతపడే పరిస్థితులు మారవు. బాలికలకు మరుగుదొడ్లు లేని పాఠశాలలు ఇప్పటికీ 2,811 ఉన్నాయి. అంటే మౌలిక సదుపాయాలు ఎంత దారుణంగా ఉన్నాయో అర్థం అవుతున్నది. రాష్ట్రంలోని 33 జిల్లాలకు 26 జిల్లాలలో డీఈఓలు లేరు. అలాగే 612 మండలాలకు 596 మండలాల్లో మండల విద్యాశాఖ అధికారులు లేరు. డైట్ కళాశాలలో 92 శాతం, ఎస్‌సీఈఆర్‌టీలో 95శాతం అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఫలితంగా జీరో ఎన్‌రోల్మెంట్ స్కూళ్లు అనే ఒక విష పరిణామం విద్యారంగంలో ఏర్పడి, సంవత్సరానికి రెండు వేల వరకు స్కూళ్లు మూతపడుతున్నాయి.



ప్రభుత్వ రంగంలో ఉన్న విద్యాసంస్థలను సమగ్రంగా అభివృద్ధి చేసే బదులు మీరు యంగ్ ఇండియా సమీకృత గురుకులాలని, ప్రైవేటు రంగంలో స్కిల్ యూనివర్సిటీ అని, స్పోర్ట్స్ యూనివర్సిటీ అని కొద్దిమందికే ఉపయోగపడే కొత్త నిర్ణయాలు చేస్తున్నారు. ఈ మార్పులు అటు కాంట్రాక్టర్లకు, ఇటు ఐటీ కంపెనీలకు ఉపయోగపడతాయి తప్ప ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ విద్యా సంస్థల అభివృద్ధికి ఉపయోగపడవు.

ఇక 20శాతం డిగ్రీ కాలేజీల్లో కూడా ఇప్పటికీ విద్యార్థినులకు మరుగుదొడ్లు లేవు. కొన్ని సబ్జెక్టులలో 150 మంది విద్యార్థులు ఉన్నా కూడా ఒకరే అధ్యాపకుడు బోధిస్తున్నాడు. ఎయిడెడ్ పాఠశాలలు, కళాశాలల నడ్డి విరిగిపోయింది. ప్రైవేటు పాఠశాలల, కళాశాలల దోపిడీకి అడ్డూ అదుపూ లేకుండా పోయింది. గత రెండేళ్లుగా అన్ని స్కూళ్లలో, కాలేజీలలో మౌలిక సదుపాయాలు కల్పించి, అవసరమున్నంతమంది టీచర్లను నియమించాలని, ప్రైవేటు కార్పొరేటు పాఠశాలల, కళాశాలల ఫీజులను రెగ్యులేట్ చేయాలని అడిగితే పట్టించుకునే నాథుడే కరువయ్యాడు.

ఇక యూనివర్సిటీ విద్యకు వస్తే ప్రభుత్వ రంగంలో ఉన్న దాదాపు 17 యూనివర్సిటీలను అభివృద్ధి చేసే బదులు ప్రైవేటు రంగంలో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ అని, స్పోర్ట్స్ యూనివర్సిటీ అని కొత్త నిర్ణయాలు తీసుకుంటున్నారు. మీరు చెప్పినట్టుగా ఉస్మానియా యూనివర్సిటీ, కాకతీయ యూనివర్సిటీలు ఒకప్పుడు దేశ విద్యారంగంలోనే కీలక పాత్ర పోషించాయి. కానీ వాటి పరిస్థితులు ఇప్పుడు హృదయ విదారకంగా తయారయ్యాయి. మీరు ఉస్మానియా యూనివర్సిటీకి వెళ్లి 'వైస్ చాన్సలర్‌కి ప్రభుత్వాన్ని డబ్బులు అడగటం రావడం లేదని, వెయ్యి కోట్లయినా ఇవ్వటానికి సిద్ధంగా ఉన్నా'మని సెలవిచ్చారు. కానీ మీరు ప్రవేశపెట్టిన గత బడ్జెట్‌లో అన్ని యూనివర్సిటీలకు కలిపి కేటాయించిన డబ్బులు రూ.450కోట్లు దాటలేదు. యూనివర్సిటీలకు భిక్షం వేసినట్లుగా రూ.35–40 కోట్లు ఇచ్చారు. యూనివర్సిటీలలో అధ్యాపక పోస్టులు రెండు వేల వరకు ఖాళీగా ఉన్నాయి. ఇక్కడ మౌలిక వసతులు కల్పించడం, అధ్యాపకుల నియామకాలు చేపట్టే బదులు వినాశకరమైన జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా ప్రైవేటు రంగంలో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ అని ఐటీ కంపెనీలు టెక్నాలజీ, డిజిటల్ ఎక్విప్‌మెంట్ అమ్ముకోవడానికి ఉపయోగపడే విద్యా విధానాన్ని తీసుకొస్తున్నారు. ఇది పేద ప్రజలకు ఉపయోగపడే విద్యా విధానం కాదు.

పారదర్శకంగా బడ్జెట్ ద్వారా విద్యకు మీ మేనిఫెస్టోలో పెట్టినట్టయినా కనీసం 15శాతం నిధులు కేటాయించకుండా మీ మేనిఫెస్టోను మీరే విస్మరించారు. గత ప్రభుత్వం కాళేశ్వరం కార్పొరేషన్ పెట్టి, అప్పులు చేసి రాష్ట్రాన్ని దివాలా తీయించినట్టుగా, మీరు కూడా విద్యా కార్పొరేషన్ పెట్టి అదే బాటలో నడుస్తున్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే మీరు తీసుకొస్తున్న మార్పులు అటు కాంట్రాక్టర్లకు, ఇటు ఐటీ కంపెనీలకు ఉపయోగపడతాయి తప్ప ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ పాఠశాలల, కళాశాలల, విశ్వవిద్యాలయాల అభివృద్ధి కోసం ఉపయోగపడవు.

ఇప్పటికైనా అట్టడుగు కులాలకు, వర్గాలకు నాణ్యమైన విద్య అందించడానికి బడ్జెట్లో 20 శాతం నిధులు కేటాయించి, ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలి. మీరు తీసుకొస్తున్న యంగ్ ఇండియా సమీకృత గురుకులాలను ప్రతిపాదనలను విరమించుకోవాలి. డిజిటల్ విద్యకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం మానుకుని, ప్రభుత్వ విద్యా సంస్థలలో మౌలిక సదుపాయాలను కల్పించి, అవసరం ఉన్నంత మంది ఉపాధ్యాయులను, అధ్యాపకులను నియమించాలి.

■ ప్రొ. చక్రధరరావు
■ ప్రొ. హరగోపాల్
■ ప్రొ. లక్ష్మీనారాయణ
తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ



ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY హనుమకొండ HANUMAKONDA
బుధవారం 24 సెప్టెంబరు 2025



సమ్మక్క గద్దె వద్ద సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, ఎంపీ తదితరులు



గద్దెల ప్రాంగణంలో గంటలు కొడుతున్న సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి సీతక్క



సమ్మక్క గద్దె వద్ద సీఎం రేవంత్ రెడ్డి మొక్కులు

వనదేవతల దీవెనలతో
దొరల పాలన అంతం

- ప్రజా ఆశయాలకు అనుగుణంగానే పరిపాలన
- మేడారంలో రామప్పను పోలిన రాతి కట్టడాల నిర్మాణం
- వందల ఏళ్లు గడిచినా చెక్కుచెదరొద్దనే సంకల్పం
- 100 రోజుల్లో పనులన్నీ పూరి చేస్తాం
- జాతరకు కేంద్రం జాతీయ హోదా ఇవ్వాలి
- మేడారం బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- మాస్టర్‌ప్లాన్‌కు అనుగుణంగా అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం

ములుగు/తాడ్వాయి సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి అంటే అద్దాల మేడలు కాదని, ప్రజల జీవన ప్రమాణాలు అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా ప్రస్తుత ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని వనదేతల సన్నిధి మేడారంలో సీఎం మంగళవారం పర్యటించారు. ఇక్కడ చేపట్టిన మాస్టర్ ప్లాన్ అభివృద్ధి పనులను పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్కతో కలిసి ప్రారంభోత్సవం చేశారు. ఎల్ఈడీ స్ర్కీన్‌లపై మాస్టర్ ప్లాన్ డిజైన్ రూపకల్పన వీడియోను ప్రారంభించారు.

గద్దెల ప్రాంగణం పరిసరాల్లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ 2023 ఫిబ్రవరి 6న మేడారం సమ్మక్క-సారలమ్మ గద్దెల వద్ద మొక్కులు అప్పగించానని తెలిపారు. దొరల పాలనను అంతమొందించి ప్రజా పాలన తీసుకొస్తామని వనదేతల సాక్షిగా సంకల్పించానని అన్నారు. దీంతో తల్లుల దీవెనలు తోడై ప్రజల ఆశీస్సులతో అధికారం చేపట్టామన్నారు. అభివృద్ధి అంటే అద్దాల మేడలు కాదని, రంగుల గోడలు అంతకన్నా కాదని, ప్రజల జీవన ప్రమాణాలు పెంచడమే లక్ష్యంగా పని చేయాలని అప్పుడే సంకల్పించామన్నారు.

దేశ మూల వాసులైన ఆదివాసీలు, లంబాడీల ప్రాంతాలను అభివృద్ధిలో ముందుకు నడిపించాలని ప్రణాళికలు రూపొందించామన్నారు. తండాలు, గూడాలలో అభివృద్ధి చేపట్టామని, ఒక్కో నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరుచేశామని అన్నారు. మేడారం రావడానికి ముందు వాతావరణం అనుకూలంగా లేదని, వర్షసూచన ఉందని నిపుణులు చెప్పారు. కానీ, తనకు (మిగతా 7లో..)



రాతి కట్టడాలు

సిమెంట్‌తో కట్టిన నిర్మాణాలు 100 ఏళ్ల వరకే ఉంటాయని, అదే రాతి కట్టడాలు అయితే వేల సంవత్సరాలు అయినా చెక్కుచెదరవని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మన ప్రాంతంలో రుద్రదేవుడు నిర్మించిన రామప్ప దేవాలయంలా మేడారం దేవస్థానాన్ని రాతి కట్టడాలతో నిర్మిస్తున్నామని తెలిపారు. వందల ఏళ్లయినా చెక్కుచెదరొద్దనే సంకల్పంతో నిర్మాణాన్ని చేపడుతున్నామని, కేంద్ర ప్రభుత్వం కుంభమేళాకు వేలకోట్లు నిధులు ఇచ్చిందని, ప్రఖ్యాత మేడారం సమ్మక్క- సారలమ్మ జాతరకు ఇవ్వడం లేదని అన్నారు. జాతీయ హోదా కూడా కల్పించలేదని అన్నారు. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు మేడారానికి నిధులు తెచ్చేందుకు కృషి చేసి చిత్తశుద్ధిని చాటుకోవాలని అన్నారు.



ఏ ముఖ్యమంత్రి కూడా చేయని అభివృద్ధి : మంత్రి సీతక్క



మేడారం మహా జాతరకు ముందు ఏ ముఖ్యమంత్రి కూడా ఇక్కడికి రాలేదని మంత్రి సీతక్క అన్నారు. వెయ్యేళ్ల సమ్మక్క-సారలమ్మల కీర్తిని చాటేలా సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో కొత్త ప్రణాళికలను రూపొందించామన్నారు. దేవస్థానం ఆధునికీకరణ పనులు చేపడుతుండడంతో తన జన్మ ధన్యమైందన్నారు. అభివృద్ధి పనుల కోసం తాను అడిగిది ఆవగింజైతే తల్లులపై ఉన్న విశ్వాసంతో ముఖ్యమంత్రి కొండంత నిధులను మంజూరు చేశారని హర్షం వ్యక్తం చేశారు.

వడి వడిగా సాగిన సీఎం పర్యటన

- గద్దెల పరిసరాల్లో పూజారులతో సమీక్ష సమావేశం
- ఆదివాసీ నృత్యాలతో ఘన స్వాగతం
- వనదేవతలకు ప్రత్యేక పూజలు
- 68 కిలోల ఎత్తు బంగారం సమర్పణ

7

పోలీసుల భారీ బందోబస్తు

సీఎం రేవంత్‌రెడ్డి మేడారం పర్యటన నేపథ్యంలో ఎస్పీ శబరీశ్ నేతృత్వంలో పోలీసు యంత్రాంగం భారీ బందోబస్తును నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా వెయ్యి మందితో భద్రతను కట్టుదిట్టం చేశారు. హెలీప్యాడ్ నుంచి మొదలుకొని తల్లుల దర్శనం వరకు రోప్ పార్టీలు సీఎం వెంటే ఉన్నాయి. కార్యకర్తలు, భక్తులు, ప్రజలు రద్దీని నియంత్రిస్తూ పోలీసు సిబ్బంది శ్రమ పడాల్సి వచ్చింది.

జాతీయ అవార్డు అందుకున్న కాసర్ల శ్యామ్



జాతీయ పురస్కారాన్ని అందుకుంటున్న కాసర్ల శ్యామ్

హనుమకొండ కల్చరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): హనుమకొండకు చెందిన ప్రముఖ సినీ గేయరచయిత కాసర్ల శ్యామ్ 'బలగం' సినిమా కోసం రాసిన 'ఊరూ పల్లెటూరు' పాటకుగాను మంగళవారం జాతీయ పురస్కారాన్ని అందుకున్నారు. 2023 సంవత్సరానికి జాతీయస్థాయిలో ప్రకటించిన సినీ అవార్డుల జాబితాలో శ్యామ్ రాసిన పాట తెలుగు విభాగంలో ఉత్తమ గేయంగా అవార్డుకు ఎంపికైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మంగళవారం కొత్త ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్మ చేతులమీదుగా శ్యామ్ అవార్డు అందుకున్నారు.

అన్నపూర్ణేశ్వరి అలంకారంలో భద్రకాళి



అన్న పూర్ణేశ్వరి అలంకారంలో భద్రకాళి అమ్మవారు

మకర చంద్రప్రభ వాహనంపై ఊరేగిన ఉత్సవమూర్తి

రెండో రోజుకు చేరిన దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

వరంగల్ కల్చరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): చారిత్రక భద్రకాళి దేవస్థానంలో కొనసాగుతున్న దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు రెండో రోజుకు చేరుకున్నాయి. మంగళవారం ఉదయం 4 గంటలకు నిత్య పూజతో ప్రారంభమైన కార్యక్రమాలు ప్రధానార్చకులు భద్రకాళి శేషు నేతృత్వంలో నిత్యాహ్నికం, ఉదయం బ్రహ్మచారిణి, సాయంకాలం దేవజ దుర్గా క్రమాలలో పూజలు నిర్వహించారు. రెండో రోజు భద్రకాళి అమ్మవారిని అన్నపూర్ణేశ్వరిగా అలంకరించి భక్తుల దర్శనానికి ఏర్పాట్లు చేశారు. ఉదయం అమ్మవారి ఉత్సవమూర్తిని మకర వాహనంపై, సాయంత్రం చంద్రప్రభ వాహనంపై ఊరేగించారు. ఈ నవరాత్రుల్లో అమ్మవారిని నవదుర్గా క్రమంలో ఆరాధిస్తే విష్ణుమూర్తి అనుగ్రహం, అధికారం, జ్ఞానం రెండు సిద్ధిస్థాయని, అమ్మవారు అసుర శక్తులను పారదోలుతారని భద్రకాళి శేషు తెలిపారు. అన్నపూర్ణేశ్వరి అలంకరణలో ఆరాధిస్తే ప్రజలకు ఆకలి బాధలు దరిచేరవని, సమృద్ధిగా అన్న పానీయాలు సమకూరుతాయని అన్నారు. సాయంత్రం హరికథ, భక్తి సంగీతం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీభద్రకాళి సేవా సమితి ఆధ్వర్యంలో ఉదయం ఉచిత ప్రసాద వితరణ, మధ్యాహ్నం, రాత్రి వేలాది మంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా ఆలయ ఈవో రామల సునిత ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు తొనుపునూరి వీరన్న, గాదె శ్రవణ్‌కుమార్‌రెడ్డి, అనంతుల శ్రీనివాస్‌రావు, జారతి వెంకటేశ్వర్లు, మూగ శ్రీనివాస్, మయూరి రాంమోహన్, క్రాంతి, ఆంజనేయులు, మహిళా ధర్మకర్తలతో పాటు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

తండాలో పసికందు విక్రయం

అంగన్‌వాడీ కార్యకర్త ద్వారా వెలుగు చూసిన నిజం

చెన్నారావుపేట/నెక్కొండ, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలోని టేకులకుంట తండాలో పసికందును విక్రయించిన సంఘటన మంగళవారం కలకలం రేపింది. తండాకు చెందిన మౌనిక-యాకూబ్ దంపతులకు ఇప్పటికే ఇద్దరు ఆడపిల్లలున్నారు. ఇటీవల మూడో కాన్పులోనూ జూలై నెలలో ఆడపిల్ల పుట్టింది. కొద్దిరోజులుగా పుట్టిన ఆడపిల్ల వివరాల కోసం అంగన్‌వాడీ కార్యకర్త వీరమ్మ ప్రతీరోజు వెళుతోంది. మూడు రోజుల కిందట యాకూబ్ ఇంటికి వెళ్లగా బిడ్డ కనిపించలేదు, బిడ్డ అచూకీపై తల్లిదండ్రులను అడగడంతో సరైన సమాధానం చెప్పలేదు. వీరమ్మకు అనుమానం వచ్చి ఆడ పిల్ల అదృశ్యంపై జిల్లా ఉన్నతాధికారులకు సమాచారాన్ని అందించారు. దీంతో నెక్కొండ మండలంలోని దీక్షకుంట్ల గ్రామంలోని క్లస్టర్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హేమలత గ్రామానికి వెళ్లి ఆడపిల్ల కనిపించకపోవడంపై వివరాలను సేకరించారు. తన భర్త యాకూబ్ పసికందును రూ.50వేలకు విక్రయం చేసినట్లు మౌనిక అధికారులకు తెలిపింది. ఇదే విషయంపై హేమలత పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఐసీడీఎస్ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేష్‌రెడ్డి తెలిపారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ సూచించారు. పూర్తయిన అభివృద్ధి పనులకు బిల్లుల చెల్లింపు నిమిత్తం నగరంలోని పలు ప్రాంతాలలో కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనులకు సంబంధించిన నాణ్యతను పరిశీలించారు. మంగళవారం 31వ డివిజన్ దీన్‌దయాళ్ నగర్, 50వ డివిజన్‌లోని ఇందిరానగర్ కాలనీ, ఇంకా రాంపూర్, జవహర్‌కాలనీ, గోపాల్‌పూర్‌లో పర్యటించి డ్రెయిన్లు, రోడ్లను కొలతలతో పరీక్షించారు. ఎంబీల ప్రామాణికతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. తర్వాత రాంపూర్‌లో గ్రేటర్ ఉద్యానవన విభాగం ద్వారా సెంట్రల్ మీడియన్‌లో ఏర్పాటు చేస్తున్న మొక్కలను కమిషనర్ పరిక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల్లో కాంట్రాక్టర్లు నాణ్యాతా ప్రమాణాలు పాటించకుంటే బిల్లుల చెల్లింపులు జరగవని తేల్చిచెప్పారు. ఈ కార్యక్రమంలో ఈఈలు రవికుమార్, డీఈలు సారంగం, శ్రీకాంత్, రాజ్‌కుమార్, ఏఈ మేనకతో పాటు హార్టికల్చర్ అధికారులు పాల్గొన్నారు.



గోపాల్‌పూర్‌లో పనులను పరిశీలిస్తున్న కమిషనర్

చైన్ సిస్టం పేరుతో డబ్బుల వసూలు

ఆరు నెలల్లోనే 10వేల మంది సభ్యులు

టాస్క్‌ఫోర్స్ అదుపులో సంస్థ యజమాని, మరో ముగ్గురు?



పాలకుర్తి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లా పాలకుర్తి కేంద్రంగా నడుస్తున్న రియాల్టీ బిజినెస్ ఫెయిర్ హెల్ప్ సిస్టం (ఆర్బీఎఫ్) యజమాని తెప్పలి సైదులును టాస్క్‌ఫోర్స్ అధికారులు సోమవారం రాత్రి అదుపులోకి తీసుకున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. చట్టవిరుద్ధంగా గొలుసు కట్టు విధానంతో అమాయకులను సంస్థలో సభ్యులుగా చేర్పుతున్న నేపథ్యంలో అతడిని విచారిస్తున్నట్టు తెలుస్తోంది. సదులును అదుపులోకి తీసుకున్నారన్న ప్రచారంతో సంస్థ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. సూర్యాపేట జిల్లాకు చెందిన తెప్పలి సైదులు మూడేళ్ల కిందట పాలకుర్తిలో ఆర్బీఎఫ్ సంస్థను ఏర్పాటు చేసి, గొలుసు కట్టు విధానం అమలు చేశాడు. ఇటీవల ఆర్‌బీఎఫ్ సంస్థ పేరు స్థానంలో హెప్సీబా మార్కెటింగ్ అని బోర్డును ఏర్పాటు చేసి విస్తృత ప్రచారం చేపట్టాడు. సంస్థలో చేరే సభ్యులు రూ.6వేల నుంచి ఎంతైనా పెట్టుబడి పెట్టువచ్చు. ఈ స్కీం ప్రకారంతి రూ.6వేలు కట్టిన వ్యక్తికి మొదట రూ.2వేల విలువైన నిత్యావసర సరుకుల కిట్టు, రెండో నెల నుంచి రూ.వేయి చొప్పున 20 నెలలు అందచేస్తారు. ఈ స్కీంను నమ్మి కేవలం ఆరు నెలల్లోనే పదివేల మంది సభ్యులుగా చేరారు. అలాగే, సభ్యుల నుంచి పెట్టుబడులు సైతం పెట్టించాడు. కొందరికి ప్రతీ నెల వారి అకౌంట్లలో డబ్బులు జమ కావడంతో అత్యాశతో పేద ప్రజలు అప్పులు చేసి, బంగారం కుదువ పెట్టి ఆర్‌బీఎఫ్(హెప్సీబా)లో పెట్టుబడులు పెట్టినట్లు తెలుస్తోంది. అయితే చైన్ సిస్టం స్కీం గురించి తెలుసుకున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు సోమవారం రాత్రి సంస్థ యజమాని సైదులుతోపాటు, మరో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్టు తెలుస్తోంది. సంస్థ తీరుపై పూర్తిస్థాయిలో ఆరా తీస్తున్నట్టు సమాచారం. ఈ విషయం బయటకు పొక్కడంతో పెట్టుబడులు పెట్టినవారు ఆందోళన చెందుతున్నారు. గతంలోనూ ఈ యాజమాని చిట్టీల పేరుతో ప్రజలను మోసం చేసినట్లు ఆరోపణలున్నాయి. ఆర్‌బీఎఫ్ యజమానితోపాటు ఏజెంట్లుగా పని చేస్తున్న వారిపై కూడా చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న వైద్యులు

వైద్యుడిపై దాడి అమానుషం

ఎంజీఎం ఆస్పత్రిలో వైద్యుల నిరసన

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి. శ్రీనివాసరావుపై రోగి బంధువులు దాడి చేయడాన్ని రాష్ట్ర ప్రభుత్వ వైద్యుల సంఘం కేఎంసీ యూనిట్ తీవ్రంగా ఖండించింది. ఎంజీఎం ఆస్పత్రిలోని ఓపీ బ్లాక్ ఎదుట ప్రభుత్వ వైద్యులు నల్లబ్యాడ్జీలు ధరించి మంగళవారం నిరసన తెలిపారు. దాడి ఘటనను తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ వైద్యుల సంఘం కాకతీయ మెడికల్ కళాశాల యూనిట్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ అంబి శ్రీనివాస్ మాట్లాడుతూ.. డాక్టర్ శ్రీనివాసరావుపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వైఎస్ఆర్, డాక్టర్ త్రికోల్ చందర్, డాక్టర్ సమ్మయ్య, డాక్టర్ చిన్నికృష్ణ, డాక్టర్ సీహెచ్.మురళి, డాక్టర్ లక్ష్మణ్‌రావు, డాక్టర్ టి.నవీన్ కుమార్, డాక్టర్ జె.సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్‌ను తొలగించాలి



ధర్నా చేస్తున్న ఉద్యోగులు

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎంజీఎంలోని అర్బన్ ఫ్యామిలీ వెల్ఫేర్ సెంటర్‌లో డిప్యూటేషన్‌పై వచ్చిన మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ (ఎంఎల్‌హెచ్‌పీ) వేధింపులు భరించలేమని, ఆమెను వెంటనే యథాస్థానానికి పంపాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగులు మంగళవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.యాద నాయక్ మాట్లాడుతూ.. వరంగల్ జిల్లాలోని పర్వతగిరి మండలంలోని చౌటపల్లి గ్రామ ఎంఎల్‌హెచ్‌పీ డిప్యూటేషన్‌పై ఎంజీఎంలోని అర్బన్ ఫ్యామిలీ వెల్ఫేర్ సెంటర్‌కు వచ్చి ఇక్కడ పనిచేస్తున్న ఆశాలను, ఏఎన్ఎంలను సాటి మహిళలని చూడకుండా రోగుల ముందే తిడుతోందని, మానసిక ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. సంబంధిత అధికారులు స్పందించి డిప్యూటేషన్ రద్దు చేసి ఎంజీఎం నుంచి వెంటనే పంపించాలని, లేకుంటే దశలవారీగా ఆందోళన, పోరాటాలు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జె.సు ధాకర్, ప్రేమలత, రాజ సులోచన, కోమల, అనిత, పద్మ, కవిత, సంధ్య, నాజియా, రాణి, గౌసియా, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ టెండర్‌లో గోల్‌మాల్‌పై ఆరా

హనుమకొండ టౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఐదేళ్లకోసారి నిర్వహించే దుకాణాల టెండర్లలో అవకతవకలు జరిగాయని 'ఆర్టీసీ టెండర్లలో గోల్‌మాల్' అనే కథనం సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురించగా ఆర్టీసీ ఎం.డి. సజ్జనార్ స్పందించారు. టెండర్ నిర్వహణలో లోపాలపై ప్రత్యేక అధికారితో దర్యాప్తు చేసినట్లు కొందరు అధికారులు తెలిపారు. గతంలో టెండర్ వేసి డిజిటల్ కీపోయిందని, మళ్లీ టెండర్ వేసి ఎక్కువ టెండర్ వేసిన వారిని తొలగించి అక్రమాలు జరిగినట్లు పత్రికలో రావడంతో టెండర్ పత్రాలను పరిశీలించి అధికారుల పనితీరుపై దర్యాప్తు చేసినట్లు తెలిపారు. టెండర్ ప్రక్రియలో పారదర్శకంగా నిబంధనలు పాటించని అధికారులపై విచారణ జరుపుతున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.

విలేకరిని దూషించిన వ్యక్తిపై కేసు

హసన్‌పర్తి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో విలేకరికి ఫోన్ చేసి దూషించిన వ్యక్తిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ చేరాలు తెలిపారు. 'ఆంధ్రజ్యోతి' హసన్‌పర్తి మండల విలేకరిగా పనిచేస్తున్న కె.సంజీవ్‌కు ఇదే గ్రామానికి చెందిన ఆరెపల్లి పవన్ ఈ నెల 16న రాత్రి 9.30 గంటల సమయంలో ఫోన్ చేశాడు. ఎమ్మార్పీఎస్ తరఫున తాము తహసీల్దారు కార్యాలయం వద్ద కార్యక్రమం చేస్తే పేరు రాయలేదంటూ దూషణలకు దిగాడు. దీంతో బాధితుడి ఫిర్యాదు మేరకు ఫోన్ రికార్డ్ ఆధారంగా పవన్‌పై 351(2), 292, 355 బీఎన్ఎస్ సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

అంగట్లో సరుకులా లేబర్ కార్డులు

- అర్హులకు అవగాహన లేమి
- లబ్ధి పొందుతున్న అనర్హులు
- కార్మిక సంక్షేమ నిధులు దళారుల పాలు

బాలసముద్రం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అసంఘటిత రంగ కార్మికులు రోజంతా రెక్కాడితే గాని డొక్కాడని జీవితాలు వారివి. చేతి నిండా పనిదొరికితే గాని కడుపునిండదు. ప్రతిరోజూ ఉదయం అడ్డాల వద్ద పనుల కోసం ఆశగా ఎదురు చూస్తుంటారు. పనులు దొరకకపోతే నిరాశగా ఇంటికి వెళ్లి పస్తులుండే పరిస్థితి. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం తెలంగాణ భవన, ఇతర నిర్మాణ రంగ కార్మిక సంక్షేమ మండలి వారి కోసం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. ఈ ప్రయోజనాలను అందిపుచ్చుకోవాలంటే కార్మికుడిగా రిజిస్ట్రేషన్ చేయించుకుని లేబర్ కార్డు తీసుకోవాలి. అప్పుడే వారికి అనేక ప్రయోజనాలు చేకూరుతాయి.

కార్డుకు ఎవరు అర్హులు..

కార్మికులు లేబర్ కార్డు పొందాలంటే 18 నుంచి 60 ఏళ్ల వయసు లోపు వారై ఉండాలి. తాపీ మేస్త్రి, హెల్పర్, సెంట్రింగ్ వర్కర్, పెయింటర్, ఎలక్ట్రీషియన్, ప్లంబర్, స్టోన్ కట్టర్, ఇటుకల తయారీ తదితర 54 రంగాల నిర్మాణ కార్మికులు కార్డును పొందవచ్చు. సంవత్సర కాలంలో సుమారు 90 రోజుల పాటు ఏదైనా నిర్మాణ రంగంలో పనిచేసి ఉండాలి.

ఎలా నమోదు చేసుకోవాలి

కార్మికుడి పాస్ ఫొటో, ఆధార్, రేషన్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్, పని వివరాలు దరఖాస్తు ఫారంలో నింపి రుసుముగా రూ. 110 చెల్లించి కార్మిక శాఖ కార్యాలయంలో సమర్పించాలి. దరఖాస్తును అధికారులు పరిశీలించి అర్హతను నిర్ధారించి కార్డును జారీ చేస్తారు. ఈ కార్డు 5 సంవత్సరాల వరకు అమలులో ఉంటుంది. ఆ తర్వాత రెన్యూవల్ చేసుకోవాల్సి ఉంటుంది.

ప్రయోజనాలు ఇవి..

కార్డు కలిగిఉన్న కార్మికుడి కుటుంబంలోని అమ్మాయి పెళ్లికి రూ. 30 వేలు, కార్మికుడు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ. 6 లక్షలు, అంగవైకల్యం ఏర్పడితే వైకల్యాన్ని బట్టి రూ. 5 లక్షల వరకు, సాధారణ మరణానికి రూ. లక్ష, దహన సంస్కారాలకు రూ. 30 వేలు, ప్రమాదవశాత్తు గాయపడి అనారోగ్యం పాలై పనిచేయలేని పరిస్థితిలో ఉంటే నెలకు రూ. 4,500 చొప్పున అందజేస్తారు.

> **నకిలీ క్లెయిమ్‌లను తిరస్కరిస్తున్నాం..**
>
> 
>
> కొంత మంది మధ్యవర్తులు, దళారులు నకిలీ డాక్యుమెంట్లతో అనర్హులకు లేబర్ కార్డు ఇప్పించేందుకు దరఖాస్తులు సమర్పిస్తున్నారు. అధికారులను బెదిరింపులకు గురి చేసి బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడుతూ లొంగని అధికారులపై మీడియా ద్వారా దుష్ప్రచారం చేస్తున్నారు. కార్మికులు మధ్యవర్తులు, దళారుల మాటలు నమ్మకుండా ప్రభుత్వ నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసుకోవాలి. ఒకవేళ అధికారుల కళ్లు కప్పి మోసం చేసి కార్డును పొందినా క్లెయిమ్ వచ్చినప్పుడు విచారణ జరిపి తిరస్కరిస్తున్నాం.
>
> \- కార్మిక శాఖ ఉప కమిషనర్ వినీత



వక్రమార్గంలో కార్డు పొందుతున్న అనర్హులు

నామమాత్రపు రుసుముతో కార్మికుడిగా నమోదు చేసుకుని లేబర్ కార్డు తీసుకుంటే కుటుంబ భద్రత కోసం లక్షలాది రూపాయలు పొందే అవకాశం ఉంటుందని తెలిసిన సంపన్నులు కూడా లేబర్ కార్డును వక్రమార్గంలో పొందుతున్నారు. దీన్ని ఆసరాగా చేసుకొని అనేక మంది దళారులు రంగ ప్రవేశం చేసి అధికారులను మభ్యపెట్టి వారికి కార్డులు ఇప్పిస్తూ డబ్బులు దండుకుంటున్నారు. కార్మిక నాయకులుగా చలామణి అవుతున్న కొందరు నిత్యం అదే పనిలో నిమగ్నమై అనర్హులకు కూడా లేబర్‌కార్డులను ఇప్పిస్తున్నారు. లేబర్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న వ్యక్తు లు నిబంధనల ప్రకారంగా అర్హులా ? కాదా ? అని నిర్ధారించేందుకు విచారణ జరపడానికి అధికారులు, సిబ్బంది కొరత కారణంగా సరైన రీతి లో విచారణ జరపకుండా కార్డులను జారీ చేస్తున్నారు. కార్లు మెయిం టెన్ చేస్తున్నవారు కూడా లేబర్ కార్డు కలిగి ఉన్నారు. దీంతో అన ర్హులకు కార్మిక సంక్షేమ ఫలాలు అందుతున్నాయి.

హనుమకొండ జిల్లాలో ఇప్పటి వరకు సుమారు 2,04,877 మంది కార్మికులుగా నమోదు కాగా అందులో 1,08,786 మంది పురుషులు, 96,063 మంది మహిళా కార్మికులు ఉన్నారు.

16 నుంచి కేయూ ఎంటెక్ రెండో సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్ సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ ఎంటెక్ రెండో సెమిస్టర్ పరీక్షలు అక్టోబరు 16 నుంచి నిర్వహిస్తామని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎమ్డీ అసీం ఇక్బాల్‌లుగా మంగళవారం తెలిపారు. అక్టోబరు 16, 18, 22, 24, 27, 29, తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు.

15 నుంచి కేయూ బీటెక్ పరీక్షలు..

కేయూ పరిధిలోని అన్ని బ్రాంచీల ఇంజనీరింగ్ మొదటి సెమిస్టర్ పరీక్షలను అక్టోబరు 15 నుంచి నిర్వహిస్తామని కేయూ పరీక్షల నియంత్రణాధికారులు ప్రకటించారు. అక్టోబరు 15, 18, 21, 23, , 27 30, నవంబరు 3వ తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు. ఇతర వివరాల కోసం కేయూ వెబ్‌సైట్‌లో చూడాలని కోరారు.

8 నుంచి కేయూ ఎల్‌ఎల్‌బీ పరీక్షలు

కాకతీయ యూనివర్సిటీ పరిధిలో న్యాయ శాస్త్ర కోర్సుల పరీక్షలు అక్టోబరు 8 నుంచి నిర్వహిస్తామని కేయూ పరీక్షల నియంత్రణాధికారులు మంగళవారం వెల్లడించారు. ఎల్‌ఎల్‌ఎం రెండో సెమిస్టర్ రెగ్యులర్, ఎక్స్ ఇంప్రూమెంట్ అభ్యర్థులకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. అక్టోబరు 8, 10,14, తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు.

ఎల్‌ఎల్‌బీ మూడేళ్ల మొదటి సెమిస్టర్ పరీక్షలు

ఎల్‌ఎల్‌బీ మూడేళ్ల కోర్సు మొదటి సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలు అక్టోబరు 8, 10, 14, 16,18 తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయి.

ఎల్‌ఎల్‌బీ ఐదేళ్ల మొదటి సెమిస్టర్ పరీక్షలు

అక్టోబరు 9, 13, 15, 17 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు ఎల్‌ఎల్‌బీ ఐదేళ్ల కోర్సు మొదటి సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతాయని కేయూ పరీక్షల నియంత్రణాధికారులు తెలిపారు. ఇతర వివరాలకు కేయూ వెబ్‌సైట్‌లో చూడాలని పేర్కొన్నారు.

మేడారం జాతరకు 3,800లకు పైగా ఆర్టీసీ బస్సులు

హనుమకొండ టౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వచ్చే యేడు జనవరిలో జరగబోయే మేడారం శ్రీసమ్మక్క- సారలమ్మ జాతరకు ఆర్టీసీ నుంచి సుమారుగా 3800లకు పైగా ప్రత్యేక ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్ఎం డి.విజయభాను తెలిపారు. సమ్మక్క-సారలమ్మ ఆలయ అభివృద్ధి పనులపై మంగళవారం మేడారంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమీక్షా సమావేశానికి ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఈడీ పి.సోలెమాన్, వరంగల్ రీజినల్ మేనేజర్ డి.విజయభాను, డిప్యూటీ ఆర్ఎంలు భానుకిరణ్, మహేష్, హనుమకొండ డీఎం ధరంసింగ్‌లు హాజరయ్యారు. జాతరకు ఎక్కువ మంది భక్తులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేసేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆర్ఎం తెలిపారు. సురక్షితమైన ప్రయాణం కోసం ప్రయాణికులకు ఇబ్బందులు కలుగకుండా ఇప్పటి నుంచే ప్రణాళిక చేస్తున్నట్లు వెల్లడించారు.

నేడు ఉమ్మడి జిల్లా స్థాయి వూషు క్రీడా ఎంపికలు

వరంగల్ స్పోర్ట్స్, సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్‌ఐ) ఆధ్వర్యంలో బుధవారం హనుమకొండ కాపువాడలోని లాలీ డాల్స్ హైస్కూల్ క్రీడా మైదానంలో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి వూషు క్రీడా ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వి. ప్రశాంత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-17, 19 బాలబాలికల విభాగంలో నిర్వహించనున్న ఈ ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు తమ జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, ఎస్ఎస్‌సీ మెమో వెంట తీసుకొని ఉదయం 9గంటలకు లాలీ డాల్స్ హైస్కూల్ క్రీడా మైదానంలో రిపోర్టు చేయాలని ఆయన ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్ 9866450592, 9849760799 నెంబర్లలో సంప్రదించాలని ప్రశాంత్‌కుమార్ కోరారు.



యూరియా కోసం పడిగాపులు

చెన్నారావుపేట, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని జల్లి గ్రామంలోని రైతులు యూరియా కోసం అర్ధరాత్రి 2 గంటల నుంచే మన గ్రోమార్ సెంటర్ వద్ద పడిగాల్పులు కాశారు. గ్రామంలోని రైతులకు సరిపడా యూరియా లేక పోవడంతో, వేసిన పంటలను కాపాడుకోవడానికి నానా పాట్లు పడుతున్నారు. మంగళవారం మన గ్రోమార్ సెంటర్‌కు 450 బస్తాలు రాగా, యూరియా కోసం ఎక్కువగా రైతులు రావడంతో ఇబ్బందులు పడ్డారు. దీంతో అధికారులు రైతుకు ఒక్క బస్తా చొప్పున యూరియాను అందించారు. బస్తాలు అందని రైతులు వెనుదిగిరి వెళ్లారు. రైతులకు సరిపడా యూరియాను అందిం చాలని కొర్ర మోహన్ డిమాండ్ చేశారు. కాగా ఎస్సై రాజేష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎలాంటి గొడవలు కాకుండా బందోబస్తు నిర్వహించారు.

← జల్లిలో ఉదయం నుంచే క్యూలైన్‌లో ఉన్న రైతులు

దేవీ నవరాత్రి ఉత్సవ కమిటీలు జాగ్రత్తలు పాటించాలి

● వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్

వరంగల్ క్రైం, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): దేవీ నవరాత్రి ఉత్సవ కమిటీలు తగు జాగ్రత్తలను పాటించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ సూచించారు. దుర్గా మాత విగ్రహాలు ఏర్పాటు చేసే ప్రదేశాలతో పాటు మహిళలు బతుకమ్మ ఆడే ప్రాంతాలలో పోలీస్‌శాఖ భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ పెట్రోలింగ్ నిర్వహిస్తుందన్నారు. ఉత్సవాలు సజావుగా సాగేందుకు పోలీసుశాఖకు సహకరించాలన్నారు. అగ్నిప్రమాదాలతో పాటు ఇతర అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు తగిన ముందస్తు ఏర్పాట్లను చేసుకోవాలన్నారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. దుర్గామాత విగ్రహాలకు జియో ట్యాగింగ్ చేయాలని అధికారులకు సూచించనట్లు సీపీ తెలిపారు.

కాశిబుగ్గ దసరా ఉత్సవాలు రద్దు

ఉత్సవ సమితి అధ్యక్షుడు దూపం సంపత్ వెల్లడి

వరంగల్‌సిటీ, సెప్టెంబరు23 (ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాలను 37 సంవత్సరాలుగా నిర్విరామంగా, వైభవంగా నిర్వహించామని, ఈసారి స్థలం విషయంలో ఇబ్బందులు ఏర్పడుతున్నందున దసరా, రావణవధ ఉత్సవాలను నిర్వహించలేకపోతున్నామని ఉత్సవ సమితి అధ్యక్షుడు దూపం సంపత్ ప్రకటించారు. ఇప్పటివరకు ఓ-సిటీ సీతారామాంజనేయస్వామి దేవాలయం ఆవరణ, ఓ-సిటీ వాటర్ ట్యాంక్, కుడా స్టేడియం, చిన్న వడ్డేపల్లి చెరువు సమీపంలో నిర్వహిస్తూ వచ్చామని తెలిపారు. కాగా, ఈసారి చిన్నవడ్డేపల్లి చెరువు ప్రాంతంలో దసరా ఉత్సవాలను నిర్వహించే విషయంలో స్థల వివాదం తలెత్తడంతో ఎవరినీ ఇబ్బందిపెట్టడం ఇష్టంలేక ఉత్సవాలను రద్దుచేస్తున్నామని తెలిపారు. గతంలో నిర్వహించిన ఉత్సవాలకు సంబంధించిన ఖర్చుల వివరాలను వచ్చే నెల 12వ తేదీన వెల్లడిస్తామని తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

మైనారిటీ పథకాలకు దరఖాస్తుల ఆహ్వానం

వడ్డెపల్లి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 'రేవంతన్న సహారా మిస్కీనో కే లియే' పథకానికి అర్హులైన మైనారిటీలు దరఖాస్తు చేసుకోవాలని హనుమకొండ జిల్లా మైనారిటీల సంక్షేమ అధికారి గౌస్ హైదర్ తెలిపారు. ఇందిరమ్మ మైనారిటీ మహిళా యువజనం ద్వారా వితంతువులు, ఒంటరి, అనాథ మహిళలకు ఆసరా కల్పించేందుకు రూ.50వేల ఆర్థిక సాయంతో పాటు చిరు వ్యాపారాలకు ప్రోత్సాహకం అందిస్తామని పేర్కొన్నారు. మైనారిటీ లబ్ధిదారులకు మోపెడ్లు, ఈ-బైక్‌లు ఒకేసారి రూ. లక్ష గ్రాంటు మంజూరు చేస్తామని తెలిపారు. అక్టోబరు 6 వరకు అర్హులైన మైనారిటీలు ట్ఖురుట్బ్రీ.ఛిజజౌ౮.జీఠ ద్వారా దరఖాస్తులను సమర్పించాలని పేర్కొన్నారు. వివరాలకు 9701179328సెల్ నంబర్‌లో సంప్రదించాలని గౌస్ హైదర్ కోరారు.

ఉపాధి శిక్షణ కోసం దరఖాస్తులకు ఆహ్వానం

మడికొండ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మడికొండలోని దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం (మహిళా ప్రాంగణం)లో ఉచిత ఉపాధి శిక్షణ కోసం గ్రామీణ, పట్టణ ప్రాంత మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రాంగణం జిల్లా మేనేజర్ (డీఎం) పి.జయశ్రీ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చదువు మానేసిన 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సు కలిగి, 8వ తరగతి ఉత్తీర్ణులైన మహిళలు టైలరింగ్ కోర్సుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే 10వ తరగతి ఉత్తీర్ణులైన వారు కంప్యూటర్, కమ్యూనిటీ హెల్త్‌వర్కర్ కోర్సుకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని తెలిపారు. రెండునెలల పాటు శిక్షణ ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్నవారు ఎసెస్సీ మెమో, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, 4పాస్ ఫొటోలతో అక్టోబరు, 6 లోగా దరఖాస్తు చేసుకోవాలని డీఎం కోరారు. మరిన్ని వివరాలకు 7660022525, 7660022526 నెంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

ముంబైలో మెరిసిన హనుమకొండ విద్యార్థిని

హనుమకొండ కలెక్టరేట్, సెప్టెంబర్23(ఆంధ్రజ్యోతి): ముంబైలోని నీతూ అంబానీ జూనియర్ స్కూల్‌లో నిర్వహించిన నేషనల్ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలో హనుమకొండకు చెందిన పి.వైష్ణవిరావు అనే విద్యార్థిని కాంస్యపతకం సాధించింది. అండర్-17 విభాగం (15నుంచి 17ఏళ్లు) 49నుంచి 52కిలోల బరువు కేటగిరీలో వైష్ణవిరావు పోటీపడి అద్భుత ప్రతిభను కనబరిచి జాతీయస్థాయి పోటీల్లో 3వ స్థానాన్ని దక్కించుకున్నారు. వైష్ణవిరావు హైదరాబాద్‌లోని ఇండస్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో 11వ తరగతి చదువుతోంది. కాంస్య పతకం సాధించిన వైష్ణవిరావును వరంగల్ జిల్లా మేదరి మహేంద్ర సంఘం అధ్యక్షుడు, తెలంగాణ మేదరి మహేంద్ర సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రతాపగిరి గోవర్ధన్ అభినందించారు. భవిష్యత్‌లో వైష్ణవి మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

నాగేంద్రుడికి అఖండ ఏకనామ యజ్ఞం



మల్లెపూల అలంకరణలో నాగేంద్రుడు

గీసుగొండ, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊకల్‌లో గల ప్రసిద్ధ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో నాగేంద్రుడికి అఖండ యజ్ఞం, ఏకనామ సుబ్రహ్మణ్య నామస్మరణ యజ్ఞాన్ని మంగళవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దేవీనవరాత్రుల సందర్భంగా స్వామివారిని మల్లెపూలతో అందంగా అలంకరించి అభిషేకాలు నిర్వహించారు. స్వామి మాలధారణ దీక్షాపరులు 24 గంటలపాటు స్వామివారి నామస్మరణలు చేశారు. ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మహబూబాద్ ఏసీపీ మోహన్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు సముద్రాల సుదర్శనాచార్యులు, శ్రీహర్షాచార్యులు, ఆలయ కమిటీ చైర్మన్ మాచినపల్లి బాబురావు, రాజేందర్, రమేష్ పాల్గొన్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు (రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
పత్తి	7370	5300
మక్కలు	1501	1521
కందులు	4663	3022
పెసళ్లు	5322	3022
పల్లికాయ (సూక)	6500	3500
పల్లికాయ (పచ్చిది)	4550	2400
పసుపు (కాడి)	7560	7889
పసుపు (గోల)	7160	8996
తేజ మిర్చి	12500	9500
తేజ ఏసీ	-	-
వండర్‌హాట్	-	-
వండర్‌హాట్ ఏసీ	15000	12000
యూఎస్341ఏసీ	14200	9000
దీపిక	-	-
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6000	4000

\- వరంగల్ వ్యవసాయం

ఇల్లు అమ్ముతామని మోసం

నిందితురాలికి రిమాండ్, పరారీలో ఇద్దరు

శాయంపేట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇల్లు అమ్ముతామని నమ్మబలికిన ముగ్గురు బయానా పేరుతో ఓ వ్యక్తి వద్ద రూ.లక్షలు కాజేసిన ఘటన మండల కేంద్రంలో జరిగింది. ఎస్సై జక్కుల పరమేశ్వర్ కథనం ప్రకారం.. మండల కేంద్రంలో ఒకే కుటుంబానికి చెందిన మామిడి సదాశివ, సదానందం, శ్రీదేవి శాయంపేటలో ఉన్న ఇల్లు రూ.41లక్షలకు అమ్ముతామని అదే గ్రామానికి చెందిన బాల్నె తిలక్‌బాబును నమ్మించారు. వారికి తిలక్‌బాబు బయానాగా రూ.15లక్షలు పెద్ద మనుషుల సమక్షంలో ఇచ్చాడు. మిగతా మొత్తం రిజిస్ట్రేషన్ సమయంలో ఇవ్వాలని ఒప్పందం కుదుర్చుకున్నారు. అనంతరం సదాశివ, సదానందం, శ్రీదేవి ఇల్లు రిజిస్ట్రేషన్ చేయకుండా, బయానా డబ్బులు తిరిగి ఇవ్వకుండా తిలక్‌బాబును ఇబ్బందులకు గురిచేశారు. ఈ బాధతోనే తిలక్‌బాబు గుండెపోటుతో మృతి చెందినా బాధిత కుటుంబానికి బయానా ఇవ్వలేదు, రిజిస్ట్రేషన్ చేయలేదు. ఈ నేపథ్యంలో తిలక్‌బాబు భార్య కవిత ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు. నెలల తరబడి పరారీలో ఉన్న ముగ్గురిలో శ్రీదేవి మంగళవారం శాయంపేటకు రావడంతో పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మిగతా ఇద్దరు సదాశివ, సదానందం పరారీలో ఉన్నట్లు ఎస్సై తెలిపారు. అలాగే మండల కేంద్రానికి చెందిన పురాణం రాజేందర్‌ను ఆన్‌లైన్‌లో పెట్టుబడి పెట్టించి, మోసం చేశారని బాధితుడి ఫిర్యాదు మేరకు ఇదే ముగ్గురిపై మరో చీటింగ్ కేసు నమోదు చేశారు.

మహిళను బెదిరించిన జేఎల్ఎంపై కేసు

వేలేరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అర్ధరాత్రి ఇంట్లో నిద్రిస్తున్న ఒంటరి మహిళను బెదిరించిన వ్యక్తిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై అజ్మీరా సురేష్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గొల్లకిష్టంపల్లి గ్రామ పంచాయతీకి శివారు బంగ్లపల్లెకు చెందిన వేముగంటి సుభద్ర ఈ నెల 21న తన తల్లి వెంకటమ్మతో కలిసి గ్రామ శివారులోని దేవాలయం వద్ద బతుకమ్మ ఆడుకుని తిరిగి తల్లితో కలిసి ఇంటికి చేరుకుంది. అర్ధరాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా వేలేరు మండల కేంద్రానికి చెందిన తాటికాయల ప్రశాంత్ (జేఎల్ఎం) సుభద్ర ఇంటికి చేరుకుని తలుపులు బలంగా కొట్టి తలుపులు తీయాలని తీయకుంటే చంపుతానని బెదిరించాడు. భయాందోళనతో సుభద్ర గట్టిగా కేకలు వేయడంతో ప్రశాంత్ అక్కడి నుంచి పారిపోయాడు. సుభద్ర ఫిర్యాదుతో ప్రశాంత్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా, సుభద్ర గతంలో భర్త నుంచి విడాకులు తీసుకుంది. కుమార్తె అనారోగ్యంతో మృతి చెందింది.



సభా వేదికపై రిమోట్ ద్వారా అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి



వడి వడిగా సాగిన సీఎం పర్యటన



అమ్మవార్లకు బంగారం తీసుకువస్తున్న సీఎం



గ్యాలరీలో ఉన్న ప్రజలతో కరచాలనం చేస్తున్న సీఎం



ఆదివాసీ సంప్రదాయ నృత్య తలపాగాతో సీఎం రేవంత్

గద్దెల పరిసరాల్లో పూజారులతో సమీక్ష సమావేశం

- ఆదివాసీ నృత్యాలతో ఘన స్వాగతం
- వనదేవతలకు ప్రత్యేక పూజలు
- 68 కిలోల ఎత్తు బంగారం సమర్పణ

ములుగు/తాడ్వాయి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి మంత్రులు పొంగులేటి శ్రీనివాస్, ధనసరి అనసూయ, కొండ సురేఖలతో కలిసి మంగళవారం పర్యటించారు. మేడారం అభివృద్ధి పనులు, సమ్మక్క సారలమ్మల గద్దెల, ప్రాంగణ పునరుద్ధరణ పనుల్లో భాగంగా ఏర్పాటు చేసిన మాస్టర్ ప్లాన్ రూపకల్పన నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు.

హైదరాబాద్ నుంచి బయల్దేరిన సీఎం రేవంత్‌రెడ్డి మధ్యాహ్నం 12.24 గంటలకు హెలీకాప్టర్ ద్వారా చేరుకున్నారు. మేడారం పరిసరాల్లోని హెలీప్యాడ్‌పై హెలీక్యాప్టర్ ల్యాండ్ అయ్యింది. 12:26 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, సీఎం ముఖ్య సలహాదారు వేం నరేందర్ రెడ్డితో కలిసి హెలీకాప్టర్ దిగారు. అక్కడి నుంచి సీఎంవో వాహనాల్లో పోలీసు కమాండ్ కంట్రోల్ రూం వద్దకు చేరుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు ముఖ్యమంత్రికి గౌరవ వందన చేశారు. అక్కడ నుంచి ఆదివాసి కళా నృత్యాలతో దేవస్థానం ప్రధాన ముఖద్వారం నుంచి వారికి పూజారులు, దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు ఘన స్వాగతం పలికారు. 12:38 గంటలకు సీఎం తులాభారం నిర్వహించారు. సీఎం 68 కేజీలు తూగారు. ఎత్తు బంగారం(బెల్లం), పట్టు వస్త్రాలు పూలు, పండ్లు పసుపు కుంకుమతో 12:39గంటలకు సమ్మక్క గద్దెను చేరుకున్నారు. సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజు గద్దెలను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొక్కులు చెల్లించుకున్నారు. గద్దెల ప్రాంగణంలో దేవాదాయ అధికారులు పూజారుల చేతుల మీదుగా సీఎంకు తల్లుల పట్టు వస్త్రాలు, ప్రసాదాలు అందించారు. అనంతరం గద్దెల పరిసరాలను పరిశీలించి మాస్టర్ ప్లాన్‌లో భాగంగా చేపట్టబోయే అభివృద్ధి పనుల వివరాలను తెలుసుకొని స్థలాలను పరిశీలించారు. అక్కడ నుంచి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పూజారుల సమావేశానికి 1:01 గంటలకు హాజరయ్యారు. సమ్మక్క సారలమ్మల దేవస్థానం అభివృద్ధిపై పూజారుల అభిప్రాయాలను సీఎం అడిగి తెలుసుకున్నారు. డిజిటల్ ఎల్‌ఈడీ స్క్రీన్‌పై దేవస్థానం ఆధునికీకరణ రూపకల్పన ప్రారంభించారు. పూర్తి డిజైన్స్‌పై ఆర్కిటెక్ రాజశేఖర్ గంట పాటు పూజారులకు వివరించారు. పర్యటనలో భాగంగా సీఎం సమ్మక్క-సారలమ్మలకు మొక్కులు చెల్లించుకున్నారు. ఈ క్రమంలో ముందుగా ఎత్తు బంగారం తులా భారం వేశారు. ఇందులో సీఎం 68 కిలోలు తూగగా ఎత్తుబంగారాన్ని తల్లులకు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

కాగా, సీఎం పర్యటనలో గద్దెల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశానికి పూర్తి స్థాయిలో పూజారులను అనుమతించలేదు. దీంతో పూజారులు అవమానంగా భావించారు. మేడారం దేవస్థానం ఆధునికీకరణ డిజైన్లను సీఎం చేతుల మీదుగా ప్రారంభించే దృశ్యాలను చూడలేక పోయామని అసంతృప్తి వ్యక్తం చేశారు. కొందరికే అవకాశం ఇచ్చి, మిగిలిన వారిని బయటకు పంపించడం బాధాకరమన్నారు.



మేడారంలోని వనదేవతల గద్దెల ప్రాంగణంలో సీఎం రేవంత్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు



మేడారంలో జరిగిన సమీక్షా సమావేశంలో సీఎం, మంత్రులు, పూజారులు

అరగంట ఆలస్యంగా ముఖ్యమంత్రి రాక

ములుగు/తాడ్వాయి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభా వేదికకు అరగంట ఆలస్యంగా చేరుకున్నారు. షెడ్యూల్ ప్రకారం మధ్యాహ్నం 1.30 గంటలకు అక్కడికి రావాల్సి ఉండగా 2 గంటలకు చేరుకున్నారు. 2.05 గంటలకు తన ప్రసంగాన్ని ప్రారంభించారు. ఉదయం 11 గంటలకు బహిరంగ సభకు వద్దకు చేరుకున్న ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తలు అప్పటి వరకు వేచి ఉన్నారు. ఈ క్రమంలో కొంత ప్రజలు ఇబ్బంది పడ్డారు. పలువురు మహిళలు వెళ్లిపోయేందుకు సిద్ధపడ్డారు. ఇది గమనించిన పోలీసులు, కాంగ్రెస్ కార్యకర్తలు మహిళలను సముదాయించి కూర్చొబెట్టారు. బహిరంగ సభ ముగిసిన అనంతరం ముఖ్యమంత్రి 2.45 గంటలకు హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యారు.

గంటల తరబడి వేచి ఉన్న భక్తులు

సీఎం పర్యటన నేపథ్యంలో భాగంగా వనదేవతల గద్దెలను భద్రతా బలగాలు తమ ఆధీనంలోకి తీసుకున్నాయి. ఈ క్రమంలో గద్దెల వద్దకు ఎవరినీ అనుమతించకపోవడంతో తల్లుల దర్శనానికి వచ్చిన భక్తులు గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. సీఎం పర్యటన ముగిసిన అనంతరమే భక్తులను అనుమతించారు.



మేడారం గద్దెల ప్రాంగణంలో జరిగిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, చిత్రంలో మంత్రులు, ఎంపీలు



సమ్మక్క గద్దెల నూతన నిర్మాణం నమూనా వ్యూ చిత్రం



సమీక్షా సమావేశంలో పాల్గొన్న ఆదివాసీ పూజారులు, నేతలు



సీఎంకు వస్త్రాలు బహూకరిస్తున్న పూజారుల సంఘం నేత జగ్గారావు



సీఎంకు ఆదివాసీ నృత్యంతో స్వాగతం పలుకుతున్న దృశ్యం

ప్రజల హృదయాల్లో నరేష్‌రెడ్డి

- చివరివరకు ప్రజాసేవలోనే తరించిన నాయకుడు ఆయన
- మాజీ ఎంపీ ఆర్.సురేందర్‌రెడ్డి, మంత్రి తుమ్మల
- పురుషోత్తమాయ గూడెంలో విగ్రహ ఆవిష్కరణ



నరేష్‌రెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

మరిపెడ రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : దివంగత నేత నూకల నరేష్‌రెడ్డిని ప్రజలు ఎన్నటికీ మరవరని మాజీ ఎంపీ రామసహాయం సురేందర్‌రెడ్డి కొనియాడారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని పురుషోత్తమాయగూడెంలోని వ్యవసాయ క్షేత్రం (ఏరువాక)లో ఏర్పాటు చేసిన నూకల నరేష్ రెడ్డి విగ్రహాన్ని మంగళవారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సంతాప సభలో సురేందర్‌రెడ్డి మాట్లాడారు. నరేష్‌రెడ్డి నాలుగు దశాబ్దాల పాటు రాజకీయాల్లో ఉన్నా ఎలాంటి పదవులు పొందలేదని పేర్కొన్నారు. 1989 నుంచి కాంగ్రెస్ పార్టీలో ఉంటూ చురుకైన పాత్ర పోషించిన నరేష్‌రెడ్డి.. డోర్నకల్ నియోజకవర్గ టికెట్ ఆశించినా, కొన్ని కారణాల వల్ల వేరే వ్యక్తికి వచ్చిందన్నారు. అయినప్పటికీ ఆయన చివరివరకు ప్రజా జీవితాన్ని కొనసాగించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నరేష్‌రెడ్డి భార్య రజనిరెడ్డి, అనిరుధ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నూకల అభినవ్‌రెడ్డి, భవ్యరెడ్డి, జిల్లా నాయకుడు వంటికొమ్ము యుగేందర్‌రెడ్డి, తెలంగాణ రెడ్డి సంఘం గౌరవ అధ్యక్షుడు గోపు జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నరేష్‌రెడ్డి చిరస్మరణీయుడు: మంత్రి తుమ్మల

బతికినంత కాలం ప్రజల కోసమే సేవ చేసిన మంచి నాయకుడు నూకల నరేష్‌రెడ్డి అని, భౌతికంగా లేకపోయినా ఈ ప్రాంత ప్రజల గుండెల్లో ఎప్పటికీ ఆయన ఉంటారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నివాళి అర్పించారు. పురుషోత్తమాయగూడెంలో నరేష్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి మాట్లాడారు. ప్రజల బాగు కోసం ఆనాడు స్నేహ యూత్ ఏర్పాటు చేసి దేశంలోనే ఓ గుర్తింపు తెచ్చిన నేత నూకల అని కొనియాడారు.

కాగా, నూకల విగ్రహానికి ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ జాటోతు రామచంద్రునాయక్, ముఖ్రా విజయ్‌బాబు, మాజీ ఎమ్మెల్యేలు డీఎస్ రెడ్యానాయక్, శంకర్‌నాయక్, మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతిరాథోడ్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, కర్నె ప్రభాకర్, ఎనుగుల రాకేష్‌రెడ్డి, పానుగోతు రాంలాల్, గంధశిరి అంబరీష, కాలం రవీందర్‌రెడ్డి, గుండగాని సుందర్‌గౌడ్ తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

నిండా ముంచిన మొక్కజొన్న పంట

- కంకిలో గింజలు లేక రైతు నిరాశ..
- ఏపుగా పెరిగినా గింజలు రాకపోవడంతో రైతుల ఆందోళన
- అన్నారం షరీఫ్ గ్రామంలో ఘటన
- రూ. 50 వేల వరకు నష్టపోయిన రైతులు



అన్నారం షరీఫ్ గ్రామంలో మొలకెత్తని కంకిని చూపెడుతున్న రైతు

పర్వతగిరి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి) : వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని అన్నారం షరీఫ్ తండాలో ముగ్గురు రైతుల మొక్కజొన్న పంట ఏపుగా పెరిగినప్పటికీ, కంకిలో గింజలు రాకపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో రైతు రూ. 50 వేల వరకు పెట్టుబడి పెట్టి పంటను కంటికి రెప్పలా కాపాడుకుంటే గింజల్లో ఎదుగుదల లేకపోవడంతో మోసపోయానని గ్రహించారు. బాధిత రైతు బానోతు యాకూబ్‌తో పాటు మరో ఇద్దరి రైతుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. అన్నారం షరీఫ్ శివారులో బానోతు యాకూబ్ మూడెకరాల భూమిలో మొక్కజొన్న పంటసాగు చేశాడు. బానోత్ సహదేవుడు రెండెకరాల్లో, మౌర్య పవన్‌సింగ్ కౌలు రైతుగా రెండెకరాలు సాగు చేస్తున్నారు.

ఈ మేరకు యాకూబ్ అనే రైతు ములుగు జిల్లా మల్లంపల్లి మండలంలోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన వారి బంధువుల సాయంతో వేంకటేశ్వర ఫర్టిలైజర్స్ షాపులో మొక్కజొన్న విత్తన ప్యాకెట్లను తెచ్చుకున్నారు. దానికి సంబంధించిన బిలుల్లను సైతం తీసుకున్నారు పంట వేసి కాపు కోసం ఎదురు చూస్తుండగా, ఎదుగుదలకు వచ్చిన కంకిలో గింజలు లేకపోవడంతో అవాక్కయ్యారు. తాము ఈ విత్తనాలను వేయడం వల్ల నష్టపోయామని ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

వనదేవతల దీవెనలతో దొరల పాలన అంతం

(5వ పేజీ తరువాయి)

సమ్మక్క సారలమ్మల దీవెనలు ఉన్నాయని, అన్నీ చక్కబడతాయని దృఢ నిశ్చయంతో వచ్చానని అన్నారు. అనుకున్న విధంగానే వాతావరణం అనుకూలించిందని ఆనందం వ్యక్తం చేశారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

అర్హులైన వారందరికీ సంక్షేమ ఫలాలు అందాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని రేవంత్‌రెడ్డి అన్నారు. సన్నబియ్యం, రేషన్ కార్డులు, రైతు భరోసా, రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్లు, దేవాలయాల అభివృద్ధి తదితర అనేక పథకాలు, కార్యక్రమాలను ప్రవేశపెట్టి సమర్థంగా అమలు చేస్తున్నామని తెలిపారు. దళిత, గిరిజన నాయకులకు మంత్రివర్గంలో ప్రాధాన్యత కల్పించి ఆయా ప్రాంతాల అభివృద్ధికి తోడ్పాటునందిస్తున్నామని అన్నారు. తనకు, మంత్రి సీతక్కకు మేడారం సమ్మక్క-సారలమ్మలు ఏలిన ప్రాంతాన్ని అభివృద్ధి చేసే అరుదైన అవకాశం దక్కిందని ఆనందాన్ని వ్యక్తం చేశారు సమ్మక్క-సారలమ్మల దేవాలయాన్ని పునర్నిర్మించే అవకాశం దక్కడం అదృష్టమన్నారు.

ఎన్ని కోట్లయినా ఖర్చు పెడతాం

మేడారం ఆలయ అభివృద్ధికి ఎన్ని కోట్లయినా ఖర్చుపెడతామని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేకున్నా మేడారం అభివృద్ధి కోసం నిధుల కొరత రానివ్వమన్నారు. అభివృద్ధి పనుల్లో ఆదివాసీలను భాగస్వాములను చేస్తామని తెలిపారు. రీసెర్చ్ స్కాలర్‌లను కలుపుకొని పని చేస్తామని అన్నారు. ఈ పనులు 100 రోజుల్లో పూర్తిచేసేందుకు సంకల్పం పెట్టుకున్నామని, పనులు వేగవంతం కావడానికి ఈ ప్రాంత ప్రజలు సహకారాన్ని అందించాలని కోరారు. అభివృద్ధి పనులు త్వరితగతిన చేపట్టేందుకు 2వేల మంది వర్కర్లతో రాత్రింబవళ్లు పనులు జరిపించాలన్నారు. ఆ పనులను ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నెలలో నాలుగుసార్లు ఇక్కడికి వచ్చి పరిశీలించాలన్నారు. సమ్మక్క'సారలమ్మల దేవాలయంతో పాటు జంపన్నవాగు, రహదారుల నిర్మాణం పూర్తి చేస్తామని అన్నారు. అయ్యప్పమాల వేస్తే ఏ విధంగా దీక్షతో ఉంటారో.. మేడారం దేవాలయం పనులు పూర్తిచేసేందుకు కూడా అంతే చిత్తశుద్ధితో ఉండాలన్నారు.

ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్, ఎంపీలు బలరాంనాయక్, కడియం కావ్య, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, గండ్ర సత్యనారాయణరావు, కేఆర్ నాగరాజు, తెల్లం వెంకటరావు, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, కలెక్టర్ దివాకర, ఎస్పీ శబరీశ్, దేవాదాయ శాఖ కమిషనర్ శైలజా రామయ్యర్, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ సంబరాలను జయప్రదం చేయాలి

వడ్డెపల్లి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నాంపల్లిలోని తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ (టీజీవో) భవన్‌లో ఈ నెల 27న టీజీవో ఆధ్వర్యంలో నిర్వహించే బతుకమ్మ సంబరాలను జయప్రదం చేయాలని జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి గౌస్ హైదర్ కోరారు. మంగళవారం హనుమకొండ కలెక్టరేట్‌లోని జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి కార్యాలయంలో టీజీవో జాతీయ మహిళా విభాగం ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గౌస్ హైదర్ మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ ప్రతీక అని అన్నారు. కార్యక్రమంలో టీజీవో జాతీయ మహిళా విభాగం అడిషినల్ చైర్ పర్సన్లు కొత్త శ్రీప్రియ, పవిత్ర, టీజీవో జిల్లా అధ్యక్షురాలు మంజుల పాల్గొన్నారు.


బతుకమ్మ సంబరాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గౌస్ హైదర్ తదితరులు


మందులు అందజేస్తున్న వైద్యులు

ఆయుర్వేద వైద్య సేవలను వినియోగించుకోవాలి

రాంనగర్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): కలుషిత ఆహార పదార్థాలకు ఆయుర్వేద వైద్యం చక్కగా పనిచేస్తుందని, అలాంటి వైద్య సేవలను ప్రజలు వినియోగించుకోవాలని ఆయుష్ ప్రాంతీయ ఉప సంచాలకులు డాక్టర్ ప్రమీలాదేవి అన్నారు. ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయుష్ వైద్య విభాగం సహకారంతో సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియషన్ ఆధ్వర్యంలో మంగళవారం సమ్మయ్యనగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్య క్రమంలో జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ అప్పయ్య, 56వ డివిజన్ కార్పొరేటర్ సిరంగి సునిల్, ధర్మసాగర్ సీనియర్ సిటీజన్ అసోసియేషన్ అధ్యక్షుడు దామెర నర్సయ్య, కార్యదర్శి తేరాల యుగేందర్, రవీందర్, లక్ష్మీనారాయణ, రజిని, వైద్యులు శోభారాణి, భానుప్రకాశ్, కొక్క, యోగాచార్యులు ప్రభు, మెడికల్ క్యాంపు ఇంచార్జీ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

మెపా జిల్లా సంయక్త కార్యదర్శిగా పల్లెబోయిన సూర్యప్రకాశ్



రాంనగర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మెపా జిల్లా సంయుక్త కార్యదర్శిగా పల్లెబోయిన సూర్యప్రకాశ్‌ను నియమించినట్లు రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు పులి దేవేందర్ తెలిపారు. మంగళవారం రాష్ట్ర ముఖ్య సలహాదారుడు పులి ప్రభాకర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొ న్నం రాజు, రాష్ట్ర కార్యదర్శి నీరటి రాజు, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పులి రాజేశ్, కార్యదర్శి కేశబోయిన కోటేశ్వర్‌రావు సమక్షంలో నియామక పత్రం అందుకోగా,ఈ సందర్భంగా ప్రతీ ఒక్కరికి సూర్యప్రకాశ్ కృతజ్ఞతలు తెలపారు.

పింగళి కళాశాల స్టూడెంట్స్‌కు రక్షణ కల్పించాలి

కేయూ క్యాంపస్ సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ వడ్డెపల్లి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల చుట్టూ పోకిరిల బెడద పెరుగుతోందని, బాలికలు కళాశాలకు వచ్చి వెళ్లే సమయాల్లో పలువురు ఇబ్బందులకు గురిచేస్తున్నారని కళాశాల అధ్యాపకులు వరంగల్ మహిళ పోలీస్‌స్టేషన్, షీటీం ఏసీపీ సదయ్యను కలిసి విన్నవించారు. ఈ మేరకు మంగళవారం ఏపీసీ సదయ్యను కలిసి కళాశాలలో పోకిరీలు అమ్మాయిలను వేధింపులకు గురిచేస్తూ కళాశాల వాతావారణాన్ని దెబ్బతీస్తున్నారని పేర్కొన్నారు. దీనిపై స్పందించిన ఏసీపీ సదయ్య దసరా పండుగ తర్వాత విద్యార్థులందరికీ భద్రత పెంచుతామని, కళాశాలలో విద్యార్థులకు కౌన్సెలింగ్ సదస్సులు నిర్వహిస్తామని హామీ ఇచ్చినట్లు కళాశాల అధ్యాపకులు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ పి.కవిత ఏసీపీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు కోలిపాక మధు, జనార్ధన్‌లు పాల్గొన్నారు.

దళిత కాలనీలపై వివక్ష

డీబీఎఫ్ జిల్లా కార్యదర్శి చుంచు నరేష్


దేవన్నపేటలో దళిత కాలనీని పరిశీలిస్తున్న చుంచు నరేష్

హసన్‌పర్తి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): దళిత కాలనీలపై వివక్ష సిగ్గుచేటని.. ప్రజా పాలన అంటే ఇదేనా? అని డీబీఎఫ్ జిల్లా కార్యదర్శి చుంచు నరేష్ ప్రశ్నించారు. గ్రేటర్ 65వ డివిజన్ పరిధి దేవన్నపేట దళిత కాలనీని మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులకు దళిత వాడల్లోని సమస్యలు కనిపించడం లేదా ? అని ప్రశ్నించారు. వెంటనే రోడ్డుపైన ఉన్న పిచ్చిమొక్కలను తొలగించి మురుగునీరు సక్రమంగా సైడ్ కాల్వల నుంచి వెళ్లేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రోడ్డుపై అడ్డుగా ఉన్న తాగునీటి గేట్ వాల్వ్‌ను తొలగించి వేరే ప్రాంతంలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు, పీఎస్ఎస్ డైరెక్టర్ చుంచు విజేందర్, న్యాయవాది బి.సారంగపాణి, డీబీఎఫ్ 65వ డివిజన్ అధ్యక్షుడు ఇసంపెల్లి కిరణ్, చుంచు సుందర్, రంజిత్, వివేక్, క్రాంతి, సంతోష్, సాయి, కాలనీవాసులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ వెల్ఫేర్ బోర్డు స్కీమ్‌లను ప్రైవేట్‌కు ఇవ్వొద్దు

హనుమకొండ కలెక్టరేట్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ వెల్ఫేర్ బోర్డు ద్వారా అందించే స్కీములను ప్రైవేట్ కంపెనీలకు ఇవ్వొద్దని కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (సీడబ్ల్యూఎఫ్ఐ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు తేలూరి ఉప్పలయ్య అన్నారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఉప్పలయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలోని భవన నిర్మాణ, కార్మిక సంక్షేమ బోర్డు ద్వారా అమలు చేసే స్కీంల విషయంలో నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పచెప్పిన నాలుగు స్కీంలకి సంబంధించిన జీవో నెంబర్12ను వెంటనే రద్దు చేయాలన్నారు. లేదంటే అక్టోబర్, నవంబర్ నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా 25లక్షల మంది భవన నిర్మాణ కార్మికులను సేకరించి రాష్ట్ర ప్రభుత్వ విధానాలను ఎండగడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఆరూరి కుమార్, బానోత్ వెంకన్న, పుల్ల అశోక్, ఆలకుంట యాకయ్య, రాధ, స్వప్న, సారంగపాణి, సుధాకర్, వరంగల్, కొమురయ్య, బ్రహ్మచారి తదితరులు పాల్గొన్నారు.

అధిక వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి

హసన్‌పర్తి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అధిక వర్షాలపై రైతులు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ ఎ.విజయభాస్కర్ సూచించారు. మండలంలోని సీతంపేటలో వరి, పత్తిలో చీడపీడల నివారణపై నిర్వహించిన రైతు శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వానకాలంలో వరి, పత్తిలో వచ్చే చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పిచికారీ చేయాల్సిన పురుగు మందులను వివరించారు. వరిలో దోమపోటు తెగులు నివారణకు యూరియా అధికంగా వాడకూడదని సకాలంలో డైనోట్ఫురాన్ పురుగు మందును ఎకరానికి 80గ్రాములను పిచికారీ చేయాలన్నారు. గులాబీ రంగు పురుగు నివారణకు పత్తిని ఏరివేసి పంటను నవంబర్ నాటికి ముగించేసి ఇతర పంటలు వేసుకోవాలని సూచించారు. అనంతరం శాస్త్రవేత్తలు బి.వి. రాజ్‌కుమార్ రైతులకు ఉద్యాన పంటలలో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యల గురించి వివరించగా డాక్టర్ ఆర్.విశ్వతేజ రైతులకు రైతు ఉత్పత్తిదారు సంఘాల ప్రాముఖ్యతను తెలియజేశారు. అనంతరం రైతుల సందేహాలను నివృత్తి చేశారు. అభ్యుదయ రైతులు ఆదిరెడ్డి, మల్లారెడ్డి, వ్యవసాయ విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

అట్టహాసంగా బతుకమ్మ సంబురాలు


న్యూసైన్స్ డిగ్రీ అండ్ పీజీ కాలేజ్‌లో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు


నర్సింగ్ స్కూల్‌లో బతుకమ్మ ఆడుతున్న దృశ్యం

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ హంటర్‌రోడ్‌లోని న్యూసైన్స్ డిగ్రీ అండ్ పీజీ కాలేజ్‌లో ముందస్తు బతుకమ్మ వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. బతుకమ్మ వేడుకలను పురస్కరించుకొని మంగళవారం కళాశాలలో బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్లు కె.రవీందర్, ఎస్.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతికి బతుకమ్మ నిదర్శనమన్నారు. విద్యార్థుల్లో తెలంగాణ సంస్కృతిపట్ల అవగాహన కల్పించేందుకు ఏటా బతుకమ్మ సంబరాలను కాలేజీలో నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా తీరొక్కపూలతో పేర్చిన బతుకమ్మలతో విద్యార్థులు ఆడిపాడారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాళ్లు ప్రొఫెసర్ సీహెచ్. రాజేశం, సీహెచ్. కమలాకర్, వైస్ ప్రిన్సిపాళ్లు డి.శ్రవణ్, డాక్టర్ వి.మధుకర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జి.నాగరాజు, పీడీ పి.రాజేష్, అధ్యాపక, అధ్యాపకేతర బృందం, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

తెలంగాణ సంస్కృతికి బతుకమ్మ ప్రతీక

బతుకమ్మ తెలంగాణ ఆడపడుచుల ఆత్మక గౌరవానికి, మన సంస్కృతికి ప్రతీక అని తెలుగు యూనివర్సిటి మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్.భక్తవత్సలరెడ్డి అన్నారు. మంగళవారం హంటర్‌రోడ్‌లోని తెలుగు యూనివర్సిటీ జానపద గిరిజన విజ్ఞాన పీఠంలో పీఠాధిపతి గడ్డం వెంకన్న ఆధ్వర్యంలో ముందస్తు బతుకమ్మ వేడులకు జరిగాయి. ఈ సందర్భంగా రెడ్డి మాట్లాడుతూ.. మన సంస్కృతీ, సంప్రదాయాలను భావితరాలకు అందించాలన్నారు. మరో మాజీ రిజిస్ట్రార్ బి.రమేష్ మాట్లాడుతూ.. విజ్ఞానపీఠం మన సంప్రదాయాలను కాపాడుకునేందుకు అనేక పరిశోధనలు చేసిందని గుర్తు చేశారు. వెంకన్న మాట్లాడుతూ... బతుకమ్మ పండుగ విశిష్టతను తెలిపేందుకు విజ్ఞాన పీఠంలో విద్యార్థులతో బతుకమ్మ సంబరాలు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు దామోదర్, సురేష్, గోపాల్ రెడ్డి, రవి, రాజు, సునిత, సిబ్బంది సతీష్, కృష్ణమోహన్, విజయలక్ష్మి, సునంద, అంజనేయులు, అశోక్, సులోచన, పరిశోధకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


గిరిజన విజ్ఞాన పీఠంలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు, సిబ్బంది

ఘనంగా ప్రారంభమైన నాటకోత్సవాలు

హనుమకొండ కల్చరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, ఎఫ్‌డీసీ సహకారంతో మూడు రోజులపాటు జరిగే పందిళ్ల శేఖర్‌బాబు స్మారక నాటకోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం అయ్యాయి. హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రం వేదికగా ప్రారంభమైన వేడుకల్లో రంగస్థల నటుడు, నాటక రంగ సమాఖ్య అధ్యక్షుడు తడకమల్ల రాంచందర్‌రావు, రాష్ట్ర నాటక సమాజాల అధ్యక్షుడు ఆకుల సదానందం, వనం లక్ష్మీకాంతరావు తదితర ప్రముఖు లు జ్యోతి వెలిగించి నాటకోత్సవాలను ప్రారంభించారు. గడిచిన మూడున్నర దశాబ్దాల నాటకరంగ చరిత్రలో పందిళ్ల శేఖర్‌బాబు స్థానం ఎంతో సుస్థిరమైందని, పద్యనాటక రంగంలో ప్రేక్షకులను మెప్పించి తనకంటూ ఒక ప్రత్యేక ముద్ర వేసుకున్నారని రాంచందర్‌రావు అన్నారు. ఆయన పేరిట నాటకోత్సవాలు నిర్వహిస్తూ తెలుగు రాష్ట్రాల నుంచి నాటక సమాజాల వారిని రప్పించి ప్రోత్సహించడం ఎంతో అభినందనీయమన్నారు. చైతన్య భారతి కరీంనగర్ వారిచే మంగళవారం ఖరీదైన జైళ్లు నాటికను మంచాల రమేశ్ దర్శకత్వంలో ప్రదర్శించారు.


నాటకోత్సవాలను జ్యోతి వెలిగించి ప్రారంభించిన ప్రముఖులు

ఈ నాటకానికి పందిళ్ల అశోక్‌కుమార్, రమేశ్‌బాబు, మహేశ్‌బాబు ప్రత్యేక పారితోషికాన్ని అందజేశారు. రెండో నాటికగా నవజ్యోతి కళామండలి జడ్చర్ల వారిచే మై రావణ పౌరాణిక నాటకాన్ని తడకమళ్ల రాంచందర్‌రావు రచన, దర్శకత్వంలో సంపంగి కృష్ణ నిర్వహణలో ప్రదర్శించారు. ఈ నాటికకు వనం లక్ష్మీకాంతారావు, ఓడపల్లి చక్రపాణి పారితోషిక దాతలుగా వ్యవహరించి అందజేశారు. అనేక మంది రంగస్థల నటులు, కళాకారులు నాటకోత్సవాల్లో తదితరులు పాల్గొన్నారు.

లోక కల్యాణార్థం మహాయాగం

రెండో రోజుకు చేరిన శరన్నవరాత్రి వేడుకలు


మహాచండి సుదర్శన హోమంలో పాల్గొన్న మహిళలు

హనుమకొండ కల్చరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో సోమవారం నుంచి వైభవంగా ప్రారంభమైన రుద్రేశ్వరీ శరన్నవరాత్రి వేడుకలు మంగళవారం రెండోరోజుకు చేరుకున్నాయి. సుప్రభాత సేవ, ఖడ్గమాల మూలమంత్రయుక్తంగా ఉపచార పూజలు అనంతరం అమ్మవారిని మంగళవారి తిథికి అనుసరించి అన్నపూర్ణదేవిగా అలంకరింపజేసి నీరాజనమంత్ర పుష్పాలు సమర్పించారు. అమ్మవారి ఎదురుగా ఏర్పాటు చేసిన యాగశాలలో లోక కల్యాణార్థం కృష్ణ యజుర్వేద పండితుడు గుడిమెల్ల విజయ కుమారాచార్య నేతృత్వంలో ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ పర్యవేక్షణలో మహాయాగం నిర్వహించారు. సీఎంఆర్ వస్త్ర సముదాయం వారు అన్న ప్రసాదం పంపిణీ చేశారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ప్రముఖ నాట్యాచారిణి తాడూరి రేణుక శిష్యబృందంచే కూచిపూడి నృత్యాలను అద్భుతంగా ప్రదర్శించారు. సోమవారం రాత్రి బాగా పొద్దుపోయిన తరువాత వరంగల్ నగరపాలక సంస్థ కమిషనర్ చాహత్ బాజ్‌పాయి, విద్యుత్ శాఖ సీఎండీ వరుణ్‌రెడ్డి దంపతులు వేయిస్తంభాల ఆలయానికి చేరుకొని అమ్మవారిని దర్శించుకున్నారు.

ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో వేద ఆశీర్వచనం నిర్వహించారు. రవీందర్‌రెడ్డి, కోన శ్రీకర్ తదితరులు సేవలందించారు. దేవాదాయ శాఖ రీజినల్ జాయింట్ కమిషనర్ మల్లెల రామకృష్ణారావు, రెడ్‌క్రాస్ రాష్ట్ర సభ్యుడు ఈవీ శ్రీనివాసరావు తదితరులు మంగళవారం అమ్మవారిని దర్శించుకున్నారు. ఈవో అనిల్ కుమార్ పర్యవేక్షించారు.

గంగపుత్రులు అన్ని రంగాల్లో రాణించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ధీటి మల్లయ్య, డోలి రాజలింగం

వడ్డెపల్లి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక, సామాజిక, రాజకీయం రంగాల్లో గంగపుత్ర (బెస్త)లు రాణించాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ధీటి మల్లయ్య అన్నారు. మంగళవారం హనుమకొండ వడ్డెపల్లి మెయిన్ రోడ్డులోని పల్లా రవీందర్‌రెడ్డి విద్యుత్ భవన్‌లో వరంగల్ జిల్లా గంగపుత్ర (బెస్త)పరస్పర సహాయక సహకార గృహ నిర్మాణ పరిమిత సంఘం సర్వసభ్య సమావేశం జిల్లా అధ్యక్షుడు డోలి రాజలింగం అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలను వినియోగించుకొని గంగపుత్రులు ఆర్థికంగా ఎదగాలన్నారు. పరిమిత సంఘం సభ్యులు సంఘ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

ఈ సందర్భంగా పరిమిత సంఘానికి డైరెక్టర్ ఎన్నికలు నిర్వహించారు. డైరెక్టర్లుగా డోలి మొగిలి, జీజుల సుగుణ, కె. సదానందం, ఎలుగు వెంకటేశ్వర్లు ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో తెలంగాణ గంగపుత్ర సంఘం నాయకులు పాత వెంకటేశ్వర్లు, డాక్టర్ ఇమ్మడి పుల్లయ్య, కోంద్ర కుమారస్వామి, కొక్కుల సరోజన, కె. అరుణ, అమిత, గోపు సూర్యనారాయణ, మైస శ్యామ్, రాంచందర్, రామ్మూర్తి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలను విస్మరించిన సీఎం

మెపా రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్


సమావేశంలో మాట్లాడుతున్న పులి దేవేందర్

వడ్డెపల్లి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ముదిరాజ్‌లను బీసీ-డీ నుంచి బీసీ-ఏ జాబితాలోకి మారుస్తానని ఇచ్చిన హామీని సీఎం రేవంత్‌రెడ్డి విస్మరించారని ముదిరాజ్ ఎంప్లాయిస్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్ మండిపడ్డారు. మంగళవారం హనుమకొండ ఎన్జీవోస్ కాలనీలోని మెపా రాష్ట్ర కార్యాలయంలో హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పులి రాజేష్ ముదిరాజ్ అధ్యక్షతన నిర్వహించిన రాష్ట్ర కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో ముదిరాజ్‌లను బీసీ-ఏలోకి మారుస్తామని ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ సమావేశంలో మెపా గౌరవ సలహాదారులు పులి ప్రభాకర్ ముదిరాజ్, రాష్ట్ర, జిల్లా నాయకులు పొన్నం రాజు, నీరటి రాజు, పులి మహేష్, కేశబోయిన కోటేశ్వర్‌రావు, ఆళ్ల నరేష్, పల్లెబోయిన సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఘటనపై అంతర్గత ఫిర్యాదుల కమిటీ విచారణ

హనుమకొండ కలెక్టరేట్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కలెక్టరేట్‌లోని ఓ సెక్షన్‌లో వెలుగులోకి వచ్చిన లైంగిక వేధింపుల ఘటనకు సంబంధించిన అంశంపై అంతర్గత ఫిర్యాదుల కమిటీ విచారణ చేసింది. ఆరోపణలు ఎదుర్కొంటున్న సీనియర్ అసిస్టెంట్‌కు అంతర్గత ఫిర్యాదుల కమిటీ సోమవారం సాయంత్రం నోటీసులు జారీ చేసింది. నోటీసులు అందుకున్న ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి, బాధితురాలు వేరు వేరు సమయాల్లో తమ వద్ద ఉన్న సాక్ష్యాలతో మంగళవారం అంతర్గత ఫిర్యాదుల కమిటీ ఎదుట హాజరై వారి వాదనలు వినిపించారు. ఈ విషయంపై అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డిని వివరణ కోరగా.. ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి, బాధితురాలిని అంతర్గత ఫిర్యాదుల కమిటీ విచారించిందని, విచారణ కమిటీ ఇచ్చిన రిపోర్టు మేరకు తదుపరి చర్యలు ఉంటాయని తెలిపారు.

డీవైఎస్‌వో అశోక్‌కుమార్‌కు సన్మానం

వరంగల్ స్పోర్ట్స్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా యువజన క్రీడల అధికారి (డీవైఎస్‌వో) గుగులోత్ అశోక్‌కుమార్‌ను డీఎస్‌ఏ కోచ్‌లు ఘనంగా సన్మానించారు. ఈ నెల 18 నుంచి 20వరకు మలేషియాలో జరిగిన అంతర్జాతీయ క్రీడా సదసుల్లో పాల్గొని తిరిగి ఇండియా చేరుకొని విధుల్లో చేరిన అశోక్‌కుమార్‌ను మంగళవారం హనుమ కొండ జేఎన్ఎస్‌లో డీఎస్ఏ కోచ్‌లు శాలువాతో సత్కరించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో వృత్తినైపుణ్య శిక్షణ కేంద్రం సూపరిండెంట్ విజయశ్రీ, జూనియర్ అసిస్టెంట్ ఓడపల్లి శ్రీనివాస్, డీఎస్ఏ కోచ్‌లు శ్రీమన్నారాయణ, నరేందర్, రాయబారపు నవీన్, కూరపాటి రమేష్, ఎం.డి. అఫ్జల్, బత్తిని జీవన్‌గౌడ్, దేవిక, పెరుమాండ్ల వెంకటేశ్వర్లు, రాజారపు రమేష్, ప్రభుదాస్, శంకర్, రాజు, డీఎస్ఏ సిబ్బంది, పలు క్రీడా సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.


అవార్డులు అందజేస్తున్న గట్టు మహేశ్‌బాబు

భిన్న రంగాల మహిళలకు వావ్ అవార్డుల ప్రదానం

హనుమకొండ కల్చరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని శ్రీహర్ష కన్వెన్షన్ సెంటర్‌లో సోమవారం రాత్రి పొద్దుపోయే వరకు జిల్లా సీనియర్ కళాకారుల సంక్షేమ మండలి ఆధ్వర్యంలో బతుకమ్మ ఉత్సవాలు, సాయిశివాని 24వ వార్షికోత్సవ వేడుకలు నేత్రపర్వంగా జరిగాయి. అనేక మంది కవులు, కళాకారులు, భిన్న రంగాల ప్రముఖులు వేడుకల్లో పాల్గొన్నారు. లయన్స్ జిల్లా గవర్నర్ చంద్రశేఖర్ ఆర్య, ఆర్యవైశ్య జాతీయ నాయకులు గట్టు మహేశ్‌బాబు, పొట్లపల్లి శ్రీనివాసరావు, రేవూరి రమణారెడ్డి, సీతాల రఘువేందర్, రోజా క్రియేషన్స్ శ్యామ్, బీజేపీ నేత రావు పద్మ, తదితర అనేక మంది అతిథులుగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో సాయిశివాని వార్షికోత్సవం సందర్భంగా మాదం పద్మజా రాణి, బాలబోయిన రమాదేవి, కుండె అరుణ, వెంపటి శ్రావణి, డాక్టర్ రాజేశ్వరి, రాఖీ కొలారియా, జడల హరిత, వేలూరి శారద, పొన్నాల సంయుక్త తదితర భిన్న రంగాల మహిళలకు వావ్ అవార్డులను ప్రదానం చేసి సత్కరించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు శిక్ష

వరంగల్ క్రైం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 13మందిని మంగళవారం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి వేణుగోపాల్ ఇద్దరికి జైలు శిక్ష విధించినట్లు హనుమకొండ ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ జి.సీతారెడ్డి తెలిపారు. మిగతా 11 మందికి రూ.10,100 జరిమానా విధించారన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేని నలుగురికి రూ.2,800, మైనర్ డ్రైవింగ్ కేసుల్లో ముగ్గురికి రూ.1500 జరిమానా విధించామన్నారు.

అక్షర సైనికురాలు



కశ్మీర్ లోయల్లో... ఎముకలు కొరికే చలిలో గస్తీ కాస్తూనే ఉపాధ్యాయురాలు కావాలనే తన లక్ష్యం కోసం గురి తప్పని సాధన కొనసాగించింది. తాజా డీఎస్సీలో మంచి ర్యాంకుతో ఎస్‌జీటీ టీచర్‌గా ఎంపికైంది. తుపాకీ పట్టిన చేత్తోనే బలపం పట్టి భావి పౌరుల్ని తయారు చేయడానికి సిద్ధమవుతోంది. చిత్తూరు జిల్లా గొడుగుమానుపల్లె గ్రామానికి చెందిన **రోజా** తన ప్రయాణం గురించి 'నవ్య'తో పంచుకుంది.



"చిన్నప్పటి నుంచి టీచర్ కావాలనే లక్ష్యంతో చదువుకున్నా. ఇంటర్, 'డైట్' శిక్షణ పెనుమూరులో, డిగ్రీ చిత్తూరులో పూర్తి చేశాను. మేము ముగ్గురం ఆడపిల్లలం. నేను చిన్నదాన్ని. మా తల్లిదండ్రులు సుబ్బలక్ష్మి, జగన్నాథరెడ్డి ఆడపిల్లలనే వివక్ష లేకుండా మమ్మల్ని చూడకుండా అన్ని విధాలా ప్రోత్సహించారు. మా తమ్ముడు బీటెక్ పూర్తి చేసి ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నాడు. పెద్ద అక్క అంగన్వాడీ వర్కర్. చిన్నక్క 2018లో టీచర్ ఉద్యోగం సాధించింది. నేను 2018 డీఎస్సీలో అక్కతో పాటు ఎంపిక అవ్వాల్సి ఉండగా, తృటిలో తప్పింది. 2018 డీఎస్సీ తర్వాత చాలా ఏళ్లు మళ్లీ నోటిఫికేషన్ పడలేదు. దీంతో 2022లో ఎస్ఎస్‌సీ జీడీ కానిస్టేబుల్ ఉద్యోగానికి దరఖాస్తు చేసి, ఎంపికయ్యాను. దేశం నలుమూలల నుంచి సుమారు 600 మంది అమ్మాయిలం పంజాబ్‌లో 11 నెలల పాటు శిక్షణ తీసుకున్నాం. ఆ తర్వాత పశ్చిమ బెంగాల్‌లో పని చేశాను. ప్రస్తుతం జమ్మూలోని 15 బెటాలియన్‌లో విధులు నిర్వహిస్తున్నాను.

12 గంటలు డ్యూటీ చేస్తూనే చదువుకున్నా...

జమ్మూలోని మా బెటాలియన్‌లో మొత్తం 1,200 మంది సైనికులు ఉండగా, 80 మంది అమ్మాయిలం. పగలు ఆరు గంటలు, రాత్రి ఆరు గంటలు డ్యూటీ చేయాలి. ప్రస్తుత ప్రభుత్వం డీఎస్సీకి నోటిఫికేషన్ ఇవ్వడంతో... పరీక్షకు ప్రిపేర్ అయ్యాను. 2022కు ముందు అవనిగడ్డలో మూడు నెలల పాటు టీచర్ ఉద్యోగానికి శిక్షణ తీసుకున్నాను. ఆ పుస్తకాలు తీసుకెళ్లి, సరిహద్దుల్లో చదువుకున్నాను. రోజూ పన్నెండు గంటల పాటు ఉద్యోగం చేస్తూ చదువుకోవడం బాగా ఇబ్బంది అనిపించేది. అయినా నా ఆశయం కోసం అన్ని విధాలా సిద్ధమయ్యాను. 'టెట్'లో 150కు 138 మార్కులు, తుది పరీక్ష అయిన డీఎస్సీ ఫలితాల్లో వందకు 83.16 మార్కులు వచ్చాయి. ఈసారి చిత్తూరు జిల్లాలో ఓసీలకు 79 మార్కులకు కటాఫ్ విధించారు. నేను ఉత్తమ ర్యాంకుతో ఎస్‌జీటీ టీచర్‌గా ఎంపికయ్యాను. ఈ విషయంలో నా ఇద్దరు అక్కలు నాకు అందించిన సహకారం మరువలేనిది. సరిహద్దుల్లో దేశం కోసం కాపలా కాస్తున్న నేను... తరగతి గదిలో అక్షర సైనికుల్ని తయారు చేయడానికి ఉపాధ్యాయ వృత్తిలోకి అడుగు పెట్టబోతున్నాను. ఏడేళ్ల కిందట ఉపాధ్యాయ పోస్టు గురి తప్పినా, ఇప్పుడు నా శ్రమ ఫలించడం ఎంతో సంతోషంగా ఉంది."

• కరీముల్లా షేక్
చిత్తూరు.

ఉక్కు మహిళ

ఐరన్‌మ్యాన్ ట్రయథ్లాన్... ప్రపంచంలో అత్యంత కఠినమైన క్రీడాంశాల్లో ఒకటైన దీనిలో పాల్గొనడం, పూర్తి చేయడం ఎందరో **అథ్లెట్ల కల**. దాన్ని రెండుసార్లు విజయవంతంగా పూర్తిచేసి... మన దేశంలో పిన్నవయస్కురాలైన మహిళా 'ఐరన్‌మ్యాన్'గా చరిత్రకెక్కింది 19 ఏళ్ళ రీనీ నోరోన్హా. వచ్చేనెలలో జరిగే 'వరల్డ్ ఛాంపియన్‌షిప్'కు అర్హత సాధించిన రీనీ... సవాళ్ళను అధిగమించడంలోనే అసలైన ఆనందం ఉందంటోంది.

"ట్రయథ్లాన్‌లో పాల్గొంటానని నేను ఎప్పుడూ అనుకోలేదు. జిమ్నాస్టిక్స్ అంటే నాకు ఆసక్తి. అయిదేళ్ళ వయసు నుంచి అదే నా లోకం. ప్రొఫెషనల్ ఆర్టిస్టిక్ జిమ్నాస్ట్‌గా మారిన తరువాత... కొత్తగా ఏదైనా ప్రయత్నించాలనే ఆలోచనతో రన్నింగ్ అభ్యాసం చేశాను. క్రమంగా ట్రయథ్లాన్ పట్ల ఆసక్తి పెరిగింది. సైక్లింగ్, స్విమ్మింగ్ కూడా మొదలుపెట్టాను. అప్పుడే శంకర్ అనే కోచ్ పరిచయమయ్యారు. ఆయన 'ఐరన్‌మ్యాన్



పోటీల గురించి చెబుతూ... వాటిలో పాల్గొనాలంటూ నన్ను ప్రోత్సహించారు. గోవాలో జరిగిన 'ఐరన్‌మ్యాన్ కిడ్స్' ఈవెంట్‌లో పాల్గొని మా గ్రూప్‌లో మొదటి స్థానంలో నిలిచాను. అది నాలో ఉత్సాహం నింపింది. దాంతో 'ఒలింపిక్-డిస్టెన్స్ ట్రయథ్లాన్'లో నా సత్తా చాటాలని నిర్ణయించుకున్నాను.

నిగ్గు తేల్చే పరీక్ష

'ఐరన్‌మ్యాన్ ట్రయథ్లాన్' అనేది చాలామందికి అంతగా పరిచయం లేని అంశం. ఇది కేవలం ఒక రేస్ కాదు. సవాళ్ళు ఎదురైనప్పుడు కలిగే మనం ఎంత వరకూ తట్టుకోగలమో నిగ్గు తేల్చే ఒక పరీక్ష. 3.8 కిలోమీటర్లు ఓపెన్ వాటర్ స్విమ్మింగ్, 180 కిలోమీటర్ల బైక్ రైడ్, 42.2 కిలోమీటర్ల మారథాన్ రన్... ఈ మూడింటి సమ్మేళనం ఈ పోటీ. నిర్ణీత సమయంలో అమన్నీ పూర్తి చేయాలి. అందుకు కేవలం శరీర దారుఢ్యం చాలదు, అపారమైన మానసిక బలం కూడా అవసరం. అదృష్టవశాత్తూ... ఎన్నో ఏళ్ళ నా జిమ్నాస్టిక్స్ నేపథ్యం ద్వారా... క్రమశిక్షణ, చురుకుదనం, నిలకడగా రాణించడం అలవాటయ్యాయి. దీర్ఘకాలిక లక్ష్యాల కోసం నిబద్ధతతో ఎలా పని చేయాలో, లోపాలను ఎలా సరిదిద్దుకోవాలో నేర్చుకున్నాను. ట్రయథ్లాన్ వైపు మళ్ళినప్పుడు ఇవన్నీ ఉపయోగపడ్డాయి. ఐరన్‌మ్యాన్ ట్రయథ్లాన్‌కు సన్నద్ధత కోసం మొత్తం మూడు విభాగాల్లో శిక్షణ కోసం వారానికి ఇరవై గంటలకు పైగా కేటాయించాను. పోషకాహారం, సరైన నిద్ర, ఫిజియోథెరపీ... ఇవన్నీ నా శరీరం దృఢంగా ఉండడానికి దోహదం చేశాయి. ఇక మానసిక ఒత్తిడిని అధిగమించడం కోసం మొదట్లో చిన్న చిన్న లక్ష్యాలను నిర్దేశించుకున్నాను. వాటిని అధిగమించడం ద్వారా ఆత్మ విశ్వాసం పెంచుకున్నాను. ధ్యానం, శ్వాస వ్యాయామాలు చేశాను. అన్నిటికన్నా ప్రధానంగా... నా కుటుంబం, కోచ్, టీమ్ సభ్యులు అండగా నిలిచి ప్రోత్సహించారు.

వారికోసం ఎన్జీవో ప్రారంభిస్తా...

న్యూజిలాండ్‌లో 2023లో తొలిసారిగా 'ఐరన్‌మ్యాన్ ట్రయథ్లాన్'లో పాల్గొన్నాను. అప్పుడు నా వయసు 18 ఏళ్ళ 49 రోజులు. మొత్తం మూడు అంశాలనూ పదిహేడు గంటలలోగా పూర్తి చేయాలి. నేను సుమారు పదహారున్నర గంటలలో ముగించాను. అది పూర్తి చేసిన అతి పిన్నవయస్కురాలైన భారతీయురాలిగా నిలిచాను. కానీ ఏదో వెలితి. 'ఇంకా వేగంగా పూర్తి చేయగలను కదా!' అనిపించింది. మరింత కఠినంగా సాధన సాగించాను. ఈ ఏడాది జులైలో జర్మనీలో జరిగిన 'ఐరన్‌మ్యాన్ ట్రయథ్లాన్'లో కేవలం పద్నాలుగు గంటల్లోనే మూడు ఈవెంట్లనూ పూర్తి చెయ్యగలిగాను. అంటే మునుపటికన్నా సుమారు రెండున్నర గంటల ముందుగానే. అందరూ నన్ను చూసి 'ఐరన్‌మ్యాన్' అని అరుస్తూ ఉంటే నా సంతోషానికి హద్దుల్లేవు. కొత్త లక్ష్యాలను నిర్దేశించుకోవడానికి, వాటిని సాధించడానికి కృషి చేయడానికి ఈ విజయం నాకు మరింత ప్రేరణ ఇచ్చింది. ప్రస్తుతం నేను చెన్నై ఐఐటీలో డేటా సైన్స్ అప్లికేషన్స్‌లో డిగ్రీ చదువుతున్నాను. అలాగే లండన్‌లోని కార్డిఫ్ కాలేజీ నుంచి స్పోర్ట్స్ సైన్స్ డిప్లమా కూడా చేస్తున్నాను. చదువును, ట్రయథ్లాన్ శిక్షణను బ్యాలెన్స్ చేసుకోవడం కష్టమే. దీనికి నా కుటుంబం ఎంతో సహకరిస్తోంది.

ప్రతి ఖండంలోనూ 'ఐరన్‌మ్యాన్ ట్రయథ్లాన్' పూర్తి చేయాలనుకుంటున్నాను. ఈ ఏడాది అక్టోబర్‌లో అమెరికాలో జరిగే 'ఐరన్‌మ్యాన్ వరల్డ్ ఛాంపియన్‌షిప్'కు అర్హత సాధించాను. దానికి ప్రస్తుతం సిద్ధమవుతున్నాను. వనరులు అందుబాటులో లేకపోవడం వల్ల క్రీడలకు దూరమవుతున్న యువ అథ్లెట్లకు, ముఖ్యంగా బాలికలకు సాయపడడం కోసం ఒక ఎన్జీవో ప్రారంభించాలనేది నా ఆశయం."

ఫ్యాషన్



నవరత్నాల్లో వజ్రాలదే పైచేయి అనుకుంటాం. కానీ ఇది ఒకప్పటి మాట. నేడు ప్రముఖులందరూ పచ్చలకే పెద్ద పీట వేస్తున్నారు. **నీతా అంబానీ** మొదలు ప్రముఖ బాలీవుడ్ తారలెంతోమంది పసందైన పచ్చల నెక్లెస్‌ల మీదే మనసు పడిపోతున్నారు. వాటి మీద ఓ లుక్కేద్దాం!

పసందైన పచ్చలు

అనంత్ అంబానీ, రాధా మర్చంట్‌ల ప్రి వెడ్డింగ్ వేడుకలకు హాజరైన నీతా అంబానీ, విలాసవంతమైన పచ్చల నెక్లెస్ ధరించారు. వీటికి జోడీగా వజ్రాల ఇయర్ రింగ్స్, వజ్రాలు, పచ్చలతో తయారైన గాజులు ధరించారామె. పచ్చలు, వజ్రాలు పొదిగిన ఆ నెక్లెస్ అక్షరాలా 500 కోట్ల విలువ ఉంటుందని ఒక అంచనా! ఈ సందర్భంలోనే కాదు, పలు సందర్భాల్లో నీతా అంబానీ పచ్చల నగలకే ప్రాధాన్యం ఇచ్చారు. ప్రియాంకా చోప్రా, ఇషా అంబానీలు కూడా పలు సందర్భాల్లో పచ్చల్లో మెరిసిపోయారు.



జాతిరాళ్లను జోడించి...

పాతకాలపు ఆభరణాల శైలిని ఇష్టపడేవారి కోసం, పచ్చల విక్టోరియన్ పెండెంట్స్ కూడా ఇప్పుడు తయారవుతున్నాయి. అలాగే స్టేట్‌మెంట్ జ్యువెలరీని ఇష్టపడేవారి కోసం పన్నా స్టోన్ ఆభరణాలు రూపొందుతున్నాయి. వీటిలో భాగంగా అతి పెద్ద పచ్చతో తయారయ్యే ఉంగరాలు లేదా బ్రేస్‌లెట్స్ రూపొందుతున్నాయి. అలాగే తాజాగా పచ్చలకు గోమేధికాలు, పగడాలు మొదలైన ఇతర జాతిరాళ్లను జత చేసి ఆభరణాలను రూపొందిస్తున్నారు. వినూత్నంగా కనిపించాలనుకునేవాళ్లు ఇలాంటి నగలను ఎంచుకోవచ్చు.

భిన్నమైన సెట్టింగ్స్‌తో...

భిన్నమైన శైలుల్లో తయారయ్యే ఆభరణాల్లో పచ్చల వినియోగం బాగా పెరిగింది. ఆధునికత ఉట్టిపడే బేజెల్ సెట్టింగ్స్‌లో, సంప్రదాయం ఉట్టిపడే ప్రాంగ్ సెట్టింగ్‌లో పచ్చల ఆభరణాలు రూపొందుతున్నాయి. హుందాతనాన్ని, ఆధునికత కలగలసిన సంప్రదాయాన్నీ నగలకు జోడించాలనుకుంటే వాటిలో పచ్చలు పొదిగి ఉండేలా చూసుకోవాలి.

వీరికి మట్టితో పనిలేదు

వినూత్నం

మొక్కల మీద మక్కువ కలిగిన ఇద్దరు మహిళలు, పందిరి సేద్యంతో ఆకుకూరలను విస్తారంగా పండిస్తూ అందరి దృష్టినీ ఆకట్టుకుంటున్నారు. హైడ్రోపోనిక్ పద్ధతిలో ఇసుక, కంకర, నీళ్లను ఉపయోగిస్తూ గ్రీన్‌కోపియా ఫామ్స్‌ను స్థాపించే స్థాయికి ఎదిగిన, కేరళకు చెందిన **అశ్వంతి, జిషాల** ఆసక్తికరమైన ప్రస్థానం గురించి తెలుసుకుందాం!

స్నేహితులైన అశ్వంతి, జిష.. ఎర్నాకులంలో సివిల్ సర్వీస్ కోచింగ్ సెంటర్‌ను నడిపిస్తున్నారు. విజయవంతంగా సాగుతున్న కోచింగ్ సెంటర్, కొవిడ్ సమయంలో మూతపడడంతో వాళ్లిద్దరూ ఆన్‌లైన్ తరగతులకే పరిమితం కావలసి వచ్చింది. ఆ తరగతులు సంతృప్తిని ఇవ్వలేకపోవడంతో, కొత్తగా ఏదైనా వ్యాపారంలోకి ప్రవేశించాలని వాళ్లిద్దరూ భావించారు. "కొత్త ప్రాజెక్ట్ అనగానే మాకు వ్యవసాయమే గుర్తొచ్చింది. నిజానికి వ్యవసాయం సులభతరమైన ఆదాయ మార్గం కాదు. కానీ దానికి ఆధునిక కోణాన్ని జోడించి, సాంకేతికతను ఆవిష్కరించి, దానికి తగ్గట్టు నడుచుకోగలిగితే కచ్చితంగా విజయం సాధించవచ్చు. ఈ ఆలోచనతో మేమిద్దరం వ్యవసాయాన్ని ఎంచుకున్నాం" అంటూ చెప్పుకొస్తున్నారు బీటెక్ చదివిన అశ్వంతి, సోషల్ వర్క్‌లో మాస్టర్స్ చేసిన జిష. ఆ క్రమంలో మట్టితో పని లేకుండా కేవలం కంకర, ఇసుక, నీళ్లను ఉపయోగించి సాగు చేసే హైడ్రోపోనిక్ వ్యవసాయ విధానాన్ని ఎంచుకున్నారు. మొక్కల పెంపకం కోసం ఒక చిన్న స్థలాన్ని లీజుకు తీసుకుని, గ్రీన్‌కోపియా ఫామ్స్‌ను స్థాపించి, దాన్లో లెట్యూస్, కేల్, సెలరీ లాంటి మూలికా మొక్కలు, మైక్రోగ్రీన్స్.. ఇలా ఏకంగా 15 రకాల ఆకుకూర మొక్కలను సాగు చేయడం మొదలుపెట్టారు.

పురుగుమందులు వాడని పంటలు

చేస్తున్నది తొలి వ్యాపారం. కాబట్టి ఆచితూచి అడుగులు వేయాలని నిర్ణయించుకున్న అశ్వంతి, జిషలు మొక్కల కోసం ఎంచుకునే విత్తనాల పట్ల కూడా ఎన్నో జాగ్రత్తలు పాటించారు. అధునాతన హైడ్రోపోనిక్ పరిశోధనకు కేంద్రమైన ఇజ్రాయెల్ నుంచి విత్తనాలు సేకరించారు. ఆ విత్తనాలు మొలకెత్తే సమయం కూడా భిన్నంగా ఉంటుంది. లెట్యూస్ విత్తనాలు రెండు రోజులకే మొలకెత్తితే, సెలరీ విత్తనాలు మొలకెత్తడానికి రెండు వారాల సమయం పడుతుంది. మొలకెత్తిన తర్వాత, వాటి వేర్లను బలపరచడం కోసం పోషకాలను అందించారు. విదేశీ పంటల మార్కెట్ విలువ ఎంతో ఎక్కువగా ఉంటుంది. పంటలన్నీ నాలుగు నుంచి ఆరు వారాల్లోగా చేతికందుతాయి. ఆ తర్వాత, ప్రతి వారం వాటిని కోసుకుని, విక్రయించుకోవచ్చు. పైగా ఒక్కొక్క బెడ్ నుంచి 15 కిలోల పంట చేతికందుతూ ఉండడంతో ఆ స్నేహితులిద్దరి



ఆనందానికి అవధులే లేకుండా పోయాయి. "ఊటీ, మున్నార్, బెంగుళూరుల నుంచి లెట్యూస్ కొచ్చికి చేరుకుంటూ ఉంటుంది. కిలో వంద రూపాయల ధర పలికే ఈ లెట్యూస్‌ల పెంపకంలో పురుగుమందులను భారీగా ఉపయోగిస్తారు. అయినా హోటళ్లు, రెస్టారెంట్లకు వాటిని కొనడం తప్ప వేరే ప్రత్యామ్నాయం ఉండదు. నిజానికి బహిరంగ ప్రదేశాల్లో చీడపీడలు లేకుండా ఈ మొక్కలను పెంచడం చాలా కష్టం. అయినా మేం ఆ బెడద లేకుండా ఎన్నో జాగ్రత్తలు పాటించి, పురుగుమందులు ఉపయోగించని లెట్యూస్‌ను పెంచగలిగాం. దాంతో మా లెట్యూస్‌కు గిరాకీ పెరిగింది. నేరుగా కొనుక్కునేవాళ్లు మా లెట్యూస్‌ను కిలోకు 450 రూపాయలు చెల్లిస్తున్నారు. రెస్టారెంట్లు కిలోకు 390 రూపాయలు చెల్లిస్తున్నాయి. అలాగే రకరకాల లెట్యూస్‌లకు, మూలికలు, మైక్రోగ్రీన్స్‌ను జోడించిన రెడీ టు ఈట్ సలాడ్స్ మా ఫామ్స్‌లో విపరీతంగా అమ్ముడవుతూ ఉంటాయి. పురుగుమందుల వాడకానికి మేం దూరంగా ఉండడమే, మా ఉత్పత్తులకు గిరాకీ పెరగడానికి ప్రధాన కారణం" అంటూ తమ ఉత్పత్తుల విజయ రహస్యాన్ని వివరించారు అశ్వంతి, జిష.

నీటి ద్వారా పోషకాలను అందిస్తూ...

హైడ్రోపోనిక్ ఫార్మింగ్ ప్రత్యేకత, ప్రయోజనాల గురించి వివరిస్తూ... "సంప్రదాయ సేద్యంతో రైతులు ఒకే ప్రదేశానికి పరిమితమైపోతూ ఉంటారు. వాతావరణ మార్పులు, రుతువులు, తెగుళ్ల.. ఇలా పంట దిగుబడి పలు అంశాల మీద ఆధారపడి ఉంటుంది. ఒకే ఒక్క పొరపాటు రైతు శ్రమనంతటినీ తుడిచిపెట్టేస్తుంది. కానీ హైడ్రోపోనిక్స్‌కు ఈ బెడద ఉండదు. మొక్కలు మట్టికి బదులుగా నీటిలో పెరుగుతాయి. దాంతో మొక్కలకు పోషకాలు నేరుగా అందుతాయి. అవే నీటికి మేం పదే పదే పోషకాలు జోడించి వాడుకుంటూ ఉంటాం. కాబట్టి మొక్కలన్నీ ఆరోగ్యంగా ఎదుగుతాయి" అంటూ వివరించిన ఈ స్నేహితురాళ్లు హైడ్రోపోనిక్ ఫామింగ్‌ను సుస్థిరమైన, ప్రయోజనకరమైన వ్యవసాయంగా విస్తరించడాన్నే లక్ష్యంగా పెట్టుకున్నారు.



నేడు నానే బియ్యం బతుకమ్మ

వేడుక

బతుకమ్మ సంబరాల్లో నాలుగో రోజైన ఆశ్వయుజ శుద్ధ తదియనాడు (బుధవారం) నానబోసిన బియ్యాన్ని గౌరమ్మకు ప్రధానంగా నివేదిస్తారు. కాబట్టి 'నానే బియ్యం బతుకమ్మ' అని పిలుస్తారు. తంగేడు, గునుగు తదితర పూలను నాలుగు ఎత్తుల్లో పేర్చి, గౌరమ్మను వాటిపై పెడతారు.

నైవేద్యం: నానవేసిన బియ్యం, పాలు, బెల్లం కలిపిన వంటకాలు

దుర్గా నవరాత్రులు

నేటి అలంకారం
శ్రీ అన్నపూర్ణాదేవి
ఆశ్వయుజ శుద్ధ తదియ, బుధవారం

శరన్నవరాత్రి మహోత్సవాల్లో మూడో రోజున శ్రీ అన్నపూర్ణాదేవిగా విజయవాడ శ్రీ కనకదుర్గమ్మ దర్శనమిస్తారు. శ్రీ అన్నపూర్ణాదేవి అన్నాన్ని ప్రసాదించే మాతృమూర్తి. అన్నం పరబ్రహ్మ స్వరూపం. అన్నం సర్వజీవనాధారం. అన్నం లేనిదే జీవులకు మనుగడ లేదు. అన్నపూర్ణాదేవి సాక్షాత్తూ శివ స్వరూపిణి, ఈశ్వరుడికి భిక్షపెట్టిన దేవత. ఈ తల్లిని ధ్యానిస్తే ధన, ధాన్య వృద్ధి, మధుర భాషణం, ఐశ్వర్య సిద్ధి కలుగుతాయని పెద్దలు చెబుతారు. అన్నపూర్ణాదేవి ధరించిన రసపాత్ర అక్షయ శుభాలను అందిస్తుందంటారు. ఆమెను కుంకుమతో పూజించాలి. జ్ఞానభిక్ష పెట్టాలని, వైరాగ్యం కలగజేయాలని కోరుకోవాలి. నిత్యాన్నదానేశ్వరి అలంకారంలో ఉన్న దుర్గమ్మను దర్శించిన వారికి మేధాశక్తి కలుగుతుందని భక్తుల నమ్మిక.



నైవేద్యం: కట్టె పొంగలి, పరమాన్నం
అలంకరించే చీర రంగు: ఎరుపు
అర్చించే పూల రంగు: తెలుపు
పారాయణ చెయ్యాల్సినవి:
అన్నపూర్ణాష్టకం, స్తోత్రాలు

పిల్లలకు ఇవి తినిపిస్తే..

పెరిగే పిల్లలకు పోషకాహారం తినిపించడం అత్యవసరం. శారీరక, మానసిక ఎదుగుదలతోపాటు పిల్లల్లో జ్ఞాపకశక్తిని పెంచే ఆహారం గురించి తెలుసుకుందాం...

- పాలకూర, తోటకూర, బచ్చలి కూరల్లో మెదడు కణాలను వృద్ధి చేసే విటమిన్లు, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్లు, ఫోలేట్లు అధికంగా ఉంటాయి. ఈ ఆకుకూరలను తరచూ తినిపిస్తూ ఉంటే పిల్లల్లో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతాయి.
- బ్లూ బెర్రీ, స్ట్రాబెర్రీ, క్రాన్ బెర్రీ, యాపిల్ పండ్లను తినిపిస్తే పిల్లల్లో మెదడు పనితీరు వేగవంతమవుతుంది. చదివిన అంశాలన్నింటినీ పిల్లలు చక్కగా గుర్తుపెట్టుకోగలుగుతారు.
- బాదం, వాల్‌నట్స్ పిస్తా, పొద్దు తిరుగుడు గింజలు, గుమ్మడి గింజలను తినిపిస్తే వాటిలో ఉండే ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ లాంటి ఆవశ్యక పోషకాలు జ్ఞాపకశక్తి పెరగడానికి దోహదం చేస్తాయి. రోజుకు ఒక కోడిగుడ్డు తినిపించినా ఫలితం ఉంటుంది.
- రాజ్మా, పల్లీలు, శనగల్లో ప్రోటీన్లు, పీచు పదార్థాలు, జింక్ ఎక్కువగా ఉంటాయి. వీటిని ఆహారంలో చేర్చడం వల్ల పిల్లలకు గుర్తుపెట్టుకునే సామర్థ్యం పెరుగుతుంది.
- పాలు, పెరుగు, యోగర్ట్, చీజ్ లాంటి పాల ఉత్పత్తుల్లో 'బి' విటమిన్ రకాలు ఎన్నో ఉంటాయి. ఇవి మెదడు ఆరోగ్యంగా ఎదిగేందుకు తోడ్పడతాయి. దీంతో పిల్లల్లో జ్ఞాపకశక్తి బలపడుతుంది. పిల్లలకు తరచూ డార్క్ చాక్లెట్ తినిపించినా మంచి ప్రయోజనం కనిపిస్తుంది.





ఘనంగా జాతీయ అవార్డుల ప్రదానోత్సవం


దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారంతో మోహన్‌లాల్




ఉత్తమ నటుడి అవార్డును సంయుక్తంగా అందుకుంటున్న షారుక్ ఖాన్, విక్రాంత్ మస్సే

'సినిమా అనేది కేవలం వినోదం అందించే సాధనం మాత్రమే కాదు. దేశాభివృద్ధికి, సామాజిక చైతన్యానికి బాటలు వేసే మాధ్యమం' అని అన్నారు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము. దేశ చలనచిత్ర రంగంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన దాదాసాహెబ్ ఫాల్కే అవార్డును మంగళవారం న్యూ ఢిల్లీలోని విజ్ఞాన్‌భవన్‌లో మలయాళ నటుడు మోహన్‌లాల్‌కు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రదానం చేశారు. మోహన్‌లాల్‌ను 'కంప్లీట్ యాక్టర్' అని కొనియాడారు. ఇదే వేదికపై 2023వ సంవత్సరానికి గాను కేంద్రం ప్రకటించిన 71వ జాతీయ చలనచిత్ర అవార్డులను విజేతలకు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'భారతీయ చిత్ర పరిశ్రమ అన్ని విధాలా దూసుకుపోవడం హర్షించదగ్గ విషయం. కేవలం ప్రజాదరణ విషయంలోనే కాకుండా యువతరాన్ని ఆకట్టుకోవడంలోనూ సినిమా ముందుంటోంది. ఈ రోజు అవార్డులు అందుకొన్న చిత్రాల్లో పలు సందేశాత్మక చిత్రాలు ఉండడం ప్రశంసనీయం. మహిళా ప్రాధాన్యం ఉన్న సినిమాలకు గుర్తింపు దక్కడం సంతోషాన్ని ఇస్తోంది' అని పేర్కొన్నారు. జాతీయ ఉత్తమ నటుడి అవార్డును షారుక్‌ఖాన్(జవాన్), విక్రాంత్ మస్సే(ట్వల్త్ ఫెయిల్), జాతీయ ఉత్తమ నటి అవార్డును రాణీ ముఖర్జీ(మిసెస్ చటర్జీ వర్సెస్ నార్వే)కి రాష్ట్రపతి ముర్ము అందజేశారు. జాతీయ ఉత్తమ చలనచిత్రంగా 'ట్వల్త్ ఫెయిల్' సినిమా అవార్డు దక్కించుకుంది. నందమూరి బాలకృష్ణ హీరోగా తెరకెక్కిన 'భగవంత్ కేసరి' ఉత్తమ తెలుగు చిత్రంగా ఎంపిక కాగా ఆ సినిమా దర్శకుడు అనిల్ రావిపూడి, నిర్మాత సాహు గారపాటి అవార్డును అందుకున్నారు. బలగం సినిమాలో 'ఊరు పల్లెటూరు' పాటకు కాసర్ల శ్యామ్ ఉత్తమ గేయ రచయిత అవార్డును అందుకున్నారు. సాయి రాజేశ్ (ఉత్తమ స్క్రీన్‌ప్లే- బేబీ సినిమా), పీవీఎన్ఎస్ రోహిత్(ఉత్తమ నేపథ్య గాయకుడు- బేబీ సినిమా), ఉత్తమ యానిమేషన్ విజువల్ ఎఫెక్ట్స్ కేటగిరీలో 'హను-మాన్' చిత్రానికి గానూ దర్శకుడు ప్రశాంత్ వర్మ, నిర్మాత నిరంజన్‌రెడ్డి, యానిమేటర్, వీఎఫ్ఎక్స్ సూపర్‌వైజర్ వెంకట్‌కుమార్ జెట్టీ అవార్డు అందుకున్నారు. యూ పృథ్వీ, కణ్ణన్ నందురాజ్(సంయుక్తంగా) (బెస్ట్ యాక్షన్ డైరక్షన్, హను-మాన్ సినిమా), దర్శకుడు సుకుమార్ తనయురాలు సుకృతి వేణి(ఉత్తమ బాలనటి- గాంధీతాత చెట్టు) అవార్డులను అందుకున్నారు.


ఉత్తమ నటి అవార్డుతో రాణీ ముఖర్జీ


ఉత్తమ గేయ రచయిత కాసర్ల శ్యామ్


రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి అవార్డులు అందుకుంటున్న అనిల్ రావిపూడి, ప్రశాంత్ వర్మ, సాహు గారపాటి, సుకృతి వేణి

సొగసు చూడ తరమా...!

సిద్ధు జొన్నలగడ్డ, రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి ప్రధాన పాత్రధారులుగా నీరజ కోన దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'తెలుసు కదా'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బేనర్‌పై టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. దీపావళి పండగ సందర్భంగా అక్టోబరు 17న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఇటీవలె విడుదలైన టీజర్‌కు మంచి స్పందన లభించింది. తాజాగా 'సొగసు చూడతరమా...' అంటూ సాగే పాటను స్టార్ హీరోయిన్ నయనతార ఆవిష్కరించారు. కృష్ణకాంత్ రాసిన గీతానికి తమన్ అద్భుతమైన స్వరాలు సమకూర్చగా, కార్తీక్ ఆలపించారు. అమ్మాయిల పట్ల కథానాయకుడి భావోద్వేగాలను ఈ పాట చక్కగా ప్రతిబింబిస్తోంది.



ఘనవిజయం సాధించాలి

– అల్లరి నరేశ్



రవిప్రకాశ్, శివకుమార్, చరిష్మా శేఖర్ ప్రధాన పాత్రధారులుగా వీఎస్‌వీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'విద్రోహి'. ఈ క్రైమ్ థ్రిల్లర్‌ను విజ్జన వెంకటసుబ్రహ్మణ్యం నిర్మిస్తున్నారు. తాజాగా చిత్రం ట్రైలర్‌ను అల్లరి నరేశ్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ట్రైలర్ చాలా బాగుంది. సినిమాపై అంచనాలు పెంచేసింది. చిత్రం ఘనవిజయం సాధించాలని కోరుకుంటున్నాను' అని అన్నారు. 'ఇప్పటివరకూ రాని సరికొత్త అంశాన్ని ఈ చిత్రంలో చూపిస్తున్నాం' అని వీఎస్‌వీ తెలిపారు. ఈ చిత్రానికి ఎడిటర్: ఉపేంద్ర, ఎంఎస్ఆర్, డీఓపీ: సతీశ్ ముత్యాల, సంగీతం: భీమ్స్ సిసిరోలియో.



తల్లి కాబోతున్న కత్రినా



బాలీవుడ్ స్టార్ కపుల్ కత్రినా కైఫ్, విక్కీ కౌశల్ జంట శుభవార్త చెప్పింది. తాము తల్లితండ్రులవ్వబోతున్నట్లు సోషల్ మీడియా ద్వారా తెలిపారు. కత్రినా బేబీ బంప్‌తో ఉన్న ఫొటోను ఈ సందర్భంగా ఆ దంపతులు తమ అభిమానులతో పంచుకున్నారు. మా జీవితంలో సరికొత్త, గొప్ప అధ్యాయాన్ని ప్రారంభించబోతున్నాము అని పేర్కొన్నారు. అభిమానులు, పలువురు సినీ ప్రముఖులు కత్రినా, విక్కీ కౌశల్‌కు శుభాకాంక్షలు తెలిపారు. 2021లో వీరిద్దరూ ప్రేమవివాహం చేసుకున్నారు.

మల్టిప్లెక్స్ టిక్కెట్ ధరలపై హైకోర్టు స్టే

కర్నాటక రాష్ట్రంలోని అన్ని సినిమా హాల్స్‌లో టిక్కెట్ ధర ఫ్లాట్ రూ.200 ఉండేలా ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలపై హైకోర్టు స్టే విధించింది. ప్రభుత్వం నిర్ణయించిన టిక్కెట్ ధర భారీ బడ్జెట్ సినిమాలకు గిట్టుబాటు కాదని మల్టిప్లెక్స్‌లు, హొంబళె ఫిలిమ్స్ సంస్థ హైకోర్టును ఆశ్రయించాయి. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ రవి హొసమని నేతృత్వంలోని హైకోర్టు ధర్మాసనం మంగళవారం విచారించి, మధ్యంతరంగా స్టే విధించింది. రాష్ట్రంలో ఇతర భాషల సినిమాల ప్రభావం అధికమైందని, టిక్కెట్ ధర ఏకరూపంగా ఉండాలని దశాబ్దాలకాలంగా పోరాటం సాగుతోంది. ఈ సమస్యపై పలుమార్లు చర్చలు, సమావేశాలు జరిగాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం టిక్కెట్ ధరను రూ.200గా నిర్ణయించింది. దీన్ని కొందరు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. పిటిషన్‌పై విచారణ కొనసాగుతుందని హైకోర్టు తెలిపింది.

బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

బ్యాంకాక్‌లో తొలి షెడ్యూల్



ఇమ్రాన్‌హష్మీ, శ్రియా శరణ్ జంటగా నటించిన 'ఆవారాపన్' చిత్రానికి కొనసాగింపుగా 18 ఏళ్ల తర్వాత రెండో భాగం తెరకెక్కుతోంది. 'ఆవారాపన్ 2' టైటిల్‌తో వస్తోన్న ఈ చిత్రంలో ఇమ్రాన్ హష్మీ కథానాయకుడిగా కనిపించనున్నారు. ఆయనకు జోడీగా దిశాపటానీ నటిస్తున్నారు. ఈ వారాంతంలో ఈ చిత్రం తొలి షెడ్యూల్ బ్యాంకాక్‌లో మొదలవనుందని యూనిట్ తెలిపింది. నెల రోజుల పాటు సాగే ఈ షెడ్యూల్‌లో సాంగ్‌తో పాటు కీలక సన్నివేశాలను తెరకెక్కించనున్నారు. ఆ తర్వాత ముంబై షెడ్యూల్‌తో చిత్రీకరణ పూర్తి చేసి, వచ్చే ఏడాది ఏప్రిల్ 3న 'ఆవారాపన్ 2'ను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు తెలిపింది.

ప్రేమికుని భావోద్వేగం



ప్రదీప్ రంగనాథన్, మమిత బైజు జంటగా తెరకెక్కుతున్న చిత్రం 'డ్యూడ్'. కీర్తిశ్వరన్ దర్శకత్వంలో నవీన్ యెర్నేని, యలమంచలి రవిశంకర్ నిర్మిస్తున్నారు. శరత్‌కుమార్ కీలక పాత్ర పోషించారు. తాజాగా ఈ సినిమా నుంచి సెకండ్ సింగల్ 'బాగుండు పో' అనే పాటను విడుదల చేశారు మేకర్స్. ప్రేమించిన అమ్మాయి అభిప్రాయాన్ని గౌరవిస్తూ హీరో తన ప్రేమ తాలూకూ భావాలను వ్యక్తపరిచేలా ఉన్న ఈ పాట ప్రస్తుతం ఆకట్టుకుంటోంది. రామజోగయ్య శాస్త్రి రాసిన ఈ పాటను సంజిత్, సాయి అభ్యంకర్ పాడారు. సాయి అభ్యంకర్ సంగీతం అందించారు. అక్టోబరు 17న పాన్‌ఇండియా స్థాయిలో విడుదలవుతోందీ చిత్రం.

జీఎస్టీ తగ్గింపు లాభం.. దుకాణదారులకేనా?

(మొదటిపేజీ తరువాయి)

నిత్యావసరాలపై కేంద్రం జీఎస్టీ తగ్గించింది. 18శాతం, 12శాతం పన్ను కింద ఉండే చాలా ఉత్పత్తులు 5శాతం పన్ను పరిధిలోకి వచ్చాయి. దీనితో దసరా, దీపావళి పండుగల ముందు సరుకుల ధరలు తగ్గుతాయని ప్రజలంతా ఆశించారు. కానీ వ్యాపారులు తగ్గిన ధరల ప్రయోజనాన్ని వినియోగదారులకు బదలాయించడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా పేరున్న సూపర్ మార్కెట్లు, ప్రముఖ వ్యాపార సంస్థలు, చిన్నపాటి సూపర్ బజార్లలో ధరల తగ్గింపు కనిపించడం లేదు.


21, 22వ తేదీల్లో కొన్న ఒకే రకం షాంపూ డబ్బాల ధరల్లో కనిపించని మార్పు

మార్గదర్శకాలను పట్టించుకునేదెవరు?

జీఎస్టీ శ్లాబుల్లో మార్పు నేపథ్యంలో.. పాత స్టాక్ మీద ముద్రించి ఉన్న గరిష్ఠ చిల్లర ధర (ఎమ్మార్పీ)ను మార్చి, కొత్త ధరలతో స్టిక్కర్ వేసేలా కేంద్రం వెసులుబాటు ఇచ్చింది. ఈ మేరకు సెప్టెంబరు 9వ తేదీనే మార్గదర్శకాలను జారీ చేసింది. కానీ తయారీ సంస్థలు, విక్రయించే వ్యాపార సంస్థలు వాటిని పాటించడం లేదు. ఉదాహరణకు ఒక సూపర్ మార్కెట్లో పరిశీలిస్తే.. సెప్టెంబరు 12న ప్యాకింగ్ చేసిన ప్రియ వంటనూనె ప్యాకెట్‌పై రూ.205 ఎమ్మార్పీ ముద్రించి ఉంది. తగ్గిన పన్ను మేరకు దానిపై తగ్గిన ధరతో స్టిక్కర్ వేయాల్సి ఉన్నా సూపర్ మార్కెట్ నిర్వాహకులు అలాగే విక్రయిస్తున్నారు. అలాగే సఫోలా గోల్డ్ వంటనూనె (5 లీటర్ల క్యాన్)మీద ఎమ్మార్పీ ధర రూ.1,182 ముద్రించి ఉంది. దానిపై మారిన జీఎస్టీ ప్రకారం స్టిక్కర్ వేయలేదు. మరోవైపు టాటా సింప్లీ బెటర్ గ్రౌండ్‌నట్ కోల్డ్ ప్రెస్డ్ నూనె 5 లీటర్ల క్యాన్‌ను సెప్టెంబరు 9న ఈ-కామర్స్ వేదిక జెప్టో రూ.1,483కు విక్రయించిందని.. అదే క్యాన్‌ను సెప్టెంబరు 23న 1,775 ధర పెట్టడం చూసి ఆశ్చర్యపోయామని కొనుగోలుదారులు చెబుతున్నారు.ఎప్పుడైనా ధరలు పెరిగితే రాత్రికి రాత్రి స్టిక్కర్లు వేసి అధిక ధరలకు అమ్ముతారని.. ఇప్పుడు మాత్రం తగ్గించుకుండా దోచుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. పన్ను తగ్గింపు ప్రయోజనాలు వినియోగదారుడికి చేరకపోతే ప్రభుత్వ ఉద్దేశం ఎలా నెరవేరుతుందని ప్రశ్నిస్తున్నారు.

ఎన్ఏపీఏ అథారిటీ ఉన్నట్టా లేనట్టా?

వ్యాపార సంస్థలు పన్నుల్లో తేడాలను అక్రమంగా సొమ్ము చేసుకోకుండా.. జీఎస్టీ కౌన్సిల్ కింద 'నేషనల్ యాంటీ ప్రాఫిటరింగ్ అథారిటీ (ఎన్ఏపీఏ)' అనే సంస్థ పనిచేస్తుంది. అవసరమైతే నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమానాలు విధిస్తుంది. కానీ ఇప్పుడు ఆ అథారిటీ ప్రభావం కనిపించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ధరలు తగ్గించని వ్యాపారులపై ఫిర్యాదు కోసం సరైన వేదికను అందుబాటులోకి తేలేదని వినియోగదారులు వాపోతున్నారు. జీఎస్టీ తగ్గినా ధరలు తగ్గడం లేదంటూ సామాజిక మాధ్యమాల్లో కొంత మంది ట్యాగ్ చేస్తున్నారు. ప్రతి వస్తువు మీద పాత, కొత్త ధరలు స్పష్టంగా కనిపించేలా ఏర్పాటు చేసి విక్రయించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకోవాలని కోరుతున్నారు.

స్వర్ణం.. సరికొత్త గరిష్ఠం!

(మొదటి పేజీ తరువాయి)



మార్కెట్లో బంగారం, వెండి ధరలు మరింత పెరగడంతో పాటు హెచ్-1 బీ వీసా ఫీజు పెంపు, విదేశీ సంస్థాగత పెట్టుబడుల (ఎఫ్‌పీఐ) ఉపసంహరణ ఫలితంగా రూపాయి ఆల్‌టైం కనిష్ఠానికి పతనమవడం కూడా ఇందుకు కారణమని విశ్లేషకులు చెబుతున్నారు. గత ఏడాది డిసెంబరు 31న రూ.78,950 పలికిన తులం బంగారం ధర.. ఈ ఏడాదిలో ఇప్పటివరకు రూ.39,950 (50.60%) మేర పెరిగింది. అదేసమయంలో రూ.89,700గా ఉన్న కిలో వెండి ధర.. ఈ ఏడాది ఇప్పటికే 49,900 (55.63%) మేర పెరిగిపోయింది. హైదరాబాద్ మార్కెట్లో 10 గ్రాముల బంగారం రూ.1,750 పెరిగి రూ.1,14,330కి చేరింది. కేజీ వెండి రూ.1,000 పెరిగి రూ.1,49,000కి చేరింది. విజయవాడ మార్కెట్లో 10 గ్రాముల పసిడి రూ.1,17,900, కేజీ వెండి రూ.1.39,000కు చేరుకుంది. అంతర్జాతీయ మార్కెట్లోనూ పసిడి ధర సరికొత్త పతాక స్థాయికి చేరింది. ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం ఒక దశలో 0.95 శాతం పెరుగుదలతో 3,811 డాలర్లకు చేరుకుంది. సిల్వర్ 44.57 డాలర్ల వద్ద ట్రేడైంది. అమెరికా సెంట్రల్ బ్యాంక్ ఫెడరల్ రిజర్వ్ ప్రామాణిక వడ్డీ రేట్లను మరో రెండు సార్లు తగ్గించవచ్చన్న అంచనాలు ఇందుకు కారణమని విశ్లేషకులు పేర్కొన్నారు. ఫెడ్ రేట్లు మరింత తగ్గితే అమెరికా డాలర్, బాండ్లపై ప్రతిఫలాలు తగ్గుతాయన్న ముందు జాగ్రత్తతో మదుపరులు తమ పెట్టుబడులను విలువైన లోహాల్లోకి మళ్లిస్తున్నారు. ఫలితంగా బంగారం, వెండి ధరలు రోజుకో కొత్త శిఖరాన్ని అధిరోహిస్తున్నాయి.

జీఎస్టీ తగ్గించలేదా.. డయల్ 1915

» లేదా 88000 01915కి వాట్సాప్ చెయ్యండి.. కేంద్రం ప్రత్యేక నెంబర్లు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 23: జీఎస్టీ సంస్కరణలు అమలులోకి వచ్చిన నేపథ్యంలో తగ్గిన ధరల మేరకే వినియోగదారులకు వస్తుసేవలు లభిస్తున్నాయా? లేదా అనే అంశంపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందుకు సంబంధించి వినియోగదారుల నుంచి ఫిర్యాదుల స్వీకరణకు 1915 అనే టోల్ ఫ్రీ నెంబర్, 88000 01915 వాట్సాప్ నెంబర్లను మంగళవారం అందుబాటులోకి తెచ్చింది. తగ్గిన ధరల మేరకు వ్యాపారులు వస్తువులను విక్రయించకుంటే వినియోగదారులు టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి లేదా నిర్దేశిత వాట్సాప్ నెంబర్‌కు మెసేజ్ చేసి తమ ఫిర్యాదులు చేయవచ్చని సూచించింది. ఈ మేరకు సెంట్రల్‌బోర్డ్ ఆఫ్ ఇన్‌డైరెక్ట్ ట్యాక్సెస్ అండ్ కస్టమ్స్(సీబీఐసీ) ఓ ప్రకటన చేసింది. అలాగే, తమ ఇంటిగ్రేటెడ్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ మెకానిజమ్(ఐఎన్‌జీఆర్ఏఎం) పోర్టల్ ద్వారా కూడా వినియోగదారులు తమ ఫిర్యాదులు చేయవచ్చునని పేర్కొంది. మరోపక్క, ఈ-కామర్స్ సంస్థలు తగ్గిన ధరల మేరకే వినియోగదారులకు సరుకులను అందిస్తున్నాయా? లేదా? అన్నదానిపై కూడా కేంద్రం దృష్టి పెట్టింది. ఇక, ప్రజలు అధికంగా వినియోగించే 54 రకాల ఉత్పత్తుల ధరల్లో వచ్చిన మార్పులపై ప్రతి నెలా సీబీఐసీకి నివేదిక సమర్పించాలని జీఎస్టీ అధికారులను ఈ నెల9వ తేదీనే కేంద్ర ఆర్థిక శాఖ ఆదేశించింది. ఈ మేరకు తొలి నివేదికను సెప్టెంబరు 30వ తేదీలోపు సమర్పించాల్సి ఉంది. ఈ 54 రకాల ఉత్పత్తుల్లో వెన్న, షాంపూ, టూత్‌పేస్ట్, ఐస్‌క్రీమ్, ఏసీ, టీవీ, గ్లూకోమీటర్, సిమెంట్ ఉన్నాయి.

స్థానిక పోరులో రిజర్వేషన్ల ఖరారు!

(మొదటిపేజీ తరువాయి)

రిజర్వేషన్లు, తాజాగా లెక్కగట్టిన రిజర్వేషన్ల వివరాలను జాగ్రత్తగా పరిశీలన చేయనుంది. అనంతరం ఆ వివరాలతో కూడిన సమగ్ర నివేదికను ప్రభుత్వానికి అందించనుంది. ఆ తర్వాత రాష్ట్రంలోని బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం చొప్పున రిజర్వేషన్లను కేటాయిస్తున్నట్టు తెలుపుతూ అందుకు అనుగుణంగా ప్రభుత్వం ప్రత్యేక ఉత్తర్వులను విడుదల చేయనున్నట్లు సమాచారం. ఆ తర్వాత రాష్ట్రంలో ఖరారైన రిజర్వేషన్ల స్థానాలు, ప్రత్యేక జీవోను కలిపి ఎన్నికల సంఘానికి ఇచ్చి, రాష్ట్రంలో స్థానిక ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నామని తెలుపుతూ లేఖ రాయనున్నట్టు తెలిసింది. ప్రభుత్వం పేర్కొన్న వివరాలను పరిశీలించిన తర్వాత ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసే అవకాశం ఉన్నట్టు అధికారిక వర్గాల ద్వారా తెలుస్తోంది. మొత్తంగా దసరాలోపే స్థానిక సమరానికి షెడ్యూల్ రానున్నట్టు పరిస్థితుల దృష్ట్యా స్పష్టమవుతోంది.

మహిళలకు కేటాయింపు జరగలేదు

రిజర్వేషన్ల వ్యవహారం పూర్తికాగా.. ఇందులో మహిళలకు 50% మేరకు కేటాయింపు జరగలేదని విశ్వసనీయంగా తెలిసింది. రాజకీయ పార్టీల సమక్షంలోనే డ్రా విధానంలో మహిళలకు సీట్లను కేటాయించాలనే ఉద్దేశంతోనే ప్రస్తుతం మహిళలకు రిజర్వేషన్లను కేటాయించలేదని తెలిసింది. దీనిపై జిల్లాల నుంచి అన్ని నివేదికలు అందిన తర్వాత పంచాయితీరాజ్ శాఖ ప్రభుత్వానికి అందించబోయే సమగ్ర నివేదికలో ఒక స్పష్టత వస్తుందని కూడా చెబుతున్నారు.

ప్రాథమికంగా రిజర్వేషన్ల కేటాయింపు ఇలా

రిజర్వేషన్ల ఖరారు కోసం బీసీలకు 2024 కుల సర్వే ప్రకారం, ఎస్సీ, ఎస్టీలకు 2011 జనాభా లెక్కల ప్రకారం లెక్కగట్టారు. దీని ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం



2024లో నిర్వహించిన కులసర్వేలో బీసీలు (ముస్లింలతో కలిపి) 56.33శాతంగా ఉన్నారు. ఎస్సీలు 17.43, ఎస్టీలు 10.45శాతంగా ఉన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారమైతే ఎస్సీలు 15.45, ఎస్టీలు 9.08శాతంగా ఉన్నారు. గతంతో పోల్చితే ఎస్సీ, ఎస్టీల జనాభాలో స్వల్ప మార్పు ఉన్నది. ప్రస్తుతం జిల్లాల్లో పూర్తయిన రిజర్వేషన్ల ప్రాథమిక వివరాల ప్రకారం 42శాతంగా లెక్కగట్టిన తర్వాత బీసీలకు ఎంత మేర సీట్లు కేటాయింపు జరిగిందనేది తేలింది. దాని ప్రకారం 12,760 గ్రామపంచాయతీల్లో దాదాపు 5,360 స్థానాలు, 1,12,534వార్డులకుగాను సుమారు 47,264 స్థానాలు బీసీలకు దక్కే అవకాశం కనబడుతోంది. ఇక 5,765 ఎంపీటీసీల్లో దాదాపు 2,421 స్థానాలు, 565 ఎంపీపీ, జడ్పీటీసీలకు సుమారు 237 చొప్పున కేటాయింపు జరగనున్నాయి. 31 జడ్పీ చైర్‌పర్సన్ స్థానాల్లో బీసీలకు దాదాపు 13వరకు స్థానాలు దక్కొచ్చునని అధికారికవర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఇవిపోనూ మిగిలిన స్థానాల్లో జనరల్, మహిళలకు కేటాయింపులు చేయనున్నారు. ఎస్సీ, ఎస్టీలున్న గ్రామాల్లో 100% వారికే కేటాయించనున్నారు. పూర్తినివేదికలు ప్రభుత్వానికి అందాక, ఎస్సీ, ఎస్టీలు, జనరల్ స్థానాలతో పాటు బీసీలకు ఎన్ని స్థానాలు దక్కుతాయనేదానిపై స్పష్టతరానుంది.

న్యాయపరంగా జీవో నిలబడుతుందా..?

బీసీలకు స్థానిక సంస్థలు, విద్య, ఉపాధి రంగాల్లో 42% రిజర్వేషన్లను కేటాయిస్తూ ప్రభుత్వం అసెంబ్లీలో బిల్లులు ఆమోదించింది. వాటి షెడ్యూల్ 9లో చేర్చాలని కోరుతూ కేంద్రాన్ని కోరుతోంది. కానీ ఆ బిల్లులపై కేంద్రం ఎటూ తేల్చడంలేదు. పైగా స్థానిక సంస్థలలో అన్ని సామాజికవర్గాలకు కలిపి రిజర్వేషన్లు 50% మించకూడదన్న సుప్రీంతీర్పు ఉంది. ఒకవేళ ఆ పరిధి దాటాలంటే అందుకు ప్రత్యేక కారణాలు ఉండాలని, వాటిని తేల్చేందుకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటుచేయాలని మరో కేసులో సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. దాని ప్రకారమే రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణలో కులసర్వే నిర్వహించింది. అనంతరం ప్రత్యేక కమిషన్‌ను నియమించింది. ఆ కమిషన్ ఇచ్చిన నివేదిక ప్రకారమే ఇప్పుడు రాష్ట్రంలో రిజర్వేషన్లను ఖరారు చేస్తున్నారు. బీసీలకు పెంచిన రిజర్వేషన్ల అమలుకోసం ప్రభుత్వం ప్రత్యేక జీవోను విడుదల చేయాలనే యోచన లో ఉంది. కానీ ఈ జీవోను సవాల్ చేస్తూ ఎవరైనా కోర్టును ఆశ్రయిస్తే పరిస్థితి ఏమిటన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.

జడ్పీ చైర్‌పర్సన్, ఎంపీపీలే పూర్తి

రిజర్వేషన్ల వ్యవహారంలో మంగళవారం రాత్రి వరకు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌లు, ఎంపీపీలు, జెడ్పీటీసీల స్థానాలకే పూర్తిస్థాయిలో రిజర్వేషన్లు ఖరారయ్యాయి. గ్రామ పంచాయితీలు, వార్డు మెంబర్లు, ఎంపీటీసీల స్థానాలకు కొన్నిచోట్ల రిజర్వేషన్లు పూర్తికాలేదని తెలిసింది. ఈ విషయాన్ని గమనించిన పంచాయితీరాజ్ శాఖ ఉన్నతాధికారులు ఆ స్థానాల్లో రిజర్వేషన్ల ఖరారుకు అనుసరించాల్సిన పూర్తి వివరాలను మరోసారి క్షేత్రస్థాయి అధికారులకు వివరించారు. పూర్తయిన రిజర్వేషన్లతో పాటు మిగిలిపోయిన వాటిని బుధవారం సాయంత్రం వరకు పూర్తిచేసి, నివేదికలను ప్రభుత్వానికి కలెక్టర్లు అందించనున్నారు.

బీసీలకు 42% రిజర్వేషన్ అసాధ్యం!

- అలా చేయడం రాజ్యాంగ విరుద్ధం
- రాష్ట్ర ప్రభుత్వ ప్రయత్నాలను అడ్డుకోండి
- హైకోర్టులో పిటిషన్.. నేడు విచారణ

హైదరాబాద్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక జీవో ఇవ్వడానికి ప్రయత్నిస్తోందని, అది రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంటూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించకుండా ఉండేలా ఆదేశాలు జారీచేయడంతో పాటు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకోవాలని పిటిషన్‌లో కోరారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మూడుచింతలపల్లి మండలం కేశవాపూర్‌కు చెందిన సామాజిక కార్యకర్త బుట్టెంగారి మాధవరెడ్డి, సిద్దిపేట జిల్లా చిన్నకొండూరుకు చెందిన జలపల్లి మల్లవ్వ ఈ పిటిషన్ దాఖలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇస్తే, మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించిపోతాయని.. ఇది సుప్రీంకోర్టు తీర్పులకు విరుద్ధమని పిటిషనర్లు పేర్కొన్నారు. 'కె.కృష్ణమూర్తి వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' కేసులో సుప్రీంకోర్టు రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదని పేర్కొన్న విషయాన్ని గుర్తు చేశారు. తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం 2018లోనూ రిజర్వేషన్లు 50 శాతానికి మించి ఇవ్వకుండా పరిమితి విధించారని.. దాన్ని అలాగే కొనసాగిస్తూ పంచాయతీ ఎన్నికలు నిర్వహించేలా రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీచేయాలని కోరారు. ప్రస్తుతం ఉన్న విధంగానే బీసీలకు 26 శాతం, ఎస్సీలకు 15, ఎస్టీలకు 9 శాతం ఇవ్వడం ద్వారా మొత్తం రిజర్వేషన్లు 50 శాతం అవుతాయని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు తీర్పులకు అనుగుణంగానే పంచాయతీరాజ్ చట్టంలో రిజర్వేషన్లు 50 శాతానికి మించకుండా ఏర్పాటు ఉందని.. ప్రభుత్వం దాన్ని సవరించి రిజర్వేషన్లను పెంచాలని చూస్తోందని ఆరోపించారు. రిజర్వేషన్లు 50 శాతానికి మించితే స్థానిక సంస్థల్లో పోటీ చేయాలనుకునే ఇతర వర్గాల వారి హక్కులకు భంగం కలుగుతుందని తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడం రాజ్యాంగపరంగా అసాధ్యమైన పని అన్నారు. అయినప్పటికీ ప్రభుత్వం మొండిగా ముందుకెళ్తే సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనాల ఉద్దేశం ఓడిపోయినట్లు అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించే జీవోతోపాటు ఎన్నికల నోటిఫికేషన్ సైతం ఇచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రభుత్వ ప్రయత్నాలను అడ్డుకోవాలని వారు కోరారు. ఈ పిటిషన్ బుధవారం జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం ఎదుట విచారణకు రానుంది.



చిక్కడపల్లి లైబ్రరీలో విద్యార్థులతో మాట్లాడుతున్న రాంచందర్‌రావు

ఆల్మట్టి ఎత్తు పెంచితే దక్షిణ తెలంగాణ ఎడారే

- రాష్ట్ర ప్రయోజనాల కోసం రేవంత్ చొరవ చూపాలి
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

హైదరాబాద్/చిక్కడపల్లి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక ప్రభుత్వం ఆల్మట్టి డ్యామ్ ఎత్తును 519 మీటర్ల నుంచి 524 మీటర్లకు పెంచాలని నిర్ణయించడం వల్ల దక్షిణ తెలంగాణ రైతులకు తీవ్ర నష్టం జరుగుతుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు అన్నారు. ఆల్మట్టి డ్యాం పనులపై సుప్రీంకోర్టు స్టే ఇచ్చినప్పటికీ కర్ణాటక ప్రభుత్వం భూ సేకరణ చేపట్టడమంటే డ్యామ్ ఎత్తును పెంచే ప్రయత్నమే అని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం సీఎం రేవంత్ చొరవ తీసుకుని కర్ణాటక ప్రభుత్వంతో చర్చించాలని డిమాండ్ చేశారు. మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో రాంచందర్‌రావు మీడియాతో మాట్లాడారు. కర్ణాటకలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వమే ఉన్నా కృష్ణా జలాల్లో తెలంగాణ హక్కులను రక్షించడానికి, రైతులకు అన్యాయం జరకుండా చూడటానికి ఎందుకు చొరవ చూపడం లేదని రేవంత్‌ను ప్రశ్నించారు.

నిరుద్యోగులకు అండగా ఉంటాం..

నిరుద్యోగులు అధైర్యపడొద్దని, వారికి బీజేపీ అండగా ఉంటుందని రాంచందర్‌రావు భరోసా ఇచ్చారు. మంగళవారం ఉదయం చిక్కడపల్లిలోని సెంట్రల్ లైబ్రరీకి వచ్చిన ఆయన నిరుద్యోగులతో మాట్లాడారు. నిరుద్యోగుల హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అశోక్ ఉద్యోగ నియామకాల కోసం ఆమరణ దీక్ష చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు.

పేదల భూములను లాక్కుంటే ఊర్కోం: జాన్ వెస్లీ

హైదరాబాద్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రాజెక్టులు, పథకాల పేరుతో పేదల భూములను ప్రభుత్వం లాక్కుంటే సహించేది లేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు. ట్రిపుల్ ఆర్ భూసేకరణ ప్రభావిత ఎనిమిది జిల్లాల సీపీఎం నాయకులతో మంగళవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన సమావేశం నిర్వహించారు. ఆర్ఆర్ఆర్ అలైన్‌మెంట్ ప్రక్రియ శాస్త్రీయంగా జరపాలని డిమాండ్ చేశారు. భూసేకరణ వల్ల పేద ప్రజలు భూములను కోల్పోయే పరిస్థితి ఏర్పడుతోందని, వారి తరపున సీపీఎం పోరాటం చేస్తుందని వెస్లీ స్పష్టం చేశారు. భారీ స్థాయిలో రైతుల నుంచి భూములు సేకరించడం ఆమోదయోగ్యం కాదని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అభిప్రాయపడ్డారు.

డిసెంబరు 29, 30, 31 తేదీలకు ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల విడుదల వాయిదా

తిరుమల, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): డిసెంబరు నెల 29, 30, 31వ తేదీల(వైకుంఠ ఏకాదశి)కు సంబంధించిన రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటా విడుదలను టీటీడీ వాయిదా వేసింది. పరిపాలనాపరమైన కారణాలతో ఈ మూడు రోజుల కోటాతో పాటు శ్రీవాణి టికెట్ల కోటా కూడా విడుదల చేయడం లేదని మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొంది.

డీసీసీ అధ్యక్షుల నియామకం కోసం ఏఐసీసీ పరిశీలకులు.. ప్రకటించిన అధిష్ఠానం

హైదరాబాద్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని 35 జిల్లా కాంగ్రెస్ కమిటీలకు(డీసీసీలు) అధ్యక్షుల నియామక ప్రక్రియలో మరో అడుగు పడింది. డీసీసీలకు అధ్యక్షులను ఎంపిక చేసేందుకు 22 మంది సీనియర్ నాయకులను పరిశీలకులుగా నియమించే ప్రతిపాదనకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆమోదముద్ర వేశారు. ఈమేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ మంగళవారం ప్రకటించారు. ఈ 22 మంది సీనియర్లలో మాజీ సీఎంలు, కేంద్ర మాజీ మంత్రులు, స్పీకర్లుగా పనిచేసిన వారూ ఉన్నారు.

బీఆర్ఎస్, బీజేపీ నేతలను లైబ్రరీల దరిదాపుల్లోకి రానివ్వకండి: కాంగ్రెస్

ప్రభుత్వ గ్రంథాలయాలను బీఆర్ఎస్, బీజేపీ నేతలు రాజకీయం కోసం వాడుకుంటున్నారని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చనగాని దయాకర్ ఆరోపించారు. ఆయా గ్రంథాలయాల్లో పోటీ పరీక్షల కోసం నిరుద్యోగులు సిద్ధమవుతున్నారని, రెండు పార్టీల నేతలు.. రోజుకు ఒకరు వచ్చి వారి ప్రిపరేషన్‌కు ఆటంకం కలిగిస్తున్నారన్నారు. బీఆర్ఎస్, బీజేపీ నేతలను గ్రంథాలయాల దరిదాపుల్లోకి రానివ్వవద్దంటూ నిరుద్యోగులకు వారు ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

చైనా వెళ్లిన సీపీఎం బృందంలో ఇద్దరు తెలుగువారు

చైనాలో పర్యటించేందుకు వెళ్లిన సీపీఎం కేంద్ర ప్రతినిధుల బృందంలో ఇద్దరు తెలుగువారికి ప్రాధాన్యం దక్కింది. ఈ బృందంలో పొలిట్ బ్యూరో సభ్యులు ఆర్. అరుణ్ కుమార్‌తో పాటు సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు కె. హేమలత ఉన్నారు. 'కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ చైనా' ఆహ్వానం మేరకు ఈ నెల 23 నుంచి 30 వరకు ఆ దేశంలో పర్యటించడానికి సోమవారం వీరు చైనా బయలుదేరి వెళ్లారు. ఇరు పార్టీల అనుభవాలు, సిద్ధాంతాల మీద ఈ పర్యటనలో చర్చించనున్నట్లు సీపీఎం ఒక ప్రకటనలో పేర్కొంది.

స్థానిక ఎన్నికలు నిర్వహించలేని అసమర్థ సర్కార్

- మంత్రి సీతక్క రాజీనామా చేయాలి: బీఆర్ఎస్

స్థానిక సంస్థల్లో పాలకవర్గాల పదవీకాలం ముగిసి 20 నెలలయినా.. ఎన్నికలు నిర్వహించలేని అసమర్థ స్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని, దీనికి బాధ్యత వహిస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క తన పదవికి రాజీనామా చేయాలని బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేశారు. ఆ పార్టీ నేతలు క్యామ మల్లేశ్, వై.సతీష్‌రెడ్డి మంగళవారం తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడారు. పాలక వర్గాల్లేక గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని, ఎన్నికలు నిర్వహించలేని.. ఈ ప్రభుత్వంలో మంత్రులుగా ఏం చేస్తున్నారని, పదవులను వదులుకోవడమే మంచిదని వారు సూచించారు. సర్పంచులు, ఎంపీటీసీ, జడ్పీటీసీల పదవీకాలం ముగిసినా.. ఎన్నికలు నిర్వహించకుండా రేవంత్‌రెడ్డి సామంతరాజులను నియమిస్తారా? అని ప్రశ్నించారు. ఓటమి భయంతోనే ఎన్నికలకు వెళ్లడం లేదని, బీసీ రిజర్వేషన్ల పేరుతో కాలయాపన చేస్తూ తప్పించుకుంటున్నారని వారు ఆరోపించారు.

నీలోఫర్‌లో పీజీ హాస్టల్ భవనాలు

నీలోఫర్ ఆస్పత్రి ఆవరణలో పీజీ వైద్య విద్యార్థులకు హాస్టల్ భవనాలు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఆ భవనాల్లో పీజీ వైద్య విద్యార్థులు, సీనియర్ రెసిడెంట్ డాక్టర్లతోపాటు 280 (180 మంది మహిళా డాక్టర్లు, 100 మంది పురుష డాక్టర్లు) మంది వైద్యులకు వసతి కల్పించనున్నారు. ఈ విషయమై రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాల మేరకు మంగళవారం ఆరోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తు అధ్యక్షతన జరిగిన నీలోఫర్ హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ సమావేశంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, డీఎంఈ నరేంద్ర కుమార్, జోనల్ కమిషనర్ అనురాగ్ ఠాకూర్, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ ఫణీంద్ర రెడ్డి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. హాస్టల్ భవనాల నిర్మాణానికి అనువైన స్థలాన్ని పరిశీలించామని, రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపనున్నట్లు క్రిస్టినా జడ్ చొంగ్తు ఓ ప్రకటనలో తెలిపారు. వందల మంది వైద్యులు 24 గంటలు ఆస్పత్రిలో అందుబాటులో ఉండటంతో రోగులకు మెరుగైన వైద్య సేవలందుతాయని క్రిస్టినా పేర్కొన్నారు. ఆవరణలోని ధర్మశాల భవనాన్ని నీలోఫర్ ఆస్పత్రికి అప్పగించాలని జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్‌ను ఆదేశించిన క్రిస్టినా.. ఈ భవనంలోని 72 రూములను రోగుల సహాయకుల వినియోగంలోకి తెస్తామన్నారు. ఇక ఆస్పత్రి వద్ద ట్రాఫిక్ నియంత్రణ, రద్దీని తగ్గించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కూడా చర్చించారు.



జ్ఞానేశ్వర్ దీక్షను భగ్నం చేసి, ఆయన్ను రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించిన పోలీసులు

చెరువును కాపాడాలని నిరశన!

- ఫ్యాక్టరీ వ్యర్థాలతో మూగజీవాల మృత్యువాత
- ప్రజలకు ఆరోగ్య సమస్యలు.. ప్రకృతి ప్రేమికుడి ఆవేదన
- సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట దీక్ష.. భగ్నం చేసిన పోలీసులు

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమ వ్యర్థ జలాలతో కలుషితమైపోయిన చెరువును కాపాడాలంటూ ఓ ప్రకృతి ప్రేమికుడు కలెక్టరేట్ ఎదుట నిరశన దీక్షకు దిగాడు. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం దోమడుగు గ్రామంలో హెటిరో పరిశ్రమ వ్యర్థ జలాలతో నల్లకుంట చెరువు కలుషితమవుతోందని, అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదంటూ ప్రకృతి ప్రేమికుడు జ్ఞానేశ్వర్ మంగళవారం సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట నిరశనకు కూర్చున్నారు. నల్లకుంట చెరువులో నీరు కలుషితం కావడంతో మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయని, ప్రజలకు ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని జ్ఞానేశ్వర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదని ఆయన ఆరోపించారు. చెరువును పరిరక్షించాలనే నిరశన చేస్తున్నానని తెలిపారు. జ్ఞానేశ్వర్ దీక్ష విషయం తెలుసుకున్న పోలీసులు ఆయన్ను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

గ్రామగ్రామానా ఓట్ చోరీపై సంతకాల సేకరణ చేపట్టాలి

- డీసీసీలకు మహేశ్ కుమార్ గౌడ్ ఆదేశం

హైదరాబాద్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఓట్ చోరీ అంశంపై రాహుల్‌గాంధీ ఉద్యమానికి మద్దతుగా సంతకాల సేకరణ కార్యక్రమాన్ని గ్రామగ్రామానా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని జిల్లా కాంగ్రెస్ కమిటీల అధ్యక్షులను టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఆదేశించారు. అక్టోబర్ 15లోగా సంతకాల సేకరణ పూర్తి చేసి ఏఐసీసీకి పంపాలన్నారు. ఓట్ చోరీని, ఎన్నికల కమిషన్‌ను నమ్ముకునే మోదీ, షాలు మూడోసారి అధికారంలోకి వచ్చారని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో స్థానిక ఎన్నికలు రానున్న నేపథ్యంలో.. ఈ అంశంపై ప్రజల్లో పూర్తి అవగాహన తీసుకురావాలని ఆయన తెలిపారు. డీసీసీ అధ్యక్షులతో మంగళవారం జరిగిన జూమ్ మీటింగ్‌లో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్, మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.



ఆ 23 గిరిజన గ్రామాలేనన్న తీర్పుపై స్టే

- సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులతో ఆ గ్రామాల్లో స్థానిక ఎన్నికలకు బ్రేక్!

న్యూఢిల్లీ/ములుగు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా మంగపేట మండలంలోని 23 రెవెన్యూ గ్రామాలు గిరిజన గ్రామాలేనని హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టు స్టే విధించింది. రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సిద్ధమవుతున్న తరుణంలో ఈ ఉత్తర్వులు వెలువడ్డాయి. దీంతో ఆ 23 గ్రామాల్లో ఎన్నికలు నిర్వహించలేని పరిస్థితి ఏర్పడింది. ఆ గ్రామాలపై గిరిజనులు, గిరిజనేతరుల మధ్య చాలాకాలంగా వివాదం నడుస్తోంది. ఈ నేపథ్యంలో పలువురు గిరిజనులు హైకోర్టును ఆశ్రయించగా.. ఆ గ్రామాలు షెడ్యూల్డ్ ప్రాంతాలేనని 2023 జూలై 5న తీర్పు వెలువడింది. కొందరు గిరిజనేతరులు హైకోర్టు తీర్పును అదే ఏడాది ఆగస్టు 24న సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఆ పిటిషన్లపై మంగళవారం జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ విజయ్ బిష్ణోయ్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరపున వివేక్ తంఖా, విష్ణువర్ధన్ రెడ్డి, తెలంగాణ ప్రభుత్వం తరపున అభిషేక్ సింఘ్వీ, గౌరవ్ అగర్వాల్, ప్రభుత్వ స్టాండింగ్ కౌన్సిల్ శ్రవణ్, ఏవోఆర్ మోహిత్‌రావు హాజరయ్యారు. 1950 నాటి రాష్ట్రపతి ఉత్తర్వుల్లో మంగపేట మండలంలోని 23 గ్రామాలు లేవని వివేక్ తంఖా వాదనలు వినిపించారు. దీనిపై తెలంగాణ ప్రభుత్వం తరపు న్యాయవాదులు అభ్యంతరం తెలుపుతూ ఆ గ్రామాలను రాష్ట్రపతి నోటిఫై చేశారని తెలిపారు. అయితే ఈ ప్రక్రియకు కొంత ఆలస్యం జరిగిందన్నారు. ఈ మధ్యలో ఆ గ్రామాలను పాల్వంచ తాలూకా నుంచి ములుగు తాలూకాలో కలిపారని పేర్కొన్నారు. ఇది కేవలం పాలనాపరమైన తప్పేనని, రాష్ట్రపతి ఉత్తర్వులకు వ్యతిరేకం కాదని, అవి ముమ్మాటికీ గిరిజన గ్రామాలేనని తెలిపారు. ఇరు వాదనలు విన్న ధర్మాసనం.. రెండు నెలల తర్వాత తదుపరి విచారణ చేపడతామని తెలిపింది. తెలంగాణ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తం అవుతోందని, ఆ 23 గ్రామాల్లోనూ రిజర్వేషన్ల ప్రకారమే షెడ్యూల్ విడుదల చేసే అవకాశం ఉందని వివేక్ తంఖా ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. అందువల్ల అత్యవసరంగా ఈ పిటిషన్లపై నిర్ణయం తీసుకోవాలని కోరారు. దీంతో తదుపరి విచారణ వరకు ఆ 23 గ్రామాలు గిరిజన గ్రామాలేనని హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై సుప్రీం కోర్టు స్టే విధించింది.

అప్పుడే 45,900 కోట్లు

(మొదటిపేజీ తరువాయి)



అందులో రూ.45,900 కోట్లు అప్పు తీసుకుంది. అంటే ఆరు నెలల్లోనే 85శాతం అప్పు చేసింది. అందులోనూ ఈ ఒక్క నెలలోనే రూ.12 వేల కోట్లు రుణం తీసుకోవడం గమనార్హం. కొత్త ఆదాయ మార్గాలు లేకపోవడం, పథకాలు, అభివృద్ధి పనులకు నిధులను సర్దాల్సి రావడంతో త్వరత్వరగా ఎక్కువ మొత్తంలో ప్రభుత్వం రుణ సేకరణ చేస్తోందని అధికార వర్గాలు చెబుతున్నాయి.

నెల నెలా భారీగా పెరుగుతూ..

రాష్ట్ర ప్రభుత్వం గతంలో రిజర్వు బ్యాంకు ప్రతి వారం నిర్వహించే ఈ-వేలం ద్వారా రూ.1,000 కోట్ల నుంచి రూ.2,000 వరకు రుణాలు తీసుకునేది. కానీ కొన్ని నెలలుగా ప్రతి దఫా ఏకంగా ఐదారు వేల కోట్ల వరకు అప్పు తీసుకుంటోంది. మంగళవారం కూడా ఏకంగా రూ.5000 కోట్ల అప్పు తీసుకుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పరిశీలిస్తే.. ఏప్రిల్‌లో రూ.4,400 కోట్లు, మే నెలలో రూ.4,500 కోట్లు, జూన్‌లో రూ.8,500 కోట్లు, జూలైలో రూ.8,500 కోట్లు కలిపి నాలుగు నెలల్లో రూ.25,900 కోట్లు అప్పు చేసింది. ఆగస్టులో రూ.8,000 కోట్లు, ఈ నెల 2న రూ.6 వేల కోట్లు, 16న వెయ్యి కోట్లు, తాజాగా మంగళవారం మరో రూ.5 వేల కోట్లు రుణాలు తీసుకుంది. అంటే ఈ రెండు నెలల్లోనే రూ.20 వేల కోట్లు అప్పు చేసింది. దీనితో మొత్తం అప్పులు రూ.45,900 కోట్లకు చేరాయి. కేంద్రం అనుమతించిన రూ.54,009 కోట్ల మార్కెట్ రుణాల్లో ఇవి 85శాతంకావడం ఆందోళనకరం. అంతేకాదు మిగిలిన ఆరు నెలల్లో తీసుకోగలిగిన రుణం రూ.8,109 కోట్లు మాత్రమే. ఇతర మార్గాల్లో ఆదాయం సమకూరకుంటే ప్రభుత్వానికి ఇబ్బందేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

దీర్ఘకాలిక అప్పుల కింద రూ.5,000 కోట్లు

రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం రిజర్వు బ్యాంకు ఈ వేలం ద్వారా 7.44శాతం వార్షిక వడ్డీతో రూ.5,000 కోట్లు అప్పు తీసుకుంది. ఇందులో 22 ఏళ్ల కాల పరిమితితో రూ.1,500 కోట్లు, 23 ఏళ్లతో రూ.1,000 కోట్లు, 24 ఏళ్లతో రూ.1,000 కోట్లు, 26 ఏళ్ల కాల పరిమితితో రూ.1,500 కోట్ల రుణం ఉన్నాయి. మంగళవారం తెలంగాణ సహా 11 రాష్ట్రాలు రూ.25 వేల కోట్ల అప్పులు తీసుకున్నాయి.

ఆర్‌డీఎన్ చికిత్సతో అధిక రక్తపోటుకు చెక్

ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంటరాలజీ వైద్యుల వెల్లడి

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): భారతదేశంలో అనియంత్రిత రక్తపోటు కేసులు గణనీయంగా పెరుగుతున్నాయని.. రీనల్ డీనెర్వేషన్ (ఆర్‌డీఎన్) చికిత్స దీనికి చక్కటి పరిష్కారమని ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంటరాలజీ (ఏఐజీ) ఆస్పత్రి వైద్యులు వెల్లడించారు. ఇండియా హైపర్ టెన్షన్ కంట్రోల్ ఇనీషియేటివ్ ప్రకారం భారత దేశంలో 20 కోట్ల మంది రక్తపోటు బాధితులు ఉంటే, వారిలో రెండు కోట్లమంది మాత్రమే దీనిని నియంత్రణలో ఉంచుకుంటున్నారని ఆందోళన వెలిబుచ్చారు. హైబీపీని నియంత్రణలో పెట్టే ఆర్‌డీఎన్ చికిత్స గురించి.. ఏఐజీ హాస్పిటల్స్ క్యాథ్‌ల్యాబ్ డైరెక్టర్, ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ అనూజ్ కపాడియా వివరించారు. తరచుగా తలనొప్పి, నీరసం, అధిక రక్తపోటు సమస్యలతో బాధపడుతున్న 41 ఏళ్ల వ్యక్తిని ఈ ఆర్‌డీఎన్ చికిత్సతోనే సాధారణ స్థితికి తీసుకువచ్చామని ఆయన వెల్లడించారు. అతడి రక్తపోటు ఎప్పుడూ 170/100గా ఉండేదని.. ఎన్ని మందులు వాడినప్పటికీ ఫలితం లేకపోవడంతో డీనెర్వేషన్ చికిత్స తీసుకున్నాడని, కొద్ది రోజుల్లోనే అతని రక్తపోటు 130/88కి దిగివచ్చిందని తెలిపారు. దీంతో అతడికి ఉన్న ఇతర ఆరోగ్య సమస్యలు కూడా తగ్గిపోయాయని చెప్పారు. ఆర్‌డీఎన్ చికిత్సతో ఈ తరహా రోగులలో సిస్టోలిక్ రక్తపోటు 50ఎంఎంహెచ్‌జీ వరకూ తగ్గడం గమనించామన్నారు. సాధారణ బీపీ ఔషధాలు పనిచేయనివారికి ఆర్‌డీఎన్ చికిత్స చక్కటి ఉపశమనంగా నిలిచే అవకాశాలున్నాయన్నారు. సిస్టోలిక్ బీపీని కేవలం 10ఎంఎంహెచ్‌జీ తగ్గించుకుంటేనే.. బ్రెయిన్ స్ట్రోక్ ప్రమాదం 27%, గుండె విఫలమయ్యే ముప్పు 28%, కొరోనరీ హార్ట్ డిసీజ్ ప్రమాదం 17% తగ్గే అవకాశాలున్నాయని ఆయన వెల్లడించారు. కాగా.. ఇది అతి తక్కువ కోత అవసరమయ్యే క్యాథెటర్ ఆధారిత చికిత్స అని ఏఐజీ ఆస్పత్రుల క్యాథ్‌ల్యాబ్ కో డైరెక్టర్ డాక్టర్ స్వరూప్ జి భరాడీ తెలిపారు. ఏఐజీ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ రాజీవ్ మీనన్, డాక్టర్ ఆర్ ప్రసాద్ రెడ్డి తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

5 నెలల్లో రాష్ట్ర ఖర్చు 88,610 కోట్లు

- అన్ని రకాల రాబడుల కింద వచ్చిన ఆదాయం రూ.96,654 కోట్లు
- ఇందులో రుణాల సేకరణతో సమకూరింది రూ.33,415 కోట్లు
- కేంద్ర గ్రాంట్ల అంచనాలో ఇప్పటివరకు వచ్చింది 7.35శాతమే!
- 'కాగ్' నివేదికలో వెల్లడి.. 6 నెలల్లోనే 85% అప్పులు చేసిన సర్కారు

హైదరాబాద్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఐదు నెలలు ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు రాష్ట్ర ప్రభుత్వం రూ.88,610.95 కోట్లు వ్యయం చేసింది. అదే సమయంలో రుణ సేకరణ సహా అన్ని రకాల రాబడుల కింద రూ.96,654.24 కోట్లు సమకూరాయి. మంగళవారం కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్) విడుదల చేసిన నివేదికలో ఈ అంశాలను వెల్లడించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మొత్తం రూ.2,63,486.74 కోట్లు వ్యయం అవుతుందని బడ్జెట్‌లో ప్రభుత్వం అంచనా వేయగా.. అందులో ఐదు నెలల్లో రూ.88,610.95 కోట్లు (33.63%) ఖర్చు చేసినట్టు తెలిపింది. ఇందులో పథకాల కోసం రూ.27,488 కోట్లు, వడ్డీ చెల్లింపుల కింద రూ.11,447 కోట్లు, ఉద్యోగుల జీతభత్యాల కోసం రూ.20,141 కోట్లు, పెన్షన్లకు రూ.7,701 కోట్లు, సబ్సిడీలకు రూ.7,492 కోట్లను వ్యయం చేసిందని వెల్లడించింది. రాష్ట్ర సర్కారు మౌలిక సదుపాయాల కల్పన కోసం మూలధన వ్యయం కింద బడ్జెట్‌లో రూ.36,504.45 కోట్లు ప్రతిపాదించగా.. ఆగస్టు వరకు రూ.14,339.54 కోట్లు(39.28%) వ్యయం చేసినట్టు తెలిపింది.

కేంద్ర గ్రాంట్లు చాలా తక్కువే..

కాగ్ వివరాల ప్రకారం.. రాష్ట్ర ప్రభుత్వానికి సమకూరిన ఆదాయంలో.. పన్ను రాబడి రూ.59,967 కోట్లు, పన్నేతర రాబడి కింద రూ.1,578 కోట్లు, కేంద్ర గ్రాంట్లు, కాంట్రిబ్యూషన్ల కింద రూ.1,673 కోట్లు సమకూరాయి. ఈసారి రూ.54,009 కోట్లు మార్కెట్ రుణాలు తీసుకుంటామని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించగా.. ఆగస్టు నాటికి రూ.33,415(61.87%) కోట్లు సేకరించింది. పన్నుల ఆదాయంలో జీఎస్టీ ద్వారా రూ.21,144 కోట్లు, స్టాంపులు-రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.6,218 కోట్లు, అమ్మకం పన్ను ద్వారా రూ.14,079 కోట్లు, రాష్ట్ర ఎక్సైజ్ సుంకాల కింద రూ.7,758 కోట్లు, కేంద్ర పన్నుల్లో వాటా కింద రూ.7,413 కోట్లు, ఇతర పన్నులు, సుంకాల ద్వారా రూ.3,352 కోట్లు సమకూరాయి. కాగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కేంద్రం నుంచి మొత్తం రూ.22,782.50 కోట్లు గ్రాంట్లు, కాంట్రిబ్యూషన్ల కింద వస్తాయని ప్రభుత్వం అంచనా వేసుకోగా.. ఆగస్టు నాటికి రూ.1,673.43 కోట్లు(7.35%) మాత్రమే అందాయి.

టాప్-5లో దీప్తి

● మహిళల వన్డే ర్యాంకింగ్స్

దుబాయ్: టీమిండియా ఆల్‌రౌండర్ దీప్తి శర్మ ఐసీసీ మహిళల వన్డే ర్యాంకింగ్స్‌లో ముందంజ వేసింది. మంగళవారం ప్రకటించిన బౌలర్ల తాజా ర్యాంకింగ్స్‌లో దీప్తి రెండు స్థానాలు ఎగబాకి ఐదో ర్యాంక్‌లో నిలిచింది. సోఫీ ఎకెల్‌స్టోన్ (ఇంగ్లండ్) నెంబర్‌వన్ బౌలర్‌గా కొనసాగుతోంది. బ్యాటర్లలో స్మృతీ మంధాన నెంబర్‌వన్ ర్యాంక్‌ను నిలబెట్టుకుంది.

హాంకాంగ్ సిక్సెస్‌లో భారత్ కెప్టెన్ దినేశ్

హాంకాంగ్: నవంబరు 7 నుంచి జరిగే హాంకాంగ్ క్రికెట్ సిక్సెస్ టోర్నమెంట్‌లో టీమిండియా కెప్టెన్‌గా మాజీ క్రికెటర్ దినేశ్ కార్తీక్ ఎంపికయ్యాడు. ఇన్నింగ్స్‌కు ఆరేసి ఓవర్ల మ్యాచ్‌లు సాగే హాంకాంగ్ సిక్సెస్ టోర్నీకి ఐసీసీ ఆమోదం ఉంది. 1992 నుంచి జరుగుతున్న ఈ టోర్నీలో ఈసారి మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ కూడా భారత జట్టులో ఆడుతున్నాడు.

బెట్టింగ్ యాప్ కేసులో ఈడీ ముందు యువీ హాజరు



న్యూఢిల్లీ: ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ను ప్రమోట్ చేసిన కేసుకు సంబంధించి టీమిండియా మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్ మంగళవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణకు హాజరయ్యాడు. తన లీగల్ టీమ్‌తో కలిసి ఈడీ కార్యాలయానికి వచ్చిన యువీని ప్రశ్నించిన అధికారులు.. అనంతరం అతని వాంగ్మూలాన్ని రికార్డు చేశారు. ఇదే కేసుకు సంబంధించి ఇప్పటికే మాజీ క్రికెటర్లు రైనా, ధవన్, ఊతప్పలను ఈడీ అధికారులు ప్రశ్నించిన సంగతి తెలిసిందే.

కొరియా ఓపెన్ మెయిన్ డ్రాకు మేఘనా రెడ్డి

సువోన్ (కొరియా): భారత యువ షట్లర్ మేఘనా రెడ్డి కొరియా ఓపెన్ సూపర్ 500 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో మహిళల సింగిల్స్ మెయిన్ డ్రాకు అర్హత సాధించింది. క్వాలిఫయింగ్ చివరి రౌండ్లో మేఘన 21-19, 22-20తో రిరినా హిరమొటొ (జపాన్)పై గెలిచింది. బుధవారం మెయిన్ డ్రా తొలి రౌండ్లో టోన్‌రుగ్ సేహెంగ్ (థాయ్‌లాండ్)తో మేఘన తలపడనుంది.



కొడితే.. ఫైనల్‌కే!

నేడు బంగ్లాతో భారత్ మ్యాచ్

రాత్రి 8 గం. నుంచి సోనీ నెట్‌వర్క్‌లో

దుబాయ్: ఆసియాకప్‌లో వరుస విజయాలతో దూసుకెళ్తున్న టీమిండియా ఇక ఫైనల్‌పై దృష్టి సారించింది. సూపర్-4లో భాగంగా బుధవారం తమ రెండో మ్యాచ్‌ను బంగ్లాదేశ్‌తో ఆడనుంది. తొలి మ్యాచ్‌లో పాక్‌ను చిత్తు చేసిన సూర్యకుమార్ సేన ఈ పోరులో గెలిస్తే ఫైనల్లో చోటు ఖాయమే. అటు బంగ్లా కూడా శ్రీలంకపై విజయంతో ఆత్మవిశ్వాసంతోనే ఉంది. కానీ గణాంకాలను పరిశీలిస్తే టీమిండియాకు ఇది కూడా ఏకపక్ష మ్యాచ్‌గానే పరిగణించవచ్చు. ఎందుకంటే బంగ్లాతో ఆడిన 17 టీ20ల్లో కేవలం ఒక్కసారి మాత్రమే ఓడింది. అయితే 2015 వన్డే వరల్డ్‌కప్‌లో రోహిత్ వివాదాస్పద నాటౌట్ తర్వాత ఇరు జట్ల మధ్య అంతగా సత్సంబంధాలు లేవు. భారత్‌తో ఆడినప్పుడు పాక్ మాదిరే బంగ్లా ఆటగాళ్లలోనూ కసి కనిపిస్తుంటుంది. అక్కడి అభిమానులు కూడా భారత జట్టును పోటాపోటీ ప్రత్యర్థిగా భావిస్తుంటారు. దీనికి తోడు మాజీ ప్రధాని హసీనాకు ఆశ్రయం ఇవ్వడంతో దౌత్యపరంగానూ రెండు దేశాల మధ్య ఇబ్బందులున్నాయి. అందుకే ఆగస్టులో బంగ్లాతో జరగాల్సిన వన్డే సిరీస్‌ను కూడా బీసీసీఐ వాయిదా వేసుకుంది. ఈ నేపథ్యంలో రెండు జట్ల మధ్య పోరు కూడా ఆసక్తికరంగా సాగే అవకాశం ఉంది. అయితే ఏ విభాగంలో చూసినా ప్రత్యర్థికన్నా భారత జట్టు అత్యంత పటిష్ఠంగా కనిపిస్తోంది. ఓపెనర్లు అభిషేక్, గిల్ మెరుపు ఇన్నింగ్స్‌తో బౌలర్లకు చెమటలు పట్టిస్తున్నారు. కెప్టెన్ సూర్య క్రీజులో నిలదొక్కుకుంటే భారీ స్కోరు ఖాయమే. అటు శాంసన్, హార్దిక్, దూబే స్థాయికి తగ్గట్టు ఆడాల్సి ఉంది. అలాగే తిలక్.. స్పిన్‌ను ఎదుర్కోవడంలో కాస్త ఇబ్బందిపడుతున్నాడు. ఈ ఏడాది స్పిన్నర్ల ద్వారా ఎదుర్కొన్న 80 బంతుల్లో అతడు 92 పరుగులు మాత్రమే సాధించాడు. బౌలింగ్‌లో బుమ్రా బంతుల్లో పదును తగ్గడం ఆందోళనకరమే అయినా దూబే, హార్దిక్ అండగా ఉంటున్నారు. స్పిన్‌లో కుల్దీప్, వరుణ్, అక్షర్ మరోసారి కీలకం కానున్నారు.

తుది జట్లు (అంచనా)

భారత్: అభిషేక్, శుభ్‌మన్ గిల్, సూర్యకుమార్ (కెప్టెన్), సంజూ శాంసన్, తిలక్ వర్మ, శివమ్ దూబే, హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి, బుమ్రా.

బంగ్లాదేశ్: సైఫ్ హసన్, తన్‌జీద్ హసన్, లిట్టన్ దాస్ (కెప్టెన్), తౌహిద్ హ్రిదయ్, షమీమ్, జకెర్ అలీ, మెహదీ హసన్, నసూమ్ అహ్మద్, టస్కిన్ అహ్మద్, తన్‌జీమ్ హసన్, ముస్తాఫిజుర్.

లిట్టన్, హ్రిదయ్‌పై ఆశలు


లిట్టన్

గత రికార్డులు ఎలా ఉన్నా భారత్‌ను ఓడించగల సత్తా తమ జట్టుకు ఉందని బంగ్లాదేశ్ కోచ్ సిమన్స్ అంటున్నాడు. అయితే ఈ జట్టు ఎక్కువగా కెప్టెన్ లిట్టన్ దాస్, తౌహీద్ హ్రిదయ్‌ల బ్యాటింగ్‌పై ఆధారపడి ఉంది. ఒకవేళ భారత్ ముందుగా బ్యాటింగ్‌కు దిగితే మధ్య ఓవర్లలో స్పిన్నర్లు రిషాద్ హుస్సేన్, మెహదీ హసన్‌లతో పాటు డెత్ ఓవర్లలో పేసర్ ముస్తాఫిజుర్ ద్వారా కట్టడి చేయాలనుకుంటోంది. బంగ్లా 150-160 పరుగులను సులువుగానే ఛేదించగలుగుతోంది.

పాక్.. రేసులోనే

శ్రీలంకపై విజయం


తలత్ (32 నాటౌట్)

ఆసియాకప్

అబుధాబి: ఆసియాకప్ సూపర్-4లో పాకిస్థాన్ కీలక విజయం అందుకుంది. ఫైనల్ రేసులో నిలవాలంటే శ్రీలంకపై కచ్చితంగా గెలిచి తీరాల్సిన మ్యాచ్‌లో 5 వికెట్ల తేడాతో నెగ్గింది. మంగళవారం జరిగిన ఈ మ్యాచ్‌లో లంక బౌలర్లు ఆఖరి వరకు కట్టడి చేసేందుకు ప్రయత్నించారు. అయితే మహ్మద్ నవాజ్ (38 నాటౌట్), హుస్సేన్ తలత్ (32 నాటౌట్) కీలక ఇన్నింగ్స్ ఆడారు. ఈ ఓటమితో డిఫెండింగ్ చాంపియన్ శ్రీలంక దాదాపుగా నిష్క్రమించినట్టే. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక 20 ఓవర్లలో 8 వికెట్లకు 133 పరుగులు చేసింది. కమిందు మెండిస్ (50), అసలంక (20) మాత్రమే రాణించారు. షహీన్‌కు మూడు.. తలత్, రౌఫ్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. పాక్ పేసర్ల జోరుకు పవర్‌ప్లేలోనే టాప్-3 బ్యాటర్లు పెవిలియన్‌కు చేరారు. అయితే కమిందు ఓవైపు వికెట్లు పడుతున్నా ఓపిగ్గా క్రీజులో నిలిచి అర్ధసెంచరీ సాధించాడు. ఏడో వికెట్‌కు కరుణరత్నె (17 నాటౌట్)తో కలిసి 43 పరుగులు జత చేశాడు. ఆ తర్వాత ఛేదనలో పాక్ 18 ఓవర్లలో 5 వికెట్లకు 138 పరుగులు చేసి గెలిచింది. తీక్షణ, హసరంగలకు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా హుస్సేన్ తలత్ నిలిచాడు.

మధ్యలో తడబడినా..: ఓపెనర్లు ఫర్హాన్ (24), ఫఖర్ (17) ఇన్నింగ్స్‌ను దీటుగా ఆరంభించి తొలి వికెట్‌కు 45 పరుగులు జోడించారు. అయితే స్పిన్నర్ల ధాటికి ఆరో ఓవర్ నుంచి వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయిన పాక్ 80/5 స్కోరుతో ఒత్తిడిలో పడింది. ఈ దశలో మ్యాచ్ ఇరువైపులా మొగ్గు చూపినట్టయ్యింది. అయితే తలత్, నవాజ్ జోడీ పాక్‌ను ఆదుకుంది. దాదాపు సగం ఓవర్లు ఆడిన వీరు రిస్కీ షాట్లకు వెళ్లకుండా కేవలం సింగిల్స్‌పై దృష్టి సారించారు. ఇక 18 బంతుల్లో 14 రన్స్ కావాల్సిన వేళ నవాజ్ మూడు సిక్సర్లతో చెలరేగి మ్యాచ్‌ను ముగించాడు. ఈ జోడీ ఆరో వికెట్‌కు అజేయంగా 58 పరుగులు జోడించడం విశేషం.

సంక్షిప్త స్కోర్లు

శ్రీలంక: 20 ఓవర్లలో 133/8 (మెండిస్ 50, అసలంక 20; షహీన్ 3/28, హుస్సేన్ తలత్ 2/18, రౌఫ్ 2/37).

పాకిస్థాన్: 18 ఓవర్లలో 138/5. (నవాజ్ 38 నాటౌట్, తలత్ 32 నాటౌట్; తీక్షణ 2/24, హసరంగ 2/27).

ప్రపంచ షూటింగ్ చాంపియన్‌షిప్‌నకు ఇషా

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): వచ్చేనెల కైరోలో జరిగే ప్రపంచ షూటింగ్ చాంపియన్‌షిప్‌నకు యువ షూటర్ ఇషా సింగ్ అర్హత సాధించింది. మంగళవారం భోపాల్‌లో జరిగిన ట్రయల్స్‌లో సత్తా చాటిన ఇషా.. 10 మీటర్ల స్పోర్ట్స్ పిస్టల్, 25 మీటర్ల స్పోర్ట్స్ పిస్టల్ విభాగాల్లో మెగా టోర్నీకి ఎంపికైంది.

టైటాన్స్ ఉత్కంఠ విజయం

జైపూర్: ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన తెలుగు టైటాన్స్ ప్రో కబడ్డీ లీగ్‌లో ఐదో విజయాన్ని నమోదు చేసింది. మంగళవారం ఉత్కంఠగా జరిగిన మ్యాచ్‌లో టైటాన్స్ 30-29తో గుజరాత్ జెయింట్స్‌పై గెలిచింది. హోరాహోరీగా సాగిన మరో మ్యాచ్‌లో జైపూర్ పింక్ పాంథర్స్ 38-38 (6-4)తో యు ముంబాపై టైబ్రేకర్‌లో నెగ్గింది.

విశ్రాంతి కోరిన అయ్యర్

● భారత్-ఎ జట్టుకు దూరం



లఖ్‌నవూ: భారత్-ఎ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న శ్రేయాస్ అయ్యర్ హఠాత్తుగా జట్టును వీడాడు. మంగళవారం ఆస్ట్రేలియా-ఎతో రెండో అనధికార టెస్ట్‌కు కొద్ది గంటల ముందు అయ్యర్ సారథ్యాన్ని వీడాలన్న నిర్ణయం తీసుకొన్నాడు. దీంతో అతడి స్థానంలో ధ్రువ్ జురెల్‌ను కెప్టెన్‌గా మేనేజ్‌మెంట్ ప్రకటించింది. వెన్నునొప్పి ఇబ్బందిపెడుతున్నందున కొంత విశ్రాంతి అవసరమని.. ప్రస్తుతానికి రెడ్‌బాల్ క్రికెట్‌నుంచి తనకు మినహాయింపు ఇవ్వాలని సెలెక్టర్లకు అయ్యర్ లేఖ రాసినట్టు సమాచారం.

మానవ్‌కు 5 వికెట్లు..

రెండో అనధికార టెస్ట్‌లో భారత్-ఎ స్పిన్నర్ మానవ్ సుతార్ (5/93) తిప్పేయడంతో.. తొలి ఇన్నింగ్స్‌లో మొదటి రోజు చివరికి ఆస్ట్రేలియా-ఎ 350/9 స్కోరు చేసింది. టాడ్ మర్ఫీ (29), థోర్న్‌టన్ (10) క్రీజులో ఉన్నారు. జాక్ ఎడ్వర్డ్స్ (88), నాథన్ మెక్‌స్వీనీ (74) అర్ధ శతకాలతో రాణించారు.

దిగ్గజ అంపైర్ డికీ బర్డ్ మృతి



లండన్: అంతర్జాతీయ క్రికెట్‌లో దిగ్గజ అంపైర్‌గా పేరు తెచ్చుకున్న హెరాల్డ్ డికీ బర్డ్ (ఇంగ్లండ్) ఇక లేరు. వృద్ధాప్య సమస్యలతో 92 ఏళ్ల డికీ మంగళవారం మృతి చెందినట్టు యార్క్‌షైర్ క్రికెట్ క్లబ్ (వైసీసీ) పేర్కొంది. 1973 నుంచి రెండు దశాబ్దాల పాటు సాగిన డికీ కెరీర్ 1996లో ముగిసింది. రాహుల్ ద్రవిడ్, సౌరవ్ గంగూలీల అరంగేట్ర టెస్టే (లార్డ్స్) డికీకి చివరిది కావడం గమనార్హం. 66 టెస్టులు, 69 వన్డేల్లో బాధ్యతలు నిర్వర్తించిన తను మైదానంలో కచ్చితమైన నిర్ణయాలు తీసుకుంటాడన్న పేరు తెచ్చుకున్నాడు. అలాగే పురుషుల తొలి మూడు వన్డే వరల్డ్‌కప్ ఫైనల్స్‌లో డికీ బర్డ్ తన అంపైరింగ్‌తో వన్నె తెచ్చాడు. 'వరల్డ్ క్రికెట్‌లో అత్యంత ప్రజాదరణ పొందిన అంపైర్‌గా తన పేరును చరిత్రలో లిఖించుకున్నాడు' అని వైసీసీ తెలిపింది. ఆటగాడిగా డికీ బర్డ్ 93 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌ల్లో 3314 పరుగులు సాధించాడు.

'బాలన్ డి వోర్' విజేత డెంబ్లీ

బోన్మటికి వరుసగా మూడోసారి

పారిస్: పారిస్ సెయింట్ జర్మెయిన్ (పీఎస్‌జీ)కు తొలి చాంపియన్స్ లీగ్ టైటిల్ అందించిన స్ట్రయికర్ ఉస్మానే డెంబ్లీ (ఫ్రాన్స్) ఈ ఏడాదికి ప్రతిష్ఠాత్మక 'బాలన్ డి వోర్' అవార్డును సొంతం చేసుకొన్నాడు. మహిళల అవార్డును స్పెయిన్ మిడ్‌ఫీల్డర్ ఐటానా బోన్మటి వరుసగా మూడో ఏడాది దక్కించుకొంది. ఈ క్రమంలో ప్లాటిని (1983-85), మెస్సి (2009-12) తర్వాత హ్యాట్రిక్ 'బాలన్ డి వోర్' అందుకొన్న ఫుట్‌బాలర్‌గా, తొలి మహిళా ప్లేయర్‌గా బోన్మటి చరిత్ర సృష్టించింది.



బిజినెస్

ర్యాపిడోకు స్విగ్గీ గుడ్‌బై

కంపెనీలో వాటా రూ.2,400 కోట్లకు విక్రయం

న్యూఢిల్లీ: బైక్ ట్యాక్సీ అగ్రిగేటర్ ర్యాపిడో యాజమాన్య సంస్థ రోపెన్ ట్రాన్స్‌పోర్టేషన్ సర్వీసెస్‌లో తనకున్న వాటాను దాదాపు రూ.2,400 కోట్లకు విక్రయిస్తున్నట్లు ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ స్విగ్గీ మంగళవారం ప్రకటించింది. ఇందుకు తమ బోర్డు కూడా అంగీకరించిందని తెలిపింది. స్విగ్గీ నుంచి ఈ వాటాను ప్రోసస్ గ్రూప్‌నకు చెందిన ఎంఐహెచ్ ఇన్వెస్ట్‌మెంట్స్ వన్ బీవీ, వెస్ట్‌బ్రిడ్జ్ కొనుగోలు చేశాయి. ప్రోసస్ గ్రూప్ రూ.1,968 కోట్లు, వెస్ట్‌బ్రిడ్జ్ రూ.431.49 కోట్ల విలువైన వాటాలను దక్కించుకున్నాయి. ర్యాపిడో సైతం ఫుడ్ డెలివరీ వ్యాపారంలోకి ప్రవేశించే ప్రయత్నాల్లో ఉన్న నేపథ్యంలో పరస్పర విరుద్ధ ప్రయోజనాలు ఏర్పడవచ్చని ముందుజాగ్రత్త చర్యగా స్విగ్గీ ర్యాపిడోలో వాటాను పూర్తిగా ఉపసంహరించుకున్నట్లు తెలిసింది. 2020 ఏప్రిల్‌లో స్విగ్గీ ర్యాపిడోలో దాదాపు రూ.1,020 కోట్ల పెట్టుబడి పెట్టడం ద్వారా 12 శాతం వాటాను దక్కించుకుంది.

ప్రత్యేక సంస్థగా ఇన్‌స్టామార్ట్: స్విగ్గీ తన క్విక్-కామర్స్ విభాగమైన ఇన్‌స్టామార్ట్‌ను విభజించి ప్రత్యేక సంస్థగా ఏర్పాటు చేయాలని భావిస్తోంది. స్లంప్ సేల్ ద్వారా ఈ ప్రక్రియ జరగనుందని స్టాక్ ఎక్స్ఛేంజీలకు మంగళవారం సమాచారం అందించింది. అనంతరం ఇన్‌స్టా మార్ట్ స్విగ్గీకి పూర్తి అనుబంధ సంస్థగా కొనసాగనుంది.

మార్కెట్లోకి మ్యాటర్ ఎరా 5000 ప్లస్ ఎలక్ట్రిక్ బైక్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఎలక్ట్రిక్ మోటార్‌సైకిల్ తయారీ సంస్థ మ్యాటర్.. హైదరాబాద్ మార్కెట్లోకి తన ఫ్లాగ్‌షిప్ బైక్ 'ఎరా 5000 ప్లస్' తీసుకువచ్చింది. ఈ బైక్ ధర రూ.1,93,826 (హైదరాబాద్ ఎక్స్‌షోరూమ్). మంగళవారం నాడిక్కడ కంపెనీ వ్యవస్థాపకుడు, సీటీఓ కుమార్ ప్రసాద్ తెలికేపల్లి ఈ ఎలక్ట్రిక్ మోటార్‌సైకిల్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోనే తొలిసారిగా లైఫ్‌టైమ్ బ్యాటరీ వారంటీతో ఈ బైక్‌ను తీసుకువచ్చినట్లు చెప్పారు. 4 స్పీడ్ మాన్యువల్ ట్రాన్స్‌మిషన్, 5 కిలోవాట్ బ్యాటరీతో కూడిన ఈ బైక్ ఒకసారి చార్జింగ్‌తో 172 కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. ప్రస్తుతం కంపెనీ ఈ బైక్స్‌ను గుజరాత్‌లోని సనంద్ ప్లాంట్‌లో ఉత్పత్తి చేస్తోందన్నారు.



	బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)		
	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,14,330 ▲	1,04,800 ▲	1,49,000 ▲
విజయవాడ	1,17,900 ▲	1,11,000 ▲	1,39,000 ▲
విశాఖపట్నం	1,17,940 ▲	1,05,040 ▲	1,50,000 ▲
రాజమండ్రి	1,14,330 ▲	1,04,800 ▲	1,38,400 ▲
ప్రొద్దుటూరు	1,17,400 ▲	1,08,010 ▲	1,38,500 ▲
ముంబై	1,14,314 ▲	1,04,712 ▲	1,35,267 ▲

రూపీ.. కొత్త కనిష్ఠం

ఒక్కరోజులో 45 పైసలు క్షీణించిన రూపాయి
డాలర్ మారకంలో రూ. 88.73కు చేరిక



ముంబై: భారత కరెన్సీ సరికొత్త కనిష్ఠానికి పతనమైంది. అమెరికా డాలర్‌తో రూపాయి మారకం విలువ మంగళవారం ఏకంగా 45 పైసలు క్షీణించి రూ.88.73 వద్ద ముగిసింది. హెచ్1బీ వీసా ఫీజును లక్ష డాలర్లకు పెంచడంతో భారత ఐటీ సేవల ఎగుమతులకు భారీగా గండిపడవచ్చని, అమెరికా నుంచి రెమిటెన్స్‌లు తగ్గవచ్చన్న ఆందోళనలతో పాటు మన ఈక్విటీ మార్కెట్ నుంచి విదేశీ సంస్థాగత పెట్టుబడుల (ఎఫ్ఐఐ) ఉపసంహరణ మన కరెన్సీపై ఒత్తిడి పెంచాయని ఫారెక్స్ వర్గాలు తెలిపాయి. ఇంటర్ బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజీలో డాలర్-రూపీ ఎక్స్ఛేంజీ రేటు మంగళవారం రూ.88.41 వద్ద ప్రారంభమైంది. ఒకదశలో ఆల్‌టైం ఇంట్రాడే కనిష్ఠం రూ.88.82 వద్దకు చేరింది. చివరికి 47 పైసల నష్టంతో రూ.88.75 వద్ద స్థిరపడింది. సోమవారం ట్రేడింగ్‌లోనూ రూపాయి 12 పైసలు కోల్పోయింది.

రూ.90 దిశగా పయనం..

హెచ్1బీ వీసా ఫీజు పెంపు, విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ అంశాలు మున్ముందు రూపాయిపై మరింత ఒత్తిడి పెంచవచ్చని మిరాయ్ అసెట్ షేర్‌ఖాన్ కరెన్సీ అండ్ కమోడిటీస్ రీసెర్చ్ అనలిస్ట్ అనూజ్ చౌదరీ అన్నారు. డాలర్-రూపీ మారకం రేటు రూ.88.45-89.20 శ్రేణిలో ట్రేడయ్యే అవకాశాలున్నాయని ఆయన అంచనా వేశారు.

ఎగుమతిదారులకు స్వల్ప ఊరట

ట్రంప్ సుంకాలతో సతమతం అవుతున్న ఎగుమతిదారులకు రూపాయి క్షీణత కొంత ఊరటనివ్వనుంది. రూపాయి విలువ తగ్గిన ఫలితంగా ఎగుమతులపై గతంలో కంటే అధిక ఆదాయం లభించనుంది. దిగుమతిదారులపైన మాత్రం భారం మరింత పెరగనుంది. ముఖ్యంగా ముడి చమురు, బంగారం దిగుమతులకు మరింత అధికంగా వెచ్చించాల్సి వస్తుంది. రూపాయి క్షీణత స్వల్పకాలంలో ఎగుమతిదారులకు ప్రయోజనకరమే అయినప్పటికీ, మారకం రేటులో స్థిరత్వమే దీర్ఘకాలంలో మేలు చేస్తుందని ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎక్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఐఈఓ) అధ్యక్షుడు ఎస్‌సీ రల్హాన్ అన్నారు.



సీఆర్‌పీఎఫ్‌కు సీఎస్ఆర్ 338 స్నైపర్ రైఫిల్స్

ఐకామ్ టెలీకి భారీ ఆర్డర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అబుదాబీకి చెందిన చిన్న ఆయుధాల డిజైనింగ్, తయారీ కంపెనీ కారకాల్, మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రా లిమిటెడ్ (ఎంఈఐఎల్) అనుబంధ కంపెనీ ఐకామ్ టెలీ లిమిటెడ్ సారథ్యంలోని జాయింట్ వెంచర్ కంపెనీకి కేంద్ర రిజర్వ్ పోలీస్ దళం (సీఆర్‌పీఎఫ్) నుంచి రైఫిళ్ల సరఫరా ఆర్డర్ లభించింది. ఈ ఆర్డర్ కింద 200.. సీఎస్ఆర్ 338 స్నైపర్ రైఫిళ్లు సీఆర్‌పీఎఫ్‌కి సరఫరా చేయాల్సి ఉంటుంది. హైదరాబాద్‌లోని ఐకామ్ కారకాల్ స్మాల్ ఆర్మ్స్ కాంప్లెక్స్‌లో ఈ స్నైపర్ రైఫిళ్లు ఉత్పత్తి చేయనున్నట్టు ఎంఈఐఎల్ వెల్లడించింది. ఎడ్జ్ గ్రూప్ కంపెనీ అయిన కారకాల్ ఈ ఏడాది ఏప్రిల్‌లోనే భారత సాయుధ దళాలు, కేంద్ర ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్ సహా ఇతర రక్షణ విభాగాలకు ఆధునిక ఆయుధాల తయారీ, సరఫరా కోసం ఈ కాంప్లెక్స్‌ను ప్రారంభించింది. ఐకామ్ కారకాల్ స్మాల్ ఆర్మ్స్ కాంప్లెక్స్‌ను ప్రారంభించిన అనంతరం ఐకామ్‌తో భాగస్వామ్యాన్ని మరింత పటిష్ఠం చేసుకుంటున్నట్టు కారకాల్ సీఈఓ హమద్ అలామెరి చెప్పారు.

తమ ప్రయాణంలో ఇది ఒక మైలురాయి అని ఐకామ్ డైరెక్టర్ సుమంత్ పాటూరు అన్నారు. తాము సీఆర్‌పీఎఫ్‌కు అత్యంత ఆధునికమైన సీఎస్ఆర్-338 స్నైపర్ రైఫిళ్లు సరఫరా చేయడంతో పాటు ప్రపంచ శ్రేణి టెక్నాలజీని కూడా బదిలీ చేస్తున్నామని, తద్వారా హైదరాబాద్ తయారీ రంగంలో అత్యున్నత నాణ్యత గల ఉద్యోగావకాశాలు అందుబాటులోకి తెస్తున్నామని ఆయన చెప్పారు. ఈ ఏడాది నాలుగో త్రైమాసికంలో దేశంలో తయారైన తొలి హై పెర్ఫార్మెన్స్ బోల్ట్ యాక్షన్ సీఎస్ఆర్ 338 స్నైపర్ రైఫిల్ డెలివరీ చేయనున్నట్టు సుమంత్ తెలిపారు.

ఈ ఏడాది 6.7 % వృద్ధి ఓఈసీడీ

ఈ ఆర్థిక సంవత్సరంలో భారత జీడీపీ వృద్ధి రేటు 6.7 శాతంగా నమోదు కావచ్చని ఆర్గనైజేషన్ ఫర్ ఎకనామిక్ కో-ఆపరేషన్ అండ్ డెవలప్‌మెంట్ (ఓఈసీడీ) అంచనా వేసింది. గత అంచనాతో పోలిస్తే 0.40% పెంచింది. కాగా, ఎస్ అండ్ పీ గ్లోబల్ మాత్రం వృద్ధి రేటు అంచనాను గతంలో ప్రకటించిన 6.5%గా కొనసాగిస్తున్నట్లు తెలిపింది.

మూడో రోజూ నష్టాలే..

సెన్సెక్స్ 58 పాయింట్లు డౌన్

ముంబై: హెచ్1బీ వీసా ఫీజు పెంపు ఆందోళనల నేపథ్యంలో ఐటీ షేర్లలో అమ్మకాలు, విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ కారణంగా ప్రామాణిక ఈక్విటీ సూచీలు వరుసగా మూడో రోజూ నష్టపోయాయి. మంగళవారం ట్రేడింగ్‌లో ఆద్యంతం లాభనష్టాల మధ్య ఊగిసలాడిన సెన్సెక్స్.. చివరికి 57.87 పాయింట్ల నష్టంతో 82,102.10 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో సూచీ 594 పాయింట్ల శ్రేణిలో కదలాడింది. కాగా, నిఫ్టీ 32.85 పాయింట్లు కోల్పోయి 25,169.50 వద్ద స్థిరపడింది. ఆటో, ప్రభుత్వ రంగ బ్యాంకుల షేర్లలో కొనుగోళ్లు సూచీల నష్టాలకు కొంత మేర అడ్డుకట్ట వేయగలిగాయి. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 17 నష్టపోయాయి. ట్రెంట్, టెక్ మహీంద్రా షేర్లు 2 శాతానికి పైగా క్షీణించాయి.

హైదరాబాద్‌లో మోనిన్ సిరప్ తయారీ ప్లాంట్

రూ.350 కోట్ల పెట్టుబడి.. వచ్చే ఏడాది అందుబాటులోకి

హైదరాబాద్: ఫ్రాన్స్‌కు చెందిన సహజసిద్ధ సిరప్ తయారీ సంస్థ మోనిన్.. భారత్‌లోనే తొలి ప్లాంట్‌ను హైదరాబాద్ సమీపంలోని సంగారెడ్డిలో ఏర్పాటు చేస్తోంది. రూ.350 కోట్ల పెట్టుబడితో 40 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేస్తున్న ఈ ప్లాంట్ వచ్చే ఏడాది ద్వితీయార్థంలో వాణిజ్యపరంగా అందుబాటులోకి వస్తుందని అంచనా వేస్తున్నట్లు మోనిన్ ఇండియా ఎండీ జెర్మైన్ ఔరద్ వెల్లడించారు. తొలి దశలో మొత్తం రెండు ఉత్పత్తి లైన్లతో ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. ఇందులో ఒకటి పూర్తిగా సిరప్ ఉత్పత్తి కోసం నెలకొల్పనుండగా మరొకటి క్రష్, బాట్లింగ్ కోసం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. భారతీయ ఫ్లేవర్స్‌ను తమ ఫ్రెంచ్ ఫ్లేవర్‌తో వినియోగదారులకు అందుబాటులోకి తీసుకురావటం తమ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. 1912లో ఫ్రాన్స్‌లో కార్యకలాపాలు ప్రారంభించిన మోనిన్.. 2019లో భారత మార్కెట్లోకి ప్రవేశించింది. ప్రస్తుతం 100కు పైగా డిస్ట్రిబ్యూషన్ చానల్స్‌తో నెట్‌వర్క్‌ను నిర్వహిస్తోంది. స్టార్‌బక్స్, టిహోర్టన్స్ సహా పలు రెస్టారెంట్స్, కేఫ్స్.. మోనిన్ క్లయింట్లుగా ఉన్నాయి. కాగా మోనిన్.. ఢిల్లీ, బెంగళూరుల్లో రెండు ఎక్స్‌పీరియన్స్ స్టూడియోలను నిర్వహిస్తోందని, త్వరలోనే హైదరాబాద్, కోల్‌కతాలకు వీటిని విస్తరించనున్నట్లు ఔరద్ తెలిపారు. కంపెనీ పోర్టుఫోలియోలో సిరప్స్, ఫ్రూట్ మిక్సెస్, క్రష్, సాస్, కాన్సన్‌ట్రేట్స్ సహా 200కు పైగా ఫ్లేవర్స్ ఉన్నాయి.

విశాఖలో అపోలో జినోమిక్స్ ఇనిస్టిట్యూట్

మరో నాలుగు నగరాల్లో కూడా ఏర్పాటు

ముంబై: ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం సహా దేశంలోని తూర్పు, ఉత్తర, సెంట్రల్ ప్రాంతాలకు చెందిన ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో కొత్తగా ఐదు అపోలో జినోమిక్స్ ఇనిస్టిట్యూట్స్‌ను ఏర్పాటు చేయనున్నట్టు అపోలో హాస్పిటల్స్ గ్రూప్ ప్రకటించింది. హైదరాబాద్‌లో ఇప్పటికే ఈ ఇనిస్టిట్యూట్ ఉంది. వీటి ఏర్పాటు వల్ల ప్రధాన క్లినికల్ కేర్ విభాగంలోకి జినోమిక్స్‌ను మరింతగా అనుసంధానం చేయగలుగుతామని పేర్కొంది. విశాఖతో పాటు గువాహటి, భువనేశ్వర్, లఖ్‌నవూ, ఇండోర్‌లలో కూడా ఈ ఇనిస్టిట్యూట్లను ఏర్పాటు చేయనున్నట్టు అపోలో మెడికల్ డైరెక్టర్, సీనియర్ కన్సల్టెంట్ పీడియాట్రిక్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్, హెపటాలజిస్ట్ అనుపమ్ సిబాల్ తెలిపారు. ప్రస్తుతం ముంబై, ఢిల్లీ, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్, అహ్మదాబాద్, కోల్‌కతాల్లో 12 ఇనిస్టిట్యూట్స్ పని చేస్తున్నాయి. వివిధ రోగాలు, వాటికి సంబంధించిన పరిస్థితుల అన్వేషణలో జెనెటిక్స్ కీలక పాత్ర పోషిస్తాయన్నారు. అంతేకాకుండా ఇవి రోగికి వ్యక్తిగత చికిత్సా ప్రణాళికలు తయారు చేసి, మార్గదర్శకం చేయడంలో సహాయకారిగా ఉంటాయన్నారు. ప్రస్తుతం అపోలో జినోమిక్స్ ఇనిస్టిట్యూట్స్ 11 వేల కన్సల్టేషన్ల మైలురాయిని చేరాయని వెల్లడించారు. జినోమిక్ సీక్వెన్సింగ్‌కు రూ.60,000, టార్గెటెడ్ సీక్వెన్సింగ్‌కు రూ.18,000 చార్జి చేస్తున్నట్టు తెలిపారు.

ఓలా ఎలక్ట్రిక్ పండగ ఆఫర్లు

ఎస్1 ధర రూ.49,999కే

న్యూఢిల్లీ: ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన తయారీ సంస్థ ఓలా.. పండగ సీజన్‌లో కస్టమర్లను ఆకట్టుకునేందుకు బంపర్ ఆఫర్లను ప్రకటించింది. ఓలా ముహూర్త్ మహోత్సవ్ పేరుతో తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక విక్రయాలను ప్రారంభించింది. ఈ ఆఫర్‌లో భాగంగా, వివిధ మోడళ్లపై ధరలను భారీగా తగ్గించింది. ఎస్1 ఎక్స్ 2 కేడబ్ల్యూహెచ్, రోడ్‌స్టర్ ఎక్స్ 2.5 కేడబ్ల్యూహెచ్ మోడళ్లు రూ.49,999కే అందిస్తోంది. అలాగే ఎస్1 ప్రో+ 5.2 కేడబ్ల్యూహెచ్, రోడ్‌స్టర్ ఎక్స్ 9.1కేడబ్ల్యూహెచ్ మోడళ్లను రూ.99,999కే అందిస్తున్నట్లు తెలిపింది. కాగా ఈ స్కూటర్లను 4680 భారత్ సెల్ బ్యాటరీ ప్యాక్‌లతో తీసుకువచ్చినట్లు ఓలా తెలిపింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



24వ తేదీ			
హైదరాబాద్	540	విజయవాడ	560
వరంగల్	542	గోదావరి	550
చిత్తూరు	578	విశాఖపట్నం	540
		డజను గుడ్లు రూ.	72

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	105	విజయవాడ	120
వరంగల్	105	గుంటూరు	122
కరీంనగర్	105	ఒంగోలు	122
మహబూబ్‌నగర్	105	చిత్తూరు	105
కర్నూలు	105	నెల్లూరు	110
విశాఖపట్నం	129	అనంతపురం	110
గోదావరి	120		



టీపీసీసీ ఎన్నారై సెల్ ఆధ్వర్యంలో గాంధీభవన్‌లో నిర్వహించిన బతుకమ్మ వేడుకలో మంత్రి పొన్నం, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్

ఇన్ని రోజులూ పేదల రక్తం తాగారు

» బీజేపీ నేతలు చెప్పేవన్నీ గొప్పలే: మంత్రి పొన్నం

హైదరాబాద్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): "జీఎస్టీ పేరుతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గడిచిన 8 ఏళ్లుగా ప్రజల్ని దోచుకుంది. ఇన్ని రోజులూ పేదల రక్తం తాగి.. తాజాగా జీఎస్టీ తగ్గింపుతో పేదలకు లబ్ధి చేసినట్లుగా బీజేపీ నేతలు గొప్పలు చెబుతున్నారు. జీఎస్టీని తెచ్చి పేదల నడ్డి విరిచిందీ.. ఇప్పుడు తగ్గించిందీ వారే!" అంటూ మంత్రి పొన్నం ప్రభాకర్ ధ్వజమెత్తారు. జీఎస్టీ తగ్గింపు అంతా ఎన్నికల డ్రామా అంటూ కొట్టి పారేశారు. జీఎస్టీ తగ్గింపుతో తెలంగాణ రాష్ట్రానికి ఏర్పడుతున్న రూ.7 వేల కోట్ల నష్టాన్ని పూడ్చే బాధ్యత కేంద్రానిదేనని, ఈ విషయంలో కేంద్రంతో మాట్లాడే బాధ్యతను కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు తీసుకోవాలన్నారు.పెట్రోల్, డీజిల్‌లను జీఎస్టీ పరిధిలోకి ఇప్పటిదాకా ఎందుకు తేలేదని ప్రశ్నించారు. గత ప్రభుత్వం కొనుగోలు చేసిన కొన్ని ల్యాండ్ క్రూజర్ వాహనాలపై దర్యాప్తు చేయించి అవకతవకలు ఉంటే చర్యలు తీసుకుంటామన్నారు. వీటికి సంబంధించి పూర్తి వివరాలు తెలుసుకోవాలని రవాణా శాఖ కమిషనర్‌కు సూచించానని తెలిపారు.

గాంధీభవన్‌లో ఘనంగా బతుకమ్మ వేడుక!

టీపీసీసీ ఎన్నారై సెల్ ఆధ్వర్యంలో మంగళవారం గాంధీభవన్‌లో గల్ఫ్ సంక్షేమ బతుకమ్మ వేడుక ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్, జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, ఎన్నారై సెల్ నేతలు వినోద్, శ్రీనివాస్, మహిళా నేతలు వెన్నెల గద్దర్, కాల్వ సుజాత తదితరులు పాల్గొన్నారు.

నేడు 'మన బతుకమ్మ' పాట ఆవిష్కరణ

బతుకమ్మ పండుగ సందర్భంగా రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ సారథ్యంలో 'మన బతుకమ్మ - 2025' పేరిట రూపొందించిన పాట బుధవారం విడుదల కానుంది. కాగా, ఈ పాటకు సంబంధించిన ప్రోమోను పర్యాటక శాఖ మంగళవారం సామాజిక మాధ్యమాల్లో పంచుకుంది. ప్రముఖ ప్రజాకవి, గాయకుడు, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న అద్భుతమైన సాహిత్యం అందించగా.. సురేష్ బొబ్బిలి సంగీతం అందించారు. 'ఓ తంగేడు పూల తల్లి బతుకమ్మ..' అంటూ సాగే ఈ పాటను అదితి భవరాజు, మంగ్లీ, గోరటి వెంకన్న కలిసి ఆలపించగా.. ఈశ్వర్ పెంటి (ప్రేమలో ఫేమ్) నృత్య రూపకల్పన చేశారు. తెలంగాణ పల్లె దృశ్యాలు, పండుగ వాతావరణాన్ని ప్రతిబింబించేలా దర్శకుడు బద్రప్ప గాజుల అద్భుతంగా తెరకెక్కించారు.

వాటా మేరకు వ్యయం భరిస్తారా?

» తెలంగాణ ప్రభుత్వానికి తుంగభద్ర బోర్డు లేఖ

హైదరాబాద్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర జలాల్లో ఏ మేరకు వాటా కలిగి ఉన్నారో.. ఆ మేరకు ప్రాజెక్టు వ్యయానికి సంబంధించిన వాటా భరించడానికి సిద్ధంగా ఉన్నారా? అని తుంగభద్ర బోర్డు తెలంగాణను కోరింది. ఈ మేరకు బోర్డు కార్యదర్శి ఓఆర్‌కే రెడ్డి తెలంగాణ ఈఎన్‌సీ(జనరల్)కు మంగళవారం లేఖ రాశారు. గతేడాది నవంబరు 22న తుంగభద్ర బోర్డు సమావేశం జరిగింది. ఈ సమావేశంలో చర్చించిన నిర్ణయం మేరకు తుంగభద్ర జలాల్లో తెలంగాణ వాటా 8.92 శాతంగా ఉన్నందున.. ఆమేరకు ప్రాజెక్టు వ్యయాన్ని చెల్లించడానికి తెలంగాణ అంగీకరిస్తుందా? అని బోర్డు గుర్తు చేసింది. గత మూడేళ్ల వ్యయం ఆధారంగా చెల్లింపులకు సమ్మతి తెలుపుతారా అంటూ ఈ లేఖ రాసింది.

పోలవరం-బనకచర్లను ఆమోదించండి

» మా వాటాగా 64.75 టీఎంసీలు ఇవ్వండి: కర్ణాటక

ఏపీ చేపట్టిన పోలవరం-బనకచర్ల అనుసంధానానికి తక్షణమే ఆమోదం తెలిపి... 64.75 టీఎంసీల జలాలను తమకు కేటాయించాలని కర్ణాటక మెలికపెట్టింది. ఈ ప్రాజెక్టు ప్రాథమిక సాధ్యాసాధ్యాల నివేదిక (పీఎఫ్ఆర్)పై అభిప్రాయం తెలపాలని కోరుతూ కేంద్ర జల వనరుల సంఘం (సీడబ్ల్యూసీ) కర్ణాటకతో పాటు పలు రాష్ట్రాలకు జూన్ 11న లేఖ రాసిన విషయం తెలిసిందే. దీనికి కర్ణాటక బదులిస్తూ పోలవరం-బనకచర్ల ద్వారా తరలించే 243 టీఎంసీల్లో తమ వాటాగా 64.75 టీఎంసీలను కేటాయించాలని కోరింది. బచావత్ ట్రైబ్యునల్ (కృష్ణా ట్రైబ్యునల్-1) తీర్పులోని క్లాజ్-14(బీ) ప్రకారం తమకు ఈ వాటాపై హక్కు ఉంటుందని పేర్కొంది.

జస్టిస్ ఘోష్ కమిషన్ రిపోర్ట్ కొట్టివేయండి

» హైకోర్టులో ఐఏఎస్ స్మితా సభర్వాల్ పిటిషన్

హైదరాబాద్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన రిపోర్ట్‌ను కొట్టివేయాలని కోరుతూ ఐఏఎస్ అధికారిణి స్మితా సభర్వాల్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని బ్యారేజీల నిర్మాణాలకు సంబంధించిన ఏ నిర్ణయాలతోనూ తనకు సంబంధం లేదని, నిర్ణయ ప్రక్రియలో తాను భాగస్వామిని కూడా కాలేదని పేర్కొన్నారు. బ్యారేజీల నిర్మాణాలకు సంబంధించి స్మితా సభర్వాల్ కీలక పాత్ర పోషించారని, సీఎంవో స్పెషల్ సెక్రటరీగా నిర్మాణాలను పర్యవేక్షించారని కమిషన్ తన రిపోర్ట్‌లో పేర్కొంది. బ్యారేజీల నిర్మాణానికి పరిపాలనాపరమైన అనుమతులు సైతం ఇచ్చారని తెలిపింది. కీలకమైన దస్త్రాలను అప్పటి మంత్రివర్గం ముందు పెట్టకుండా బిజినెస్ రూల్స్‌ను ఉల్లంఘించిన ఆమెపై కఠిన చర్యలు తీసుకోవాలని కమిషన్ ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. అయితే కమిషన్ తనకు వ్యతిరేకంగా రిపోర్ట్ ఇవ్వడానికి ముందు కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ యాక్ట్ సెక్షన్ 8-బీ, 8-సీ ప్రకారం నోటీసులు ఇవ్వలేదని ఆమె తెలిపారు. తన వాదన వినలేదని అందువల్ల కొట్టేయాలని విజ్ఞప్తి చేశారు.

గ్రూప్-1 అప్పీళ్లపై నేడు విచారణ

గ్రూప్-1 ఫలితాలను కొట్టివేయడంతోపాటు సమాధాన పత్రాలను పునః మూల్యాంకనం చేయాలని ఆదేశిస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ దాఖలయిన అప్పీళ్లు బుధవారం హైకోర్టులో విచారణకు రానున్నాయి. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం విచారణ చేపట్టనుంది. సింగిల్ జడ్జి తీర్పుపై మొత్తం 15 అప్పీళ్లు దాఖలు కాగా ఇందులో టీజీపీఎస్సీ 12 అప్పీళ్లు, పలువురు ఎంపికైన అభ్యర్థులు మూడు అప్పీళ్లు దాఖలు చేశారు. వీటిలో ఒక పిటిషన్ మంగళవారం చీఫ్ జస్టిస్ ధర్మాసనం ఎదుట విచారణ రాగా బుధవారం మిగతా పిటిషన్లన్నీ విచారణకు వస్తున్న నేపథ్యంలో అన్నింటిని కలిపి వినాలని అడ్వకేట్ జనరల్ ఏ సుదర్శన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఇందుకు అంగీకరించిన ధర్మాసనం విచారణను వాయిదా వేసింది.

బతుకమ్మ, దసరాకు 7 వేల బస్సులు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): బతుకమ్మ, దసరా పండుగల నేపథ్యంలో ఊళ్లకు వెళ్లే ప్రయాణికుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపేందుకు సిద్ధమవుతోంది. సెప్టెంబరు 27 నుంచి అక్టోబరు 2 వరకు 7 వేలకుపైగా స్పెషల్ బస్సులు నడపాలని ఆర్టీసీ ప్రణాళికలు సిద్ధం చేసింది. ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే కేపీహెచ్‌బీ కాలనీ, ఉప్పల్ క్రాస్‌రోడ్స్, ఉప్పల్ బస్టాండ్, దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్, ఆరాంఘర్, తదితర ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులు నడిపేలా ఆర్టీసీ ఏర్పాట్లు చేసింది. గత ఏడాది కంటే ఈసారి అదనంగా 617 ప్రత్యేక బస్సులను ఆర్టీసీ నడుపుతోంది. ప్రయాణికుల రద్దీని బట్టి బస్సుల సంఖ్యను పెంచుతామని అధికారులు తెలిపారు. టికెట్లను tgsrtcbus.in లో బుక్ చేసుకోవాలని సూచించారు. స్పెషల్ సర్వీసుల సమాచారం కోసం 040-69440000, 040-23450033ను సంప్రదించాలని కోరారు.

మేడారం జాతరకు జాతీయ హోదా ఇవ్వాలి

కుంభమేళాకు వేల కోట్లు ఇస్తున్న కేంద్రం.. ఆదివాసీ జాతరకు ఎందుకు ఇవ్వడంలేదు?

- **గద్దెల పునఃనిర్మాణం.. ఓ భావోద్వేగం**
- **పోరాటానికి, స్ఫూర్తి సమ్మక్క సారలమ్మ**
- **తల్లుల ఆశీర్వాదంతోనే ప్రజాప్రభుత్వం**
- **ఆదివాసీల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం**
- **మహాజాతరకు మళ్లీ వస్తా: సీఎం రేవంత్**



ములుగు జిల్లా మేడారంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పొంగులేటి, సీతక్క, కొండా సురేఖ తదితరులు

వరంగల్/ములుగు/తాడ్వాయి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మేడారం మహాజాతరను కేంద్ర ప్రభుత్వం జాతీయ పండుగగా గుర్తించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరారు. కుంభమేళాకు కేటాయిస్తున్నట్లుగానే రూ.వేల కోట్ల నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. మంగళవారం ములుగు జిల్లా మేడారం మహాజాతరలో సమ్మక్క, సారలమ్మ గద్దెలు, ప్రాంగణం పునఃనిర్మాణ పనులను సీఎం ప్రారంభించారు. పునఃనిర్మాణ మాస్టర్ ప్లాన్‌పై ఆదివాసీలు, గిరిజనులు, అధికారులు, ప్రజాప్రతినిధులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో, అనంతరం మేడారంలో జరిగిన బహిరంగ సభలో మాట్లాడారు. "కుంభమేళాకు వేల వేల కోట్లు ఇస్తున్నారు. కానీ, మా ఆదివాసీ కుంభమేళాకు ఒక్క రూపాయి ఇవ్వడానికిగానీ, జాతీయ పండుగగా గుర్తించడానికిగానీ కేంద్రానికి ఎందుకో మనసు రావడం లేదు. కుంభమేళా, ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య మాత్రమే కాదు.. తెలంగాణ ప్రాంతంలో ములుగు అడవుల్లో ఉన్న సమ్మక్క, సారలమ్మ కూడా ఓ గొప్ప దేవాలయం. పోరాట పటిమకు, పౌరుషానికి మారుపేరు. రాచరికంపై తిరుగుబాటు చేసి.. జెండా ఎగురవేసిన సమ్మక్క, సారలమ్మ జాతరకు జాతీయ పండుగ గుర్తింపు రావాలి. వేల కోట్ల రూపాయలను కేంద్ర ప్రభుత్వం కేటాయించాలి" అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ నుంచి గెలిచిన కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్.. ఈ విషయంపై దృష్టి పెట్టాలన్నారు. పోరాటానికి, పౌరుషానికి సమ్మక్క, సారలమ్మలు స్ఫూర్తిగా నిలుస్తారని, తాను ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పటి నుంచి తల్లులను దర్శించుకుంటున్నానని తెలిపారు. 2023 ఫిబ్రవరి 6న మేడారం సమ్మక్క, సారలమ్మ ఆశీర్వాదం తీసుకుని ఇక్కడి నుంచే పాదయాత్రకు పూనుకున్నానని, దొరల పాలన నుంచి ప్రజాపాలన తీసుకవస్తామని ప్రకటించానని తెలిపారు. ఆ తల్లుల దీవెనలతో ప్రజలు ఆశీర్వదించారని, నేడు అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ముందుకు వెళుతున్నామని చెప్పారు.

గద్దెల పునఃనిర్మాణం గొప్ప అవకాశం..

సమ్మక్క, సారలమ్మ గద్దెల, ప్రాంగణ అభివృద్ధి పునఃనిర్మాణ కార్యక్రమం తనకు, మంత్రి సీతక్కకు ఈ జన్మలో లభించిన గొప్ప అవకాశమని సీఎం రేవంత్ అన్నారు. ఇది బాధ్యత కాదని, బాధ్యతతో కూడిన భావోద్వేగమని చెప్పారు. ఈ ఆలయ అభివృద్ధికి తాము ఎన్ని కోట్లయినా ఖర్చుపెడతామన్నారు. ప్రకృతి దేవతల చరిత్ర రాబోయే వందల, వేల ఏళ్ల నిలిచి ఉండేలా గద్దెలు, ప్రాంగణం పునఃనిర్మించేందుకు ప్రభుత్వం దృష్టి పెట్టిందన్నారు. గిరిజనులు, ఆదివాసీల సంప్రదాయానికి గౌరవం ఇవ్వాలని ఆలోచనతో పూజారులు, అదివాసీల అభిప్రాయాలు తీసుకునేందుకు ఇక్కడకు వచ్చానని అన్నారు. ఆదివాసీల సంప్రదాయంలో వీసమెత్తు కూడా తేడా రాకుండా పునఃనిర్మాణ పనులు జరపాలనేదే తమ అభిమతమని స్పష్టం చేశారు. అందుకే అభివృద్ధి పనుల్లో ఆదివాసీలనూ భాగస్వాములను చేస్తామన్నారు. సిమెంట్‌తో కట్టిన ఏ కట్టడమైనా వందేళ్ల జీవితకాలమే ఉంటుందని, రాతితో నిర్మిస్తే వందల, వేల ఏళ్ల జీవితకాలం ఉంటుందని సీఎం తెలిపారు. అందుకే సమ్మక్క, సారలమ్మ గద్దెలు, ప్రాంగణాన్ని రాతితో నిర్మించాలని నిర్ణయించామని పేర్కొన్నారు. ఈ పనులను వచ్చే ఏడాది జాతర ప్రారంభానికి ముందే వంద రోజుల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. ఆలయంతో పాటు జంపన్నవాగు, రహదారుల నిర్మాణం కూడా పూర్తి చేస్తామని తెలిపారు. మాస్టర్ ప్లాన్ డిజైన్ వీడియోను సభా వేదికపై ఎల్ఈడీ స్క్రీన్‌పై ప్రదర్శించారు. మాస్టర్‌ప్లాన్‌కు సభికుల నుంచి ఆమోదం తీసుకున్నారు.

ఆదివాసీల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం..

అభివృద్ధి అంటే అద్దాల మేడలు, రంగుల గోడలే కాదని, ప్రజల జీవన ప్రమాణాలు పెంచడమని సీఎం రేవంత్ అన్నారు. ముఖ్యంగా ఈ దేశ మూలవాసులైన ఆదివాసీలు, గిరిజనుల ప్రాంతాలను అభివృద్ధిలో ముందుకు నడిపించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. ఒక్కో నియోజకవర్గానికి 3,500 ఇండ్లు, రాష్ట్రవ్యాప్తంగా 4.50లక్షల ఇందిరమ్మ ఇండ్లు మంజూరుచేశామని చెప్పారు.

ఒకే వరుసలో గద్దెలు.. గ్రానైట్‌తో సుందరీకరణ

మేడారంలో ప్రస్తుతం ఉన్న దేవతల గద్దెలను ఒకే వరుసలో నిర్మించేలా ప్రణాళిక రూపొందించారు. సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెలను ఒకే వరుసలో నిర్మించనున్నారు. సమ్మక్క, సారలమ్మ పాత గద్దెలను ముట్టుకోకుండానే చుట్టూ గ్రానైట్‌తో సుందరీకరించనున్నారు. అలాగే సారలమ్మ గద్దె తరువాత వరుస క్రమంలో పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెలను కొత్తగా నిర్మించనున్నారు. ప్రస్తుతం గద్దెల ప్రాంగణంలో ఉన్న చెట్లతోపాటు ఏ కట్టడాన్నీ కూల్చకుండా సాలారాన్ని నాలుగు వైపులా 20 అడుగుల చొప్పున విస్తరించేలా రూపకల్పన చేశారు. నాలుగు ప్రవేశ ద్వారాలతో పాటు మరో నాలుగు బయటకు వెళ్లే ద్వారాలను ఏర్పాటు చేస్తున్నారు.



సీఎం తులాభారం..

68 కిలోల బంగారం సమర్పణ

మేడారంలో సీఎం రేవంత్‌రెడ్డి సుమారు రెండున్నర గంటలు వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. షెడ్యూల్ ప్రకారం మధ్యాహ్నం 12 గంటలకు రావాల్సి ఉన్నప్పటికీ వాతావరణం అనుకూలించకపోవటంతో 25 నిమిషాల ఆలస్యంగా వచ్చారు. మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డితో కలిసి మేడారం చేరుకున్న ముఖ్యమంత్రి.. ముందుగా మేడారం జాతర ప్రాంతాన్ని హెలికాప్టర్ నుంచి ఏరియల్ సర్వే ద్వారా వీక్షించారు. అక్కడి నుంచి నేరుగా సమ్మక్క-సారలమ్మ ఆలయానికి చేరుకొని తులాభారం వేశారు. రేవంత్‌రెడ్డి 68 కిలోల బంగారాన్ని (బెల్లం) సమర్పించారు. సీఎంకు ఆదివాసీ కళా నృత్యాలతో దేవస్థానం ప్రధాన ముఖద్వారం నుంచి పూజారులు, దేవాదాయ శాఖ అధికారులు ఘనస్వాగతం పలికారు. అనంతరం సమ్మక్క-సారలమ్మ గద్దెలకు చేరుకొని తల్లులను రేవంత్ దర్శించుకున్నారు. గద్దెలతో పాటు ప్రాంగణాన్ని పరిశీలించారు. అక్కడి నుంచి జాతర ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఆదివాసీలు, గిరిజనులు, పూజారులు, ప్రజా ప్రతినిధులతో జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించారు. మధ్యాహ్నం 2:45 గంటలకు హైదరాబాద్‌కు హెలికాప్టర్‌లో తిరుగు ప్రయాణమయ్యారు. ఈ కార్యక్రమాల్లో మంత్రులు కొండా సురేఖ, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

పట్నాకు సీఎం రేవంత్ పయనం

» టీపీసీసీ చీఫ్ సైతం

హైదరాబాద్ : బిహార్ రాజధాని పట్నాలో బుధవారంనాడు జరగనున్న కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ కమిటీ(సీడబ్ల్యూసీ) విస్తృత సమావేశంలో పాల్గొనేందుకు సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం సాయంత్రం బయలుదేరి వెళ్లారు. ఈ సమావేశంలో ఆయనతోపాటు టీపీసీసీ చీఫ్ మహేష్‌గౌడ్, సీడబ్ల్యూసీ శాశ్వత ఆహ్వానితులు మీనాక్షి నటరాజన్, దామోదర రాజనర్సింహ, ప్రత్యేక ఆహ్వానితుడు వంశీచంద్‌రెడ్డి పాల్గొంటారు.

26న ఏటీసీ కేంద్రాల్ని ప్రారంభించనున్న సీఎం

హైదరాబాద్‌లోని మల్లెపల్లి ఐటీఐతోపాటు వివిధ ఐటీఐల్లో నిర్మించిన అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ)లను ఈ నెల 26న సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారు. ఒకే రోజు రాష్ట్ర వ్యాప్తంగా 50కి పైగా ఏటీసీల ప్రారంభానికి సర్కారు ఏర్పాట్లు చేస్తోంది. ఒక ఎకరం విస్తీర్ణంలో రాష్ట్ర ప్రభుత్వం, టాటా టెక్నాలజీస్ సంయుక్తంగా ఏటీసీలను ఏర్పాటు చేస్తున్నాయి.

రాష్ట్రంలోకి 3,745 కోట్ల పెట్టుబడులు

» మూడు కంపెనీలకు ఆమోదం

» 1,518 మందికి ఉపాధి, ఉద్యోగావకాశాలు

» పండ్ల సాగు రైతులకు ప్రోత్సాహం : డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో మరో మూడు భారీ కంపెనీలు రూ.3,745 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నాయని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. వీటి ద్వారా 1,518 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలగనున్నాయని వివరించారు. ఈమేరకు ఆ మూడు కంపెనీల పెట్టుబడులకు క్యాబినెట్ సబ్‌కమిటీ ఆమోదం తెలిపిందన్నారు. పరిశ్రమల ప్రోత్సాహక క్యాబినెట్ సబ్‌కమిటీ సమావేశం మంగళవారం సచివాలయంలో జరిగింది. కమిటీ సభ్యులైన మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. మహేశ్వరంలో కొత్త యూనిట్‌ను ఏర్పాటు చేయనున్న జేఎస్‌డబ్ల్యూ యూఏవీ లిమిటెడ్‌కు, గ్యాస్ ఇన్సులేటెడ్ స్విచ్‌గేర్, బుషింగ్స్ ప్లాంటును ఏర్పాటు చేయనున్న తోషిబా ట్రాన్స్‌మిషన్ అండ్ డిస్ట్రిబ్యూషన్ సిస్టంకు, హిందుస్థాన్ కోకాకోలా బెవరేజెస్ కంపెనీ యూనిట్ ఏర్పాటుకు మంత్రివర్గ ఉపసంఘం ఆమోదం తెలిపిందని వివరించారు. భారీగా పెట్టుబడులు పెడుతూ యువత, పండ్ల సాగు రైతులను ప్రోత్సహించేలా బహుళ జాతి కంపెనీలు రాష్ట్రానికి తరలి వస్తున్నాయన్నారు. హిందుస్థాన్ కోకాకోలా యూనిట్ ద్వారా రూ.2,398 కోట్ల పెట్టుబడులు, 600 మందికి ఉపాధి లభిస్తుందని వివరించారు. రూ.785 కోట్ల పెట్టుబడితో వస్తున్న జేఎస్‌డబ్ల్యూ కంపెనీ ద్వారా 364 మందికి ఉపాధి లభిస్తుందని, రూ.562 కోట్ల పెట్టుబడితో వస్తున్న తోషిబా కంపెనీ ద్వారా 554 మందికి ఉపాధి లభిస్తుందని వివరించారు. దావోస్‌తో పాటు వివిధ దేశాల నుంచి రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి కనబర్చిన వివిధ కంపెనీల తాజా పరిస్థితి, జరిగిన ఎంవోయూలు, విధి విధానాలను క్యాబినెట్ సబ్‌కమిటీ సమీక్షించింది.

బాలికల ఉన్నత విద్యకు అజీమ్ ప్రేమ్‌జీ స్కాలర్‌షిప్

హైదరాబాద్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యలో బాలికలను ప్రోత్సహించడానికి అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ ప్రత్యేక స్కాలర్‌షిప్ పథకాన్ని ప్రకటించింది. దీనికి సంబంధించిన గోడపత్రికను తెలంగాణ ఉన్నత విద్యామండలి అధ్యక్షుడు ఆచార్య బాలకిష్టారెడ్డి, కార్యదర్శి శ్రీరాం వెంకటేష్ మంగళవారం తమ కార్యాలయంలో విడుదల చేశారు. దరఖాస్తుదారులు తప్పనిసరిగా పాఠశాల, జూనియర్ కాలేజీల్లోనే చదివి ఉండాలి. ఈ కార్యక్రమం ద్వారా 15వేల మంది బాలికలకు డిగ్రీ పూర్తయ్యేంతవరకు ఏడాదికి రూ.30వేల స్కాలర్‌షిప్ ఉంటుందని, ఈ అవకాశాన్ని విద్యార్థులు ఉపయోగించుకోవాలని బాలకిష్టారెడ్డి కోరారు. దరఖాస్తులు ఆన్‌లైన్‌లో అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ డాట్ ఆర్గ్ వెబ్‌సైట్ ద్వారా స్వీకరిస్తామని ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు.

కృష్ణా జలాల్లో 70% వాటా ఇవ్వాల్సిందే!

» నదీ జలాల్లో తెలంగాణ హక్కుల కోసం రాజీలేని పోరాటం చేస్తాం

» పక్క రాష్ట్రాల్లో ఏ పార్టీ అధికారంలో ఉన్నా.. చుక్క నీటిని వదులుకోం

» ఆల్మట్టి ఎత్తు పెంపు సరికాదు.. సుప్రీంలో గట్టి వాదనలు వినిపిస్తాం

» మీడియాతో మంత్రి ఉత్తమ్



న్యూఢిల్లీ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కృష్ణా జలాల్లో తెలంగాణకు 70 శాతం వాటా దక్కాల్సిందేనని రాష్ట్ర నీటి పారుదలశాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కృష్ణా-గోదావరి జలాల్లో హక్కులపై పోరాటంలో రాజీ పడే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. మంగళవారం ఢిల్లీలో కృష్ణా ట్రైబ్యునల్ విచారణలో భాగంగా తెలంగాణ తరఫున వాదనలు వినిపించారు. అనంతరం ఉత్తమ్ మీడియాతో మాట్లాడారు. విచారణ తుది దశకు చేరుకుందని, ఫిబ్రవరి నుంచి తెలంగాణ వాదనలు వినిపిస్తోందని చెప్పారు. సెక్షన్-3 రిఫరెన్స్ కింద విచారణ జరుగుతోందని, తెలంగాణ తరఫున సీనియర్ న్యాయవాది ఎస్.వైద్యనాథన్ వాదనలు వినిపిస్తున్నారని తెలిపారు. వరసగా మంగళ, బుధ, గురువారాల్లో వాదనలు వినిపించేందుకు ట్రిబ్యునల్ అవకాశం కల్పించిందని చెప్పారు. కృష్ణా జలాల విషయంలో తెలంగాణకు న్యాయమైన వాటా రావాలని కృష్ణా జలాల వివాదాల ట్రైబ్యునల్-2 (కేడబ్ల్యూడీటీ-2) ముందు తెలంగాణ బలమైన వాదనలు వినిపిస్తోందన్నారు. మొత్తం 1050 టీఎంసీల్లో దాదాపు 70 శాతం అంటే 763 టీఎంసీలను తెలంగాణకు కేటాయించాలని చెప్పారు. కృష్ణా ట్రైబ్యునల్ ముందు స్వయంగా నీటి పారుదల శాఖ మంత్రి హాజరుకావడం దేశంలో ఇదే మొదటిసారన్నారు. తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని ఉత్తమ్ తెలిపారు. సగటు ప్రవాహాలపై మిగిలిన మొత్తం నీటిని వినియోగించుకునే హక్కు తెలంగాణకే ఉందన్నారు. ఇది కేవలం డిమాండ్ మాత్రమే కాదని, దశాబ్దాలుగా తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని సరి చేసే చర్య అని చెప్పారు. కేడబ్ల్యూడీటీ-2 అప్పట్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు 1005 టీఎంసీలు కేటాయించిందని గుర్తుచేశారు. సగటు ప్రవాహాల కంటే ఎక్కువగా వచ్చే నీటిని కూడా వినియోగించుకునే స్వేచ్ఛను ఇచ్చారన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత కొత్తగా బేసిన్ పారామీటర్ల ఆధారంగా వాటాను కోరుతున్నామని తెలిపారు. క్యాచ్‌మెంట్ ఏరియా, జనాభా, కరవు ప్రాంత విస్తీర్ణం, సాగు భూములు వంటి అంశాల ఆధారంగా లెక్కలు వేశామని.. మొత్తం 763 టీఎంసీలు రావాల్సి ఉందని చెప్పారు. అలాగే, ఆంధ్రప్రదేశ్ తనకు కేటాయించిన 811 టీఎంసీల్లో పెద్ద మొత్తాన్ని బేసిన్ వెలుపలికి మళ్లించిందని ఆరోపించారు.

బీఆర్ఎస్ తీరుతో పదేళ్లుగా తీరని నష్టం..

గత బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం 299 టీఎంసీలను తెలంగాణకు కేటాయించి, 512 టీఎంసీలను ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన ఒప్పందానికి అంగీకరించడం ద్వారా రైతులు, కరవు ప్రాంత ప్రజలను మోసగించిందని ఉత్తమ్ మండిపడ్డారు. దాదాపుగా పదేళ్ల ఆ ఒప్పందానికి బీఆర్ఎస్ అంగీకరించిందని తెలిపారు. అందుకే, ఇప్పుడు ఆ ఫైలును మళ్లీ తెరిచి మొదటి నుంచి వాదనలు వినిపిస్తున్నామని స్పష్టం చేశారు.

పొరుగు రాష్ట్రాల్లో ఎవరున్నా రాజీ పడేది లేదు

పొరుగు రాష్ట్రాల్లో ఏ పార్టీ అధికారంలో ఉన్నా రాజీ పడే ప్రసక్తే లేదని ఉత్తమ్ స్పష్టం చేశారు. తెలంగాణ ప్రయోజనాలే తమకు ముఖ్యమన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ ఉన్నా, ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ ఉన్నా, మహారాష్ట్రలో బీజేపీ ఉన్నా, తెలంగాణ తన హక్కుల కోసం పోరాడుతుందని తేల్చి చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లోనూ చుక్క నీటిని కూడా వదులుకునే ప్రసక్తే లేదన్నారు. ఆల్మట్టి ఆనకట్ట ఎత్తు పెంచే కర్ణాటక యోచనను తీవ్రంగా వ్యతిరేకించారు. అలాంటి నిర్ణయం తెలంగాణకు నేరుగా నష్టం చేస్తుందన్నారు. దీన్ని అడ్డుకోవడానికి సుప్రీంకోర్టులో బలమైన వాదనలు వినిపిస్తామని తెలిపారు. ఈ అంశాన్ని సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా సమీక్షించారని, పూర్తి స్థాయి వాదనలు వినిపించాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని చెప్పారు. బ్రిజేష్ కుమార్ నేతృత్వంలోని విచారణలో తెలంగాణకు న్యాయం జరుగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగం నిర్మాణానికి కేంద్రం ఓకే!

(మొదటిపేజీ తరువాయి)

పరిధిలో చేపట్టాలనేదానిపై స్పష్టత వస్తుందని సంబంధిత వర్గాల ద్వారా తెలిసింది. ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగంతో పాటు దక్షిణ భాగాన్ని కూడా నిర్మించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖలు రాసింది. భూముల సేకరణకు సహకరించడంతో పాటు చెల్లించాల్సిన పరిహారంలో రాష్ట్ర వాటాగా 50 శాతం ఇస్తామని తెలిపింది. ఈ క్రమంలోనే కేంద్రం దక్షిణ భాగం రహదారిని నిర్మించేందుకు సమ్మతించినట్లు సమాచారం. అయితే ఈ రహదారి మంజూరైన సమయంలో ప్రాథమిక అలైన్‌మెంట్ ప్రకారం 189 కి.మీ. దూరం ఉండగా.. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన అలైన్‌మెంట్ ప్రకారం 11 కి.మీ. పెరిగి 201 కి.మీ.కు చేరింది. దాని ప్రకారమే రహదారిని నిర్మించాలంటూ కేంద్రాన్ని కోరుతోంది. అంతేకాకుండా ఉత్తర భాగంతో పాటు దక్షిణ భాగానికి అవసరమైన భూములనూ సేకరిస్తే ధరల్లో ఎలాంటి మార్పులు ఉండబోవని, నిర్మాణ వ్యయంలోనూ మార్పులుండవని తెలిపింది.

దక్షిణ భాగం అలైన్‌మెంట్ ఇలా..

దక్షిణ భాగం కోసం రాష్ట్ర ప్రభుత్వం మూడు రకాల అలైన్‌మెంట్లను రూపొందించింది. మొదటి ప్రతిపాదన 189.5 కి.మీ., రెండోది 201 కి.మీ., మూడోది 218 కి.మీ.గా ఉంది. మొదటి ప్రతిపాదనలో 96 శాతం వ్యవసాయ భూమి, 3 శాతం నిర్మాణాలు ఉండగా.. మూడో దాంట్లోనూ అంతే ఉన్నాయి. రెండో ప్రతిపాదనలో 99% వ్యవసాయ భూములు, ఒక శాతం నిర్మాణాలు ఉన్నాయి. ఈ ప్రతిపాదనలో అటవీ భూములు లేవు. మొదటి, మూడో ప్రతిపాదనకు వెళితే అటవీ అనుమతులు తీసుకోవాల్సి ఉన్నందున.. రాష్ట్ర మంత్రివర్గం రెండో ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. ఇందులో కేవలం పర్యావరణ అనుమతులు మాత్రమే తీసుకోవాల్సి ఉంటుంది. రెండో అలైన్‌మెంట్‌లో 2,010 హెక్టార్ల భూమి అవసరం ఉంటుందని, 55 నిర్మాణాలను తొలగించాల్సి ఉంటుందని తేల్చారు. ఇప్పటికే ఉన్న పరిశ్రమలతో పాటు కొత్త వాటిని అనుసంధానించవచ్చని భావించిన ప్రభుత్వం రెండో అలైన్‌మెంట్‌ను ఆమోదించింది. ఈ మార్గంలో నాలుగు జాతీయ రహదారులు, ఒక రాష్ట్ర రహదారి అనుసంధానం కానుంది. చౌటుప్పల్ దగ్గర ప్రారంభమయ్యే ఈ రోడ్డు ఆమనగల్, చేవెళ్ల, వికారాబాద్ మీదుగా సంగారెడ్డి వరకు మొత్తం 201 కి.మీ. ఉండనుంది. దాదాపు 16 గ్రామాలపై ప్రభావం పడనుంది. ఫ్యూచర్‌సిటీ, ఎయిర్‌పోర్టు, ఔటర్ రింగు రోడ్డు, బెంగళూరు హైవేలన్నీ ఈ మార్గంలోనే అధిక భాగం ఉండడంతో ఈ రోడ్డుపై వాణిజ్య, వ్యాపార కార్యకలాపాలు అధికంగా ఉంటాయని ప్రభుత్వం భావిస్తోంది. భూ పరిహారం చెల్లింపులు, నిర్మాణం కోసం దాదాపు 16 వేల కోట్ల వరకు నిధులు అవసరమవుతాయని ప్రాథమిక అంచనా.

అలైన్‌మెంట్‌పై వివాదాలిలా..

ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగంలోని కొన్ని ప్రాంతాల్లో భూసేకరణపై, దక్షిణ భాగంలో కొన్ని ప్రాంతాల్లో అలైన్‌మెంట్‌పై కొంత వివాదం జరిగింది. ఉత్తర భాగంలో చౌటుప్పల్ దగ్గర అధికంగా భూములు కోల్పోవాల్సి వస్తోందని, పరిహారం చాలా తక్కువగా ఉందని అక్కడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక దక్షిణ భాగం విషయంలోనూ చౌటుప్పల్ నుంచి కొద్దిగా ముందుకువెళ్లిన తర్వాత అలైన్‌మెంట్ మారిందని, కొంతమంది ప్రయోజనం కోసమే అలా చేశారంటూ రైతులు ఆందోళన చేస్తున్నారు. ఇటీవల దక్షిణ భాగానికి సంబంధించి హెచ్ఎండీఏ నోటిఫికేషన్ ప్రకటించిన తర్వాత ఆ కార్యాలయానికి ఫిర్యాదులు వెల్లువలా వస్తున్నాయి. అలైన్‌మెంట్‌పై ప్రభుత్వం పునరాలోచన చేయాలంటూ ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ క్రమంలో కేంద్రం నిర్ణయం తీసుకోవడం చర్చనీయాంశంగా మారింది.







Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.